www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 218 | సోమవారం | 28 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00






31 నుంచి 13 వరకు పార్లమెంట్

ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్

ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఇవే ఆఖరు సమావేశాలు

10

అయోధ్య విచారణ 29న ఉండదు



రాజ్యాంగ ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి అందుబాటులో ఉండకపోవడంతో ఆ రోజు విచారణ రద్దుకు సుప్రీం కోర్టు నిర్ణయం

6

ఆర్‌ఆర్‌ఆర్‌పై నేడు గడ్కరీ సమీక్ష

3

కన్నీటి వాన

అకాల వర్షాలకు మునిగిపోయిన మిర్చి, పత్తి, వేరుశనగ

ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో తడిసి ముద్ద అయిన మిర్చి

కళ్లాల్లో వర్ష కల్లోలం

పొలాల్లోనే నీరుగారిన పత్తి

మహబూబ్‌నగర్ జిల్లాలో దెబ్బతిన్న వేరుశనగ

పొలాల్లోనే తడిసి మొలకెత్తిన పల్లీపంట

మరి రెండు రోజులు వానలు ఉంటాయన్న హెచ్చరికతో బెంబేలెత్తుతున్న రైతులు

ధర పెరిగినా ఫలితం చూడలేని దుస్థితిలో పత్తి సాగుదార్లు





వర్షాలు మరి రెండు రోజులు

వణికిస్తున్న చలి గాలులు

3



మనతెలంగాణ/వరంగల్/-ఖమ్మం/మహబూబ్‌నగర్

అకాల భారీ వర్షాలతో మిర్చి పంటకు తీవ్రం నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కళ్లాల్లో ఆరపోసిన మిర్చికూడా తడిసి ముద్దయిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 24 వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 60 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగవుతోంది. కొందరు మిర్చిని ఏరి కల్లాల్లోనే ఆరబెట్టారు. ఒక్కసారిగా వర్షం రావడంతో అక్కడే తడిసి నీటిపాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మిర్చి కాయ లోపలి భాగానికి నీరు పోవడంతో మచ్చబారి రంగు ఎలిసిపోతుంది. దాని ఫలితంగా పంట మొత్తం అక్కరకు రాకుండా పోయిందని రైతులు తరువాయి 6లో



సైనాకు టైటిల్

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ సైనా నెహ్వాల్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో స్పెయిన్ క్రీడాకారిణి కరోలినా మారిన్ గాయం వల్ల అర్ధాంతరంగా తప్పుకోవడంతో సైనాను విజేతగా ప్రకటించారు. గాయం వల్ల మారిన్ మధ్యలోనే నిష్క్రమించింది. దీంతో మ్యాచ్ పూర్తి కాకుండానే సైనా టైటిల్‌ను సొంతం చేసుకుంది. సైనాకు ఈ ఏడాది ఇదే తొలి టైటిల్ కావడం విశేషం.

11



మూడో సారి

మెల్‌బోర్న్: సెర్బియా దిగ్గజం, టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ ఏడో ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించి చరిత్ర సృష్టించాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో జకోవిచ్ 6–3, 6–2, 6–3తో రెండో సీడ్, స్పెయిన్ బుల్ రఫేల్ నాదల్‌ను చిత్తు చేశాడు. జకోవిచ్‌కు ఇది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం.

పల్లె రోడ్లపై నజర్

గ్రామాలకు బిటి రోడ్ల నిర్మాణంపై పంచాయతీ రాజ్ అధికారుల అధ్యయనం

ప్రస్తుతం పంచాయతీల పరిధిలో 6,617 కి.మీ మేర మట్టి రోడ్లే

బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించనున్న రాష్ట్ర ప్రభుత్వం



మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు నాణ్యమైన రహదారులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవలి సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్ శాఖను ఆదేశించడంతో క్షేత్రస్థాయిలో ఆ శాఖ అధికారులు లెక్కలు తీస్తున్నారు. ఏ పంచాయతీలో రోడ్ల విస్తీర్ణం ఏ మేరకు ఉంది, దాని నాణ్యత ఎలా ఉంది, మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఎలాంటిది, ఎంత ఖర్చవుతుంది, ఎన్ని చోట్ల కొత్తగా రోడ్లు వేయాల్సి ఉంటుంది తదితర వివరాలన్నింటినీ పంచాయతీరాజ్ శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. పంచాయతీల పరిధిలో ఉన్న మొత్తం రోడ్లలో 6617 కి.మీ. మేర రోడ్లు మట్టిరోడ్లేనని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అన్ని పంచాయతీలకు బి.టి. రోడ్లను నిర్మిస్తామని సిఎం స్పష్టం చేసినందున ప్రస్తుతం పంచాయతీల్లో గ్రావెల్ (మట్టి) రోడ్ల విస్తీర్ణం ఎంత ఉంది, దాని స్థానంలో బి.టి.రోడ్లను నిర్మించడానికయ్యే ఖర్చు తదితరాలపై అధ్యయనం జరుగుతోంది. రహదారుల తరువాయి 6లో



ఉన్న కోటాకు ముప్పు లేదు:ప్రధాని

- మదురైలో మోడీకి నిరసన జెండాలు

12



వందే భారత్ ఎక్స్‌ప్రెస్

ఢిల్లీ, వారణాసి మధ్య తిరిగే ట్రైన్-18కి నామకరణం

10

మిషన్ 16 ఎంఎల్‌ఎలదే బాధ్యత

పార్లమెంట్ ఎన్నికల్లో శాసన సభ్యులకు బాధ్యతలు

ఖమ్మం, నల్గొండ జిల్లాలపై టిఆర్‌ఎస్ దృష్టి

మన తెలంగాణ/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించాలంటే 16 పార్లమెంట్ స్థానాలను సాధించాలని ప్రకటించిన టిఆర్‌ఎస్ ఆమేరకు పార్టీశ్రేణులను తీర్చిదిద్దుతుంది. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో జిల్లాలవారిగా శాసనసభ్యులను గెలిపించే బాధ్యతలు తీసుకున్న పార్లమెంట్ సభ్యులందరినీ గెలిపించే బాధ్యత ఎంఎల్‌ఏలపై పార్టీ మోపింది. శాసనసభ ఎన్నికల ఫలితాల మేరకు విశ్లేషించిన టిఆర్‌ఎస్ 16 స్థానాల్లో పార్లమెంట్ సభ్యులు తప్పనిసరిగా గెలుస్తారనీ అయితే భారీ మెజారిటీతో గెలిపించేందుకు ఎంఎల్‌ఏలు కృషిచేయాలని పార్టీ అధిష్టానం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. అయితే 119 నియోజకవర్గాల్లోని 89 స్థానాల్లో భారీమెజారిటీ వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ మిగతా నియోజకవర్గాల్లో అనేక సున్నితాంశాలకు



ట్రాక్టర్ గుర్తు తోడై ఫలితాలు సాధించలేకపోయినట్లు టిఆర్‌ఎస్ భావిస్తుంది. ఈనేపథ్యంలో సమస్యలను అధిగమించి ఖచ్చితంగా 16 పార్లమెంట్ స్థానాల్లో భారీ మెజారిటీతో గెలిచేందుకు శాసనసభ్యులు తరువాయి 6లో

కుంచెపోటు



13 నుంచి కృష్ణా జలాల ట్రిబ్యునల్ విచారణ



మన తెలంగాణ/హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వచ్చే నెల 13వ తేదీ నుంచి విచారణ జరపనుంది. ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో చేపట్టే తరువాయి 6లో

బాబోయ్ నురగ

చెరువులో నురగతో హడలిపోతున్న కూకట్‌పల్లి ధరణినగర్ వాసులు

వర్షం వచ్చినప్పుడల్లా ఇదే బెడద

నేడు నియంత్రణ మండలి అధికారుల తనిఖీ, అధ్యయనం

గ్రేటర్ పరిధిలో 185 చెరువులు వ్యర్థాలతో దుర్వాసన



మన తెలంగాణ/హైదరాబాద్

తాజా వర్షాలతో కూకట్‌పల్లిలోని చెరువులో కాలుష్యపు నురగలు ప్రవహిస్తుండడంతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) అధికారులు సోమవారం ఉదయం ఆ ప్రాంతాన్ని సందర్శించి కాలుష్యంపై అధ్యయనం చేయనున్నారు. ఫార్మా సంస్థల నుంచి వచ్చే విష రసాయనాల కారణంగానే చెరువులు, మూసీ కాల్వలోని నీరు కలుషితమైందని, మరికొన్ని పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు సైతం కలవడంతో వర్షపు నీటి కారణంగా నురగ ఏర్పడిందని పర్యావరణవేత్తలు వ్యాఖ్యానించారు. కూకట్‌పల్లిలోని ధరణి నగర్ సమీపంలో వచ్చిన నురగపై స్థానికులు పిసిబీకి ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా చర్యలకు ఆదేశించిన ఉన్నతాధికారులు సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో అధ్యయనం చేయనున్నారు. తక్షణంగా తరువాయి 6లో

ఎంఎల్‌సి ఖాళీలకు మార్చిలోనే ఎన్నికలు?

- సిఇసి అనుమతి కోరిన రాష్ట్ర ఎన్నికల సంఘం

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్ర శాసనమండలిలో ఏర్పడుతున్న ఖాళీలన్నింటికి ఒకేసారి ఎన్నికలు పెట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం భావిస్తోంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి కోరింది. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు తరువాయి 6లో



మూడునెలల్లోనే ఏడాది ఆదాయం

గణనీయంగా పెరిగిన ద.మ.రైల్వే రాబడి

అదనపు జనరల్ మేనేజర్ జాన్‌థామస్ వెల్లడి

మన తెలంగాణ / హైదరాబాద్ : గడచిన ఆర్థిక సంవత్సరం కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే ఆదాయం గణనీయంగా పెరిగింది. 201718 ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే రూ.10,977 కోట్ల స్థూల ఆర్థిక ఆదాయాన్ని సమకూర్చుకోగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి మూడు త్రైమాసికాల్లోనే ఆ రికార్డును అధిగమించి అదనంగా రూ.1,505 కోట్లను ఆర్జించిందని ద.మ.రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న అధికారుల మొదలు క్రింది స్థాయి సిబ్బంది వరకు నిబద్ధతగా పనిచేయడం ద్వారా, ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక రైలు సర్వీసులను నడపడం ద్వారా సమకూరిందని పేర్కొన్నారు. దేశ రవాణా వ్యవస్థకు రైల్వే శాఖ మూల స్థంభంగా (కోర్ ట్రాన్స్‌పోర్ట్ ప్రొవైడర్) నిలిచిందని పేర్కొన్నారు. మరే రైల్వే జోన్ కంటే ద.మ. రైల్వే ఆదాయ సమీకరణలో ముందు వరుసలో ఉందని, ఈ ఖ్యాతి మొత్తం సిబ్బందికి దక్కుతుందని పేర్కొన్నారు. కేవలం ఆదాయంలో మాత్రమే కాక ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడంలో, కొత్త రైలు మార్గాల గురించి ఆలోచించడంలో, పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేయడంలో ద.మ.రైల్వే కృషి సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జోన్ పరిధిలోని 50 కిలోమీటర్ల మేర డబుల్ లైన్లు, 261 కిలోమీటర్లకు విద్యుదీకరణను పూర్తి చేసినట్లు తెలిపారు. జోన్‌లో రైలు ప్రమాదాలను కనీస స్థాయికి తగ్గించగలిగామని, ప్రత్యేకమైన పద్ధతులను అవలంభించడం ద్వారానే ఇది సాధ్యమైందని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నాలుగు ఎక్స్‌ప్రెస్, మూడు సాధారణ రైలు సర్వీసులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ రైలు సర్వీసులు పూర్తిస్థాయిలో రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఇక పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, పరిశుభ్రత, నీటి వినియోగంలో పకడ్బందీ విధానం, నీటి వృథాను అరికట్టడం, రైల్వే స్టేషన్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో సికింద్రాబాద్ స్టేషన్‌కు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు రావడం, స్వచ్ఛ్ భారత కార్యక్రమం అమలులో దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు పొందడం లాంటి అనేక విజయాలు సాధ్యమయ్యాయన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఖైరతాబాద్ బ్రాంచ్, షాదన్ కాలేజీ ప్రక్కన, ఖైరతాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500004. ఫోన్: 040-23468602

అనుబంధము-4-ఎ
(రూల్ 8(6)లోని నిబంధనను చూడుము)
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ (6)తో చదవబడుతూ స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా క్రింద తెలిపిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా/కుదువ పెట్టిన స్థిరాస్తులను (సెక్యూర్డ్ క్రెడిటార్) సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖైరతాబాద్, హైదరాబాద్ వారి అధీకృత అధికారి భౌతికముగా స్వాధీనము చేసుకొని వాటిపై తేది: 30.06.2018 నాటికి రావలసిన బకాయి మొత్తం రూ. 2,11,83,661/- (రూపాయలు రెండు కోట్ల పదకొండు లక్షల ఎనభై మూడు వేల ఆరు వందల అరవై ఒక్కటి మాత్రమే) మరియు వడ్డీ & చార్జీలతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణగ్రహీతలైన మెస్సర్స్ శ్రీ సంతోష్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్టనర్లు: 1. శ్రీమతి కామేపల్లి పద్మావతి (భాగస్వామి) భర్త శ్రీ కామేపల్లి శ్రీనివాసులు, 2. శ్రీ గుడిమెట్ల రామసాయి రెడ్డి (భాగస్వామి) తండ్రి శ్రీ వెంకట్ రెడ్డి, 3. శ్రీ సి. నాగమోహన్ (భాగస్వామి) తండ్రి శ్రీ జస్వంత్ రావ్, 4. శ్రీ ఎస్. వెంకటరమణ (భాగస్వామి) తండ్రి శ్రీ వెంకటరమణ మరియు హామీదారులు: మెస్సర్స్ హరి ఆడ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్టనర్-శ్రీ సి. నాగమోహన్ & శ్రీ ఎస్. వెంకటరమణల నుండి వసూలు చేసుకొనుటకు సదరు ఆస్తిని ఏది ఎక్కడ ఎలా ఉందో, ఏది ఎలా ఉందో మరియు మరి ఏదైతే ఎలా ఉందో అది అలానే ప్రాతిపదికన తేది: 05.03.2019న అమ్ముటకు నిర్ణయించడమైనది.

సదరు ఆస్తికి రిజర్వు ధర: రూ. 2,46,23,000/- మరియు ధరావత్తు సొమ్ము (ఇఎండి): రూ. 24,62,300/-

ఆస్తి యొక్క సంక్షిప్త వివరణ: తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ఫేజ్-1, ఐడిఎ చర్లపల్లి వద్ద 2429.38 చదరపు గజాలు లేదా 2030.96 చదరపు మీటర్ల విస్తీర్ణముతో ప్లాట్ నెం. 4-డి భూమి యావదాస్తి మెస్సర్స్ హరి ఆడ్ ఇండస్ట్రీస్ పేరున కలిగియున్నది మరియు సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం. 4బి, దక్షిణం: 40' వెడల్పు రోడ్డు, తూర్పు: ప్లాట్ నెం. 5, పడమర: ప్లాట్ నెం. 4సి.

తెలిసినంత వరకు రుణములు: ఏమి లేవు.

అమ్మకము యొక్క వివరణాత్మక నియమనిబంధనల కొరకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారి వెబ్‌సైట్ అనగా www.centralbankofindia.co.inకు అనుసంధానము చేస్తూ రెఫర్ చేయడమైనది.

తేది: 27.01.2019 — అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ — సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్-2 (20945)
డోర్ నం. 1-8-563/1, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, సంధ్యా థియేటర్ ఎదురుగా, 1వ అంతస్తు, చిక్కడపల్లి, హైదరాబాద్-500020. ఫోన్: 040-23461610, ఫ్యాక్స్: 040-24539665, ఇ-మెయిల్: assetrecovery1@sbi.co.in

స్వాధీనతా ప్రకటన (అంచనాప్రాయము)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) & (2) క్రింద (స్థిరాస్తి కొరకు)

ఖాతా నం. ఎబిఎల్-35149044166

అది అలా ఉండగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెయింట్ మేరీస్ రోడ్డు బ్రాంచ్ (8779), సోనా ఆర్కేడ్, పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదురుగా, సికింద్రాబాద్, అధీకృత అధికారి అయిన దిగువ సంతకముదారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోపుగా 17.09.2018 నాటికి నోటీసు నందు తెలియజేయబడిన రూ. 2,12,28,867.00 (రూపాయలు రెండు కోట్ల పన్నెండు లక్షల ఇరవై ఎనిమిది వేల ఎనిమిది వందల అరవై ఏడు మాత్రమే) + ఒప్పంద రేట్ల ప్రకారం అందుమీది తదుపరి వడ్డీ మరియు చార్జీలు, అనుషంగిక ఖర్చులు తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు) మెస్సర్స్ శ్రీ సాయి అసోసియేట్స్, మరియు దాని భాగస్వాములు/హామీదారు అనగా 1) శ్రీ జి. పుల్లయ్య, 2) శ్రీమతి పి. సవిత, 3) శ్రీ మన్నె శ్రీనివాస్ మరియు 4) సబ్బిడి రమాదేవి వారిని కోరుతూ 20.09.2018 తేదితో డిమాండ్ నోటీసు జారీ చేసినారు మరియు అవి వారికి బట్వాడ కాకుండానే తిరిగి వచ్చినవి మరియు సెక్షన్ 13(2) క్రింద సదరు డిమాండ్ నోటీసు బకాయి మొత్తం తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీతలు/హామీదారులు కోరుతూ 10.11.2018న స్థానిక వార్తా పత్రికలలో ప్రచురించడమైనది.

సదరు ఖాతా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెయింట్ మేరీస్ రోడ్డు బ్రాంచ్ (8779), సోనా ఆర్కేడ్, పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదురుగా, సికింద్రాబాద్-500003, తెలంగాణ రాష్ట్రం నుండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్-2 (20945) (ఇంతకుముందు అస్సెట్స్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్), ఇ.నం. 1-8-563/1, ఆర్‌టిసి క్రాస్ రోడ్, సంధ్యా థియేటర్ ఎదురుగా, 1వ అంతస్తు, చిక్కడపల్లి, హైదరాబాద్‌కు పరిపాలన కారణముల వలన బదిలీ చేయడమైనది మరియు దిగువ సంతకముదారు ఈ నోటీసును జారీ చేయుటకు అధీకృతులై ఉన్నారు మరియు సమర్థ అధికారిగా ఉన్నారు. రుణగ్రహీతకు పైన తెలియజేయబడిన డిమాండ్ నోటీసు జారీ చేసిన తర్వాత 20.09.2018న రూ. 2,00,000.00 (రూపాయలు రెండు లక్షలు మాత్రమే)లను చెల్లించినారు మరియు మిగిలిన బకాయి మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదవబడు సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13 నందలి ఉపసెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ ఇచ్చట దిగువ వివరించబడిన ఆస్తిని దిగువ సంతకముదారు 2019 సం॥ జనవరి 23వ రోజున స్వాధీనము చేసుకొనడమైనదని రుణగ్రహీతలు, హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేస్తూ ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలైననూ 21.01.2019 నాటికి రూ. 2,20,52,179.00 (రూపాయలు రెండు కోట్ల ఇరవై లక్షల యాభై రెండు వేల నూట డెబ్బై తొమ్మిది మాత్రమే) మరియు ఒప్పంద రేట్ల ప్రకారము 22.01.2019 నుండి తదుపరి వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయములు, చార్జీలు వగైరా కొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్-2 (20945) (ఇంతకుముందు అస్సెట్స్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్) వారి చార్జ్‌కు లోబడియుండునని ముఖ్యంగా రుణగ్రహీత/హామీదారులు మరియు సాధారణప్రజానీకాన్ని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

స్థిరాస్తి వివరణ

పార్ట్ - 1 (చరాస్తుల తాకట్టు) కంపెనీ యొక్క వ్యాపారమునందలి స్టాక్స్, రిసీవబుల్స్, కన్యుమబుల్స్ మరియు స్పేర్స్ విడిభాగములు మరియు ప్రస్తుత ఆస్తుల మొత్తము మరియు తాకట్టు పెట్టబడిన ప్లాంట్ మరియు మెషినరీ స్థిరాస్తులు వగైరాతో కలుపుకొని తాకట్టు పెట్టబడిన అన్ని ఆస్తులు అనగా కరెంట్ అస్సెట్స్ యొక్క తాకట్టు-ఏమీలేవు

పార్ట్-2 (స్థిరాస్తుల న్యాయబద్ధ తనఖా)

1) డాక్యుమెంట్ నం. 8397/87, తేది: 4-11-1987 మరియు 2366/89, తేది: 20.03.1989 ప్రకారము రిలీజ్ డీడ్ నం. 7507/94, ప్రకారము శ్రీ మన్నె శ్రీనివాస్ పేర నమోదు చేయబడి రంగారెడ్డి జిల్లా, ఎస్ఆర్ఓ వద్ద నమోదు చేయబడి శ్రీ మన్నె శ్రీనివాస్ తండ్రి ఎం. చంద్రయ్య పేరయుండిన తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, జిహెచ్ఎంసి-క్యాపా మున్సిపాలిటీ క్రింద ఉప్పల్ మండ, మీర్‌పేట్ గ్రా॥, నరసింహా నగర్ వద్ద ఉన్న నివాస భవనము (గ్రౌండ్ & మొదటి అంతస్తు) మరియు వెనుక వైపు బ్లాక్ (గ్రౌండ్, మొదటి, 2వ మరియు మూడవ అంతస్తులు కలిపి 3-4-22/1/ఎస్ఆర్ కలిగిన సర్వే నం. 54 నందు (బ్లాక్-బి) 685 చ॥గజాల విస్తీర్ణము కలిగి ప్లాట్ నం. 60,61,62, 63గా గల యావదాస్తి మరియు సరిహద్దులు: ఉత్తరం: 25' వెడల్పు బిటి రోడ్డు, దక్షిణం: పొరుగువారి భూమి, తూర్పు: పొరుగువారి ఇల్లు & ఖాళీ భూమి, పడమర: 20' వెడల్పు.

2) డాక్యుమెంట్ నం. 8666/94, తేది: 27.10.1994 మరియు 8667/94, తేది: 27.10.1994 ప్రకారము శ్రీమతి ఎస్. రమాదేవి మరియు శ్రీమతి పి. సవిత పేరయుండి రంగారెడ్డి జిల్లా, ఎస్ఆర్ఓ వద్ద నమోదు చేయబడి తెలంగాణ రాష్ట్రము, రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ రెవెన్యూ మం॥ మరియు జిహెచ్ఎంసి క్రింద కాటేదాన్ గ్రా॥ వద్ద ఉన్న వ్యాపార దుకాణము మరియు మేడా ఖాళీ భూమిగా గల ఇ.నం. 8-13-8/11/ఎ కలిగి సర్వే నం. 47/2 నందు 1083 చ॥గజాల విస్తీర్ణము కలిగి ప్లాట్ నం. 9 మరియు ఇంటితో సహా యావదాస్తి మరియు సరిహద్దులు: ఉత్తరం: 100' వెడల్పు బిటి రోడ్డు, దక్షిణం: పరిశ్రమలు, తూర్పు: పరిశ్రమలు, పడమర: 30' సిసి రోడ్డు.

తేది: 23.01.2019 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ — స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఆర్‌బి-2)

గిరిజన పర్యాటక సర్క్యూట్ రెడీ

మార్చి నెలాఖరుకల్లా పెండింగ్ పనులు పూర్తి



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని గిరిజన పర్యాటక ప్రాంతాలను కలుపుతూ రూపొందించిన 'గిరిజన టూరిజం సర్క్యూట్' పనులు ఇప్పటివరకు దాదాపు 80 శాతం మేర పూర్తయ్యాయి. మిగిలిన పెండింగ్ పనులను మార్చి నెల చివరికల్లా పూర్తి చేసి ఆ తర్వాత పర్యాటకులు అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర పర్యాటక శాఖ కసరత్తు చేస్తోంది. పర్యాటక ప్రాధాన్యత ఉన్న ఏడు గిరిజన ప్రాంతాల ప్రకృతి సౌందర్యాన్ని సందర్శకులకు తెలియజేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నివేదికను తయారుచేసి కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖకు పంపడంతో దాన్ని 'స్వదేశీ దర్శన్'లో భాగంగా చేరుస్తూ ఆమోదం తెలిపింది. ఈ సర్క్యూట్ ఏర్పాట్లకు మొత్తం రూ.83.88 కోట్లను కేంద్ర మంత్రిత్వశాఖ మంజూరు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం కాగా, మిగిలిన వాటాను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. గడువులోపు పనులను పూర్తిచేయాల్సి ఉన్నందున రాష్ట్ర పర్యాటక శాఖ పెండింగ్ పనులను మార్చి నెల చివరికల్లా పూర్తి చేయాలని భావిస్తోంది. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రాచుర్యం పొందిన మేడారం, సమ్మక్క సారక్క జాతర ప్రాంతంతో పాటు ములుగు, లక్నవరం, తాడ్వాయి, దామర్వాయి పురాతన సమాధులు, మల్లూరు జలపాతం, బొగత జలపాతం ప్రాంతాలను కలుపుతూ గిరిజన సర్క్యూట్ డిజైన్ తయారైంది. ఈ సర్క్యూట్‌కు తొలుత రాష్ట్ర ప్రభుత్వం రూ.141.66 కోట్ల అంచనాతో కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలను పంపగా చర్చల అనంతరం రూ.83.88 కోట్లతో స్కీంను మంజూరు చేసింది. మేడారంలో సమ్మక్క సారక్క జాతర ప్రాచుర్యం పెంచడానికి, దీంతో పాటు సమీప ప్రాంతాల అభివృద్ధికి ట్రైబల్ సర్క్యూట్ దోహదపడుతుందని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఆ నివేదికలో వివరించింది. చారిత్రకంగా ఎంత గొప్ప పేరున్నప్పటికీ కనీస మౌలిక వసతులు ఉంటే, ఆయా ప్రాంతాల్లో పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతుందని, అందువల్ల ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనింది. ఈ ప్రాంతం తెలంగాణ పరిధిలో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిషా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ తదితర పలు ప్రాంతాల నుంచి గిరిజనులు ప్రతీ రెండేళ్ళకోసారి ఇక్కడకు వస్తుంటారని, దేశంలో కుంభమేళా తర్వాత అత్యధిక సంఖ్యలో ప్రజలు సందర్శించేది సమ్మక్క సారలమ్మ జాతరేనని వివరించింది. స్వదేశీ దర్శన్ పర్యాటక విధానంలో భాగంగా 'గిరిజన సర్క్యూట్'కు ఆమోదం తెలపడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులతో ప్రధాన రహదారి, పట్టణం వద్ద నుంచి ఆయా పర్యాటక, ప్రసిద్ధ ప్రాంతాలకు వెళ్లే మార్గాలను అభివృద్ధి చేయడానికి మార్గం సుగమమైంది. ఆయా మార్గాల్లో పర్యాటకులకు భోజన, వసతి సదుపాయాల కోసం హరిత రెస్టారెంట్లు, పర్యావరణహితంగా ఉండే కాటేజీలు నిర్మాణం చేపడతారు. మహిళా పర్యాటకుల ఇబ్బందులు తీర్చడానికి టాయ్‌లెట్లు ఏర్పాటు చేయడం, సమాచార కేంద్రాల ఏర్పాటు, సోలార్ లైట్లు, పార్కులు, సీట్లు, తాగునీటి సౌకర్యం కల్పించడం, ట్రెక్కింగ్‌కు అనువైన చోట్ల సదుపాయాల కల్పన, తదితర అభివృద్ధి పనులు చేపట్టారు.



సమీప ప్రాంతాల నుంచే కాకుండా, రాష్ట్రం, ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా అధిక సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించేలా, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆ వైభవాన్ని చాటిచెప్పేలా చేసేందుకు అభివృద్ధితో వీలు కలుగుతుంది. ఆసియాలోనే పెద్ద గిరిజన జాతరగా ప్రాచుర్యం పొందిన సమ్మక్క సారక్క జాతరకు, సమీప ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన పూర్తిస్థాయిలో జరిగాక అంతర్జాతీయ పర్యాటకుల కేంద్రంగా మారుతుందని నిపుణులు అశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం నాడు గిరిజన సర్క్యూట్‌లో భాగంగా వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న నిర్మాణాలను పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండి బోయినపల్లి మనోహర్ పరిశీలించారు.

80 శాతం పనులు పూర్తి

టిఎస్‌టిడిసి ఎండి బి.మనోహర్

మేడారం గిరిజన సర్క్యూట్‌లో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. క్షేత్రస్థాయిలో తిరుగుతూ సాధక బాధకాలు తెలుసుకుంటున్నా, పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించాను. సర్క్యూట్‌లో నిర్మిస్తున్న ప్రాంతాల్లో తిరిగి పురోగతిని తెలుసుంటున్నా. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంచి సహకారం ఉంది. గిరిజన సర్క్యూట్‌లో భాగంగా అభివృద్ధి చేసే ప్రాంతాలివే...

ప్రాంతం	మంజూరు (రూ. కోట్లలో)
1. ములుగు	7.35
2. లక్నవరం	27.65
3. మేడారం	13.43
4. తాడ్వాయి	9.37
5. దామర్వాయి పురాతన సమాధులు	1.10
6. మల్లూరు జలపాతం	6.39
7. బొగత జలపాతం	12.91

ఆర్‌టిసి పెట్రోల్ బంకులు

- ఆదాయం కోసం కీలక అడుగులు
- ప్రైవేటు సంస్థలకు బస్టాండ్ల నిర్వహణ
- కార్యాచరణ ప్రణాళికపై కసరత్తు




మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇప్పటికే మినీ సినిమా థియేటర్లను నిర్మించాలని నిర్ణయం తీసుకున్న ఆర్‌టిసి ఇకపైన పెట్రోల్ బంకులను కూడా ఏర్పాటు చేయాలని ఆలోచిస్తోంది. రాష్ట్రం మొత్తం మీద ఆర్‌టిసికి ఉన్న భూములను సద్వినియోగం చేసుకుంటూనే వీలైనంత ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించడంపై కసరత్తు చేస్తోంది. ఇందుకోసం అవసరమైన వాణిజ్య సముదాయాల నిర్మాణం దిశగా కూడా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

రాబడి పెంపు మార్గాల కోసం చర్యలు

ఇప్పటివరకు ఆర్‌టిసి సంస్థ బస్సు ప్రయాణీకుల నుంచి టిక్కెట్ల రూపంలో, బస్టాండ్‌లలో దుకాణాలను అద్దెకు ఇవ్వడం ద్వారా మాత్రమే ఆదాయాన్ని సమకూర్చుకుంటూ ఉంది. అయితే ఏటేటా సంస్థ నిర్వహణకు ఖర్చు ఎక్కువవుతుండడం, ఆదాయం అందుకనుగుణంగా సమకూరకపోవడంతో నష్టాల బాట పడుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దడం కోసం వాణిజ్య లావాదేవీలపై దృష్టిపెట్టింది. నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసికి చెందిన భూములను కాసులు కురిపించేలా చేయడంపై అనేక సమావేశాల్లో చర్చలు జరగాయి. సంస్థను ఆర్థికంగా పరిపుష్టి చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన సమావేశంలో సంస్థ పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ఇందులో ప్రధానంగా పెట్రోల్ బంకులు, మినీ థియేటర్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. థియేటర్ల నిర్మాణానికి రాష్ట్ర చలన చిత్ర మండలి కూడా ముందుకు వచ్చింది. ఇక ఖాళీగా ఉన్న ఆర్‌టిసి స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లను, కార్యాలయాలను, హోటళ్లను వినియోగించుకునేందుకు వీలుగా భవనాలను నిర్మించి అద్దెకు ఇవ్వాలని భావిస్తోంది.

ట్రాఫిక్ రెవెన్యూదే సింహభాగం

ఆర్‌టిసికి సమకూరుతున్న ఆదాయంలో సింహాభాగం ట్రాఫిక్ రెవెన్యూ (టికెట్లు, రిజర్వేషన్లు) ద్వారా 83.5 శాతం మేర, వివిధ రకాల బస్సు పాసుల ద్వారా 14 శాతం సమకూరుతోంది. వాణిజ్యపరంగా కేవలం 2.5 శాతం మాత్రమే వస్తోంది. వాణిజ్యపరంగా వస్తున్న ఆదాయాన్ని కనీసంగా పది శాతానికి పెంచాలని భావిస్తోంది. డివిజనల్ మేనేజర్లు, రీజినల్ మేనేజర్లు, డిపో మేనేజర్లతో ఇటీవల జరిగిన సమావేశంలో దీనిపై లోతుగా చర్చించి నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పర్యాటకులకు ఆకట్టుకునే విధంగా మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించినట్లు సమాచారం. ఆదాయాన్ని పెంచుకోడానికి వివిధ దేశాలు అనుసరిస్తున్న విధానాలను కూడా ఈ సందర్భంగా ఆర్‌టిసి ఎండి ఈ సమావేశంలో అధికార యంత్రాంగానికి వివరించినట్లు సమాచారం. దుబాయ్‌లో అయిల్ ద్వారా ఆ దేశానికి కేవలం ఒక శాతం మాత్రమే ఆదాయం సమకూరుతుందని, వాణిజ్యంతో పాటు పర్యాటక పరంగానే అత్యధిక రాబడి వస్తున్నట్లు అధికారుల కు వివరించినట్లు సమాచారం. సంస్థను ఆర్థికంగా అభివృద్ధి చేసుకునే దిశలో భాగంగా ఆదాపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా బస్టాండ్ల నిర్మాణంతో పాటు నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ఒదుకు సిద్ధమైంది. 33 ఏళ్ల పాటు లీజుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో వీటి నిర్వహణకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ముందుగా జూబ్లీ బస్ టెర్మినల్‌తో పాటు పాత గౌలిగూడలోని ఎంజిబిఎస్ బస్టాండ్‌ల నిర్వహణతో ప్రయోగాత్మంగా ప్రైవేటు సంస్థలతో కలిసి పనులను ప్రారంభించాలని వాటి నిర్వహణను ఆయన సంస్థలకు అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి లఖ్‌నపూర్‌లో అధ్యయనం చేయాలని కూడా నిర్ణయించినట్లు సమాచారం. వీటి వల్ల సంస్థ రాబడి పెరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరించాలని నిర్ణయించినట్లు సమాచారం.


వసంత్ షిండే


వెంకటేశం

పురావస్తుశాఖపై ధోరణిమారాలి

మన తెలంగాణ/హైదరాబాద్: పురావస్తు శాఖను పాత భవనాలు, మ్యూజియంకు సంబంధించిన చరిత్రలా చూసే ధోరణి పోవాలని దక్కన్ కాలేజ్ (పూణే) వైస్ చాన్సలర్ డాక్టర్ వసంత్ షిండే అన్నారు. పురావస్తు శాఖ పేరును హెరిటేజ్ తెలంగాణగా మార్చడం గొప్ప ప్రయత్నమని ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఇదేవిధంగా వ్యవహరిస్తే బాగుంటుందని, ఈ విషయంలో తెలంగాణ అందరికీ మార్గదర్శకంగా మారిందని అభిప్రాయపడ్డారు. ఇటీవల నగరంలో ఒక సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఆయన మన తెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. చరిత్ర లిఖించడంలో సరైన మెథడాలజీని పాటించాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్ర అధ్యయనం కోసం తవ్వకాలు, ఫలితాలు, చరిత్రకారులు, పరిశోధకులు, సాహిత్యం అన్ని ఒకే గూటికి చేరాల్సిన అవసరం ఉందని, అప్పుడే సరైన వాస్తవాలు బయటకు వస్తాయని అభిప్రాయపడ్డారు. చరిత్ర పరిశోధనా రంగంలోకి యువత పెద్ద ఎత్తున రావాల్సి ఉందని, ప్రభుత్వం కూడా ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలు భర్తీచేయాలని అన్నారు. కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల్లోని పురావస్తు శాఖల్లో పెద్ద ఎత్తున ఖాళీలు ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన వారు ఒక్కొక్కరుగా తప్పుకుంటుంటే, కొత్త తరానికి చరిత్ర ఎలా తెలుస్తుందని, పరిశోధనలు, శాసనాలు చదవడం, అధ్యయనం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం, ప్రభుత్వ శాఖలు, పరిశోధకులు సమన్వయంతో పనిచేయాలని, చాలీచాలని బడ్జెట్‌తో కూడా తిప్పలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు పుస్తకాలు ముద్రిస్తున్నా, అందులో తాజా సమాచారం కరవవుతోందని, కొత్త పుస్తకాలను తాజా సమాచారంతో అప్‌డేట్ చేయడం తప్పనిసరని, ఇది ప్రభుత్వం, పరిశోధకుల బాధ్యత అన్నారు. ఇంటాక్, దక్కన్ హెరిటేజ్ ట్రస్టు వంటి పలు సంస్థలు తెలంగాణలో పనిచేస్తున్నాయని, ఇవి ప్రభుత్వంతో సమన్వయంతో ముందుకు పోవాలని, ప్రజలను కూడా చరిత్ర, సంసకృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములను చేయాలని అన్నారు. చరిత్రకు సంబంధించిన ఆధారాలను కాపాడడంలో ప్రజల సహకారం చాలా అవసరమని, అన్ని రంగాలు వేరు, చరిత్ర పరిశోధన వేరని స్పష్టం చేశారు. చరిత్ర పరిశోధన, అనుబంధ రంగాల్లో నిపుణులు తగ్గిపోయారని, కొత్త తరం రావాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై అవగాహన, విద్య అందించడమే మార్గమని వసంత్ షిండే పేర్కొన్నారు. పూణేలోని తమ కాలేజీలో కేవలం 60 సీట్లు మాత్రమే పురావస్తు అంశాల్లో ఉండగా, 200 మందికి పైగా దరఖాస్తు చేసుకుంటున్నారని, సీట్లు, ఔత్సాహిక యువత పెరగాలని అన్నారు. పురావస్తు శాఖను పరిధిని పెంచేలా హెరిటేజ్ తెలంగాణగా సంబంధిత శాఖ పేరును మార్చామని పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. దేశం మొత్తం మీద ఇలా చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఖ్యాతి గడించిందన్నారు. చరిత్ర, వారసత్వం పరిధిని పెంచే క్రమంలోనే ఈ నిర్ణయాలన్నారు. మన చరిత్ర ఆనవాళ్లను ప్రపంచవ్యాప్తం చేయడానికి అంతర్జాతీయ సదస్సులు పనికి వస్తాయని అభిప్రాయపడ్డారు.చరిత్ర పరిశోధనకు సంబంధించి తవ్వకాలు జరుపుతున్నామని, ఫణిగిరి, కోటి లింగాల, పెద్ద బొంకూరు, ఇలా తవ్వకాలు జరపడం, అధ్యయనం చేయడం నిరంతర ప్రక్రియ అని వెంకటేశం పేర్కొన్నారు. దేశంలోనే అతి పెద్ద పురావస్తు నాణాల బాండాగారం ఉన్న ఘనత హెరిటేజ్ తెలంగాణ శాఖకు చెందుతుందని స్పష్టం చేశారు.

ఆటపాటలతో ఆదరగొట్టారు

- ఒకే వేదికపై 474 మంది కళాకారుల అద్భుత నృత్య ప్రదర్శనలు
- తెలంగాణ జానపదానికి గిన్నీస్ పుటల్లో చోటు



మనతెలంగాణ/ నాంపల్లి : చల్లని సాయంత్రం వేళలో... ఆహ్లాదకర వాతావరణం మధ్య ఒకే వేదికపై 474 మంది కళాకారులు తెలంగాణ జానపద కళా సంస్కృతి ప్రాశస్త్యాన్ని ఎలుగెత్తి చాటుతూ ప్రపంచానికి పరిచయం చేశారు. తమ ఆటపాటలతో ఆద్యంతం ఆదరగొట్టేశారు. ఎంతో వైభవాన్ని సంతరించుకున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తమ కళాంశాల ద్వారా ఆవిష్కరించిన తీరు అత్యద్భుతం.... తెలంగాణ పల్లె అందాలను గుర్తు చేస్తూ వైవిధ్య భరిత నృత్యాలతో ఆహుతులు ఆద్యంతం మంత్రముగ్ధులయ్యారు. ఒకే వేదికపై వందల సంఖ్యలో కళాకారులు పోటీ పడుతూ విభిన్న రకాల తెలంగాణ జానపద అంశాల నృత్యాలను ప్రదర్శించి... గిన్నీస్ పుటల్లో చోటు సంపాదించారు. ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ నృత్యోత్సవాలు 2019 శ్రీశాంతి కృష్ణ సేవాసమితి 34వ వార్షిక సంబరాలకు పబ్లిక్‌గార్డెన్స్‌లోని కళాతోరణం వేదికైంది.. ఈ ప్రాంత వైభవాన్ని కళ్లకు కట్టిన్నట్లు కళాకారులు బతుకమ్మ తల్లిని కీర్తిస్తూ... గ్రామీణ జీవన సంస్కృతిని తమ ఆటపాటల ద్వారా ఎలుగెత్తారు. జానపదంలో పలు అంశాల విశిష్ఠను కళాకారులు చక్కని అభినయం, హావభావాలతో జనరంజకంగా ప్రదర్శించారు. ప్రతి డ్యాన్స్ సబీకులను విశేషంగా ఆకట్టుకున్నది. కళాకారులు ప్రదర్శించిన నృత్య అంశాలను కళాప్రియులను మైమరిపించాయి. కొందరు వారి అద్భుత నృత్యాలకు హర్షద్వానాలు చేస్తూ కళాకారులను ప్రోత్సాహించారు. ఈ ఉత్సావాలముఖ్యఅతిథిగా గాయాత్రి పీఠాధిపతి శ్రీకాంతేశ్వర స్వామిజీ, మలేషియాకు చెందిన ప్రియశ్రీ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంసకృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసి భారతదేశంలో పండుగల సంబరాలకు విశిష్ఠ స్థానం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ అలాంటి గొప్ప ఉత్సవాల వేదుకలకు సంబంధించి నృత్యాలను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన ఘనత సంస్థ అధ్యక్షుడు వంగాల శాంతి కృష్ణకే దక్కిందని కొనియాడారు. ప్రపంచ సాంస్కృతిక వికాసంలో ప్రకృతి అందాలను ప్రతిరూపమైన పూలను దైవంగా ఆరాధించడం బతుకమ్మ ఉత్సవాల్లో చూస్తున్నామని వివరించారు. శ్రీ శాంతి కృష్ణసేవా సమితి అధ్యక్షుడు వంగాల శాంతికృష్ణ మాట్లాడుతూ తెలంగాణ కళా సంస్కృతిని బతుకమ్మ తల్లిని నృత్యాల ద్వారా గిన్నిస్ పుటల్లోకెక్కడానికి అర్హత సాధించిందని, ఇది తెలుగుజాతికి, తెలంగాణ వాసులకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఛాయచిత్ర దృశ్య సాక్షాల సమర్పణ తర్వాత గిన్నిస్ అధికారులు పరిశీలన పూర్తి చేసిన వెంటనే గిన్నిస్ రికార్డు ధృవపత్రం వస్తుందని తెలుగు బుక్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపట్ల వెంకటాచారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళారంగానికి ఇతోధికంగా విశిష్ఠ సేవ లందిస్తున్న గురువులను సన్మానించారు.



శిఖరం అధిరోహించిన జోషి

అభినందించిన హోం మంత్రి మహమూద్ అలీ

మనతెలంగాణ, సిటీబ్యూరో : హైదరాబాద్ నగర పోలీసు జాయింట్ కమిషనర్ తరుణ్‌జోషి అర్జెంటీనాలోని అకాన్‌కాగ్వా అనే ఎత్తైన పర్వత శిఖరాన్ని దిగ్విజయంగా అధిరోహించారు. ఇది తెలిసిన రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ ఆయనను అభినందించారు. హెమిస్పెర్ దక్షిణాది పర్వత శ్రేణుల్లో ఈ పర్వతం శిఖరం అత్యంత ఎత్తైనది. అతడి సాహసాన్ని చూసి తెలంగాణ పోలీసులు గౌరవపడాలని పేర్కొన్నారు.

మరో రెండురోజుల పాటు వర్షాలు

చల్లబడిన వాతావరణం, వీస్తున్న చలి గాలులు

మన తెలంగాణ/హైదరాబాద్ : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల శుక్రవారం మొదలు వర్షాలు కురుస్తున్నాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. వర్షాలతో వాతావరణం చల్లబడడంతో చలిగాలులు కూడా పెరిగాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం భారీ స్థాయిలో వర్షం కురిసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కుత్బుల్లాపూర్‌లోని గాజులరామారంలో అత్యధికంగా 5.4 సెం.మీ వర్షపాతం నమోదు కాగా బేగంపేటలో 2.5 సెం.మీ. వర్షపాతం నమోదయ్యింది. సిద్దిపేట నాగనూర్‌లో గరిష్ఠంగా 10.3 సెంటిమీటర్లు, రాజన్న సిరిసిల్లలో 8.3 సెం.మీ., జనగాంలో 6.0, వరంగల్‌లో 5.0, పెద్దపల్లి సుల్తానాబాద్‌లో 5.0, సంగారెడ్డిలో 3.0, సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో 2.5, జగదేవ్‌పూర్‌లో 2.0, మరుపల్లిలో 2.0, కామారెడ్డిలో 1.0, మెదక్‌లో 1.0, మేడ్చల్ 1.0, రంగారెడ్డి యాచారంలో 1.5, వికారాబాద్ బంట్వారంలో 3.0, మంచిర్యాలలో 1.3, నగర శివారులోని రాజేంద్రనగర్‌లో 2, బహదూర్‌పురాలో 1.5, షేక్‌పేటలో 0.5, ఖైరతాబాద్ 0.5, గోల్కొండ 0.5లో వర్షపాతం నమోదయ్యిందని అధికారులు పేర్కొన్నారు. ఆగ్నేయ బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం ప్రాంతాల్లో అల్పపీడన ద్రోణి ఏర్పడిందని, తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాల్లో 1.5 కి.మీల ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం, ఈ ఆవర్తనం నుంచి దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక వరకు తెలంగాణ మీదుగా 1.5 కి.మీల ఎత్తు వద్ద ఉన్న ఉపరితల ద్రోణి బలహీనంగా మారినట్టు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. దీంతోపాటు చలిగాలులు కూడా ఎక్కువఅయ్యాయని అధికారులు తెలిపారు. కోస్తా, ఆంధ్ర, రాయలసీమలో ఉరుములు పాటు వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని, మంగళవారం పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఎన్నికల్లో వింతలు..

మన తెలంగాణ/సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో గ్రామపంచాయితీ ఎన్నికల్లో వింతలు చోటుచేసుకున్నాయి. గెలుపు ఓటమి ఎమైన ఖర్చుకు మాత్రం వెనుదియని అభ్యర్థులు ఓడిపోయిన తర్వాత డబ్బుల కోసం ఇంటింటికి తిరుగుతున్న సంఘటన జిల్లాలో చోటుచేసుకుంటుంది. తాజాగా రెండవ విడత ఎన్నికల్లో జాజిరెడ్డిగూడెంలో ఎన్నికలు జరిగాయి. వార్డుకు కాంగ్రెస్ పార్టీ నుండి పోటిచేసిన అభ్యర్థి ఉప్పు హైమావతి ఎన్నికల్లో ఓటమి పాలైయ్యారు. 9వ వార్డులో టిఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. దీంతో హైమావతి భర్త ప్రభాకర్ వార్డులో తిరుగుతూ తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఓటర్లతో ఘర్షణకు దిగారు. దీంతో అది కాస్తా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. మద్దిరాల మండలం రెడ్డిగూడెంలో తీగల పిచ్చమ్మ కెసిఆర్ అభిమాని కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తనకు రూ. 1000లు పెన్షన్ ఇస్తున్నారని టిఆర్‌ఎస్ అభ్యర్థికే ఓటు వేస్తానని అనడంతో కుమారుడు కొమరయ్య తల్లిని, పెద్ద కుమారుడు మల్లయ్యలను గృహ నిర్భందం చేసి ఓటు వేయకుండా చేసినట్లు తెలిసింది. అడ్డుకున్న ఓ యువకునిపై కూడా సదరు వ్యక్తి చేయిచేసుకోవడం గమనర్హం. చివ్వెంల మండల అక్కలదేవిగూడెంలో ఓటుకు నోట్లు ఇచ్చిన ఓ అభ్యర్థి ఓడిపోయిన తర్వాత తిరిగి ఇవ్వాలని రోధించారు. ఖర్చు పెట్టడం ఎందుకు భాదపడడం ఎందుకు అని డబ్బులు లేకుండా ఎందుకు పోటి చేయాలని గ్రామస్తులు నిలదీశారు.

రీజినల్ రింగు రోడ్డుపై

రేపు ఢిల్లీలో నితిన్ గడ్కరీ సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌కు సంబంధించి జనవరి 29న ఢిల్లీలో కీలక సమావేశం జరుగనుంది. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో జరిగే ఈ సమావేశంలో అలైన్‌మెంట్ ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు సుమారుగా 338 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఇందు కోసం దాదాపుగా 11 వేల ఎకరాల భూమి అవసరమని అంచనా. క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను బట్టి అధికారులు కంది నుంచి గజ్వేల్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు ఒక రీచ్‌గా విభజించారు. చౌటుప్పల్ నుంచి యాచారం, కందుకూరు, షాద్‌నగర్ మీదుగా మరో రీచ్‌గా విభజించారు. ఈ ప్రతిపాదిత రీచ్‌లలో మూడు అలైన్‌మెంట్లను సిద్ధం చేసుకున్నారని తెలిసింది. ఖర్చు, భూసేకరణ, భూమి స్వభావం, తదితర అంశాలను బట్టి ఏ అలైన్‌మెంట్ ఖరారు చేయాలో నిర్ణయం తీసుకుంటారు. ఈ దిశగా అన్ని వివరాలతో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ సమక్షంలో 29వ తేదీన ఢిల్లీలో సమగ్ర సమీక్ష జరుగనుంది. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారులో ఈ సమావేశమే కీలకమని రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. ఈ రింగురోడ్డు నిర్మాణంలో నిధుల లభ్యత, సేకరణ కూడా కీలకంగా మారనుంది.


తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోంది

టిఆర్‌ఎస్ అమెరికా విభాగం అధ్యక్షులు తన్నీరు మహేష్



మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి వేగవంతంగా చెందుతోందని టిఆర్‌ఎస్ అమెరికా విభాగం అధ్యక్షులు తన్నీరు మహేష్ అన్నారు. టిఆర్‌ఎస్ అమెరికా విభాగం అధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికల విజయోత్సవాలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిఆర్‌ఎస్ అమెరికా విభాగం అధ్యక్షుడు తన్నీరు మహేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులు అర్పించారు. అనంతరం రైతుబంధు, రైతు బీమా పథకాల విశిష్టతను మహేష్ వివరించారు. ఎన్‌ఆర్‌ఐల విషయంలోనే తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. యువ జన విభాగం నుంచి డేవిడ్ విక్రమ్, నవీన్ గుడిపల్లి, అశోక్, ప్రమోద్, జంగమ మాట్లాడుతూ టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. నవీన్ కానుగంటి, వేణు పామెర, నరసింహా నాగుల వంచ ఆధ్వర్యంలోజరిగిన ఈ కార్యక్రమంలో ఒహియో రాష్ట్రంలోని వివిధ నగరాల నుంచి భారిగా కెసిఆర్ అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఇక జిల్లాల్లోనూ షీటీమ్స్



- విడతల వారీగా విస్తరణ
- మహిళా పోలీస్‌స్టేషన్లకు బాధ్యతలు
- తొలుత ఆరు ఉమ్మడి జిల్లాల్లో ప్రారంభం

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన షీటీమ్స్ ఇక జిల్లాల వారీగా ఏర్పాటు చేసేందుకు డిజిపి మహేందర్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మహిళా రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీటీమ్స్ సిబ్బంది పనితీరుకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు రావడంతో జిల్లాల వారీగా షీటీమ్స్‌ను ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా తొలివిడతగా నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కేంద్రాలలో షీ టీమ్స్ అనతికాలంలో రంగంలోకి దిగనున్నాయి. ఈ నేపథ్యంలో మరో ఐదు నాలుగు ఉమ్మడి జిల్లాలోనూ ఆరు నెలల వ్యవధిలో షీటీమ్స్ ఏర్పాటుకు పోలీసు శాఖ కసరత్తు ప్రారంభించింది. మహిళల రక్షణ కోసం, పోకిరీల పీచమనిచేందుకు ఏర్పాటు చేసిన షీటీమ్స్ 2018లో ఉత్తమ ఫలితాలు సాధించాయి. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కంపెనీ, రహదారులు, ఇంటి పరిసరాల్లో మహిళలను వేధించే వారిపై షీటీమ్స్ ఉక్కుపాదం మోపాయన్నారు. షీటీమ్స్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 8281 కేసులను దర్యాప్తు చేసినట్లు ఈక్రమంలో గత ఏడాది మహిళలను వేధించిన 771 మంది పోకిరీలపై ఎఫ్‌ఐర్ నమోదు చేశారు. అలాగే మహిళలకు ఇబ్బంది కల్గించిన వివిధ కేసుల్లో 3379 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి 1351మందిపై పిటి కేసులు నమోదు చేయడం జరిగింది. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పలు కేసుల్లో 3077 మందిని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు చేసి వదిలిపెట్టారు. ఇదిలావుండగా 2709 మంది మహిళా బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని నేరుగా షీ టీమ్స్ అధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. బాధిత మహిళలు వాట్సప్,డయల్ 100, ఇమెయిల్స్, ఫేస్ బుక్, హాక్‌ఐ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్లు పోలీసు అధికారులు వివరిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాలలో మహిళా బాధితులకు న్యాయం చేసేందుకు షీ టీమ్స్‌ను విడతల వారీగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరింపజేసేందుకు పోలీసు ఉన్నతాధికారులు సమాలోచనలు సాగిస్తున్నారు. ముఖ్యంగా కూలీ పనులు, చిన్నపాటి వ్యాపారాలు, షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళలు వేధింపులకు గురవుతున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో జిల్లాల వారీగా షీటీమ్స్ ఏర్పాటు చేయడం వల్ల వారికి న్యాయం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో షీటీమ్స్ విస్తరణకు డిజిపి సుముఖత వ్యక్తం చేశారు.



మహిళా పోలీస్‌స్టేషన్లకు నిర్వహణ బాధ్యత

జిల్లాలో పనిచేసే షీ టీమ్స్‌ను ఆయా జిల్లాలలోని మహిళా పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలకు షీటీమ్స్ బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. ఈక్రమంలో జిల్లాలలోని షీటీమ్స్‌లో పనిచేసే పోలీసులకు హైదరాబాద్‌లో పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక శిక్షణ సైతం ఇచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు. షీటీమ్స్ బృందాలు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదుల విషయంలో ఆయా ప్రాంతంలోని స్థానిక పోలీసుల సహాయం తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. కేసు దర్యాప్తు విషయాలలో జిల్లాలలో షీటీమ్స్, స్థానిక పోలీసులు పరస్పరం సహకరించుకోవాలని ఆదేశాలిచ్చారు. జిల్లాలలోని ఫిర్యాదుల వివరాలను ఎప్పటికప్పుడు హైదరాబాద్‌లోని షీటీమ్స్ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించాలని, కేసులలో పురోగతి, దర్యాప్తు వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

బంగారు తెలంగాణ సాధనలో

ప్రైవేటు ఉద్యోగులు భాగస్వాములు కావాలి

- తెలంగాణ ఉద్యమంలో ప్రైవేటు ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం
- డైరీని ఆవిష్కరించిన హరీశ్‌రావు



మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేటు ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కెసిఆర్ చొరవ తీసుకుంటారని సిద్దిపేట శాసనసభ్యులు హరీశ్‌రావు హామీ ఇచ్చారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రైవేటు ఉద్యోగులను అప్పటి పాలకులు పట్టించుకోకుండా వారి సమస్యల పరిష్కారాన్ని గాలికి వదిలివేశారని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వీరికి తెలంగాణ ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం 2019 డైరీని బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసంలో ఆదివారం ఆవిష్కరించిన సందర్భంగా హరీష్‌రావు పై విధంగా హామీ ఇచ్చారు. బంగారు తెలంగాణ సాధనలో ప్రైవేటు ఉద్యోగులు భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ప్రైవేటు ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమని, అదే ఉద్యమ స్ఫూర్తితో బంగారు తెలంగాణ సాధన లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. 2008లో ప్రైటు ఉద్యోగసంఘాలు సంఘటితమై తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, వారి కృషి మరువలేనిదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రైవేటు ఉద్యోగులకు అందే విధంగా, ప్రైవేటు ఉద్యోగులకు న్యాయసూత్రాలు అమలయ్యే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. న్యాయబద్ధంగా ప్రైవేటు ఉద్యోగుల హక్కులను ప్రభుత్వం కాపాడుతుందని హామీ ఇచ్చారు. బంగారుతెలంగాణ సాధనకోసం నిరంతరం శ్రమిస్తామని ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఉద్యోగ సంఘాల నాయకులు నూతన గంటి పురుషోత్తం, కరుణాకర్ రెడ్డి, మహిళా నాయకురాలు ఆకుల గీతాంజలి, ప్రభతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తన గుడిసెను తానే తగలబెట్టుకొని..

మనతెలంగాణ/తిరుమలగిరి(సాగర్) : పూరి గుడిసె తగలబడితే తనకు కొత్త రెండు పడక గదుల ఇల్లు మంజూరవుతుందనే ఉద్దేశంతో మండలంలోని చెన్నాయిపాలెంకు చెందిన జటావత్ రవీందర్ తాగిన మైనంలో తన గుడిసెను తానే తగలబెట్టుకున్నాడని సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని తిమ్మిపాలెం ఆవాస గ్రామమైన చెన్నాయిపాలెంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎన్నికల గెలుపోటముల విషయాలను మనసులో పెట్టుకొని ఇరువర్గాల వారు ఒకరికొకరు కొట్టుకొని అదే గ్రామానికి చెందిన జటావత్ రవీందర్ పూరి గుడిసె తగలబెట్టారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ విషయంపై తాము కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా గ్రామంలో గల రెండు వర్గాల వారు ఒకరు బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గెలవగా మరొకరు బలపర్చిన అభ్యర్థి ఓటమి చెందడంతో ఫలితాల అనంతరం ఒకరినొకరు కొట్టుకొని గాయాల పాలయ్యారన్నారు. ఈ గొడవ అనంతరం అదే గ్రామానికి చెందిన జటావత్ రవీందర్ అదే అదనుగా భావించి పెద్దగట్టు గ్రామ ఆవాస గ్రామమైన బూడిదగట్టుతండాలో తన పూరి గుడిసెను తగలబెట్టుకున్నాడన్నారు. తన గుడిసె దగ్ధమైతే తనకు కొత్తగా రెండు పడక గదుల ఇల్లు మంజూరవుతుందనే ఉద్దేశంతో తాగిన మైకంలో గ్రామ చివరలో నున్న తన పూరి గుడిసెను తనకు తానుగా తగలబెట్టుకున్నాడని పోలీసు విచారణలో తేలిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కురుమయ్య పాల్గొన్నారు.



జగన్‌తో దగ్గుబాటి వెంకటేశ్వరరావు భేటీ



మన తెలంగాణ/హైదరాబాద్ : ఎపి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ పెద్ద అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆదివారం భేటి అయ్యారు. దగ్గుబాటి తన కుమారుడు హితేష్‌తో కలిసి హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసానికి చేరుకున్న క్రమంలో వైఎస్సార్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. గతం కొంత కాలంగా దగ్గుబాటి కుంటుంబం వైఎస్సార్ సిపిలో చేరే అవకాశం ఉందని మీడియాలో ప్రచారం జరుగుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు వైఎస్సార్ సిపి అధినేత జగన్‌తో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్బంగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ పార్టీతో కలిసి రాజకీయ ప్రయాణం చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పార్టీ విధివిధానాల మేరకు నడుచుకుంటామని, పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తామన్నారు. ప్రస్తుతం దగ్గుబాటి భార్య పురందేశ్వరి బిజెపి మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారని, ఒకే కుటుంబంలో ఉన్నప్పటికీ ఎవరి అభిప్రాయాలు, ఎవరి ఇష్టాలు వారివన్నారు. అవసరమైతే పురందేశ్వరి రాజకీయాలకు స్వస్తి పలుకుతారని తెలిపారు. వైఎస్ జగన్ పార్టీలో కొనసాగాలని కుంటుంబ పరంగా తీసుకున్న నిర్ణయమని వివరించారు. ఈ భేటీలో విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, నరసరావుపేట నియోజక వర్గ లోక్ సభ కో ఆర్డినేటర్ కృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులు

మన తెలంగాణ/హైదరాబాద్ : పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత నాయకత్వం పార్టీ నిర్మాణంపై దృష్టి సారించింది. అన్ని జిల్లాల్లో కమిటీలను పూర్తిచేసే పనిలో నిమగ్నమైంది. ఈ నెల చివరికల్లా లేదా వచ్చే నెల మొదటి వారంకల్లా అన్ని జిల్లా కమిటీలను ప్రకటించే అవకాశముంది. ఈనెల 10వ తేదీ లోగా డిసిసి కమిటీల ప్రక్రియను పూర్తి చేయాలని ఏఐసిసి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో డిసిసి కమిటీల నియామకంలో జాప్యం జరిగింది. ఇప్పటికే రెండు విడతల పంచాయతీల ఎన్నికలు పూర్తికాగా మరో రెండు రోజుల్లో మూడవ విడుత ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికల వేడి మొదలుకానుంది. వచ్చే నెల చివరలో లేదా మార్చి నెల మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడదలయ్యే అవకాశమున్నందున అప్పటికల్లా డిసిసి ప్రక్రియను పూర్తి చేయాలని టిపిసిసి భావిస్తోంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను టిపిసిసి ఇప్పటికే జిల్లాలకు చేరవేసింది. పార్లమెంట్‌లో ఎన్నికల్లో విజయం సాధించడానికి పార్టీని పటిష్టంగా తయారు చేసేందుకు డిసిసి అధ్యక్షుల ఎంపికలో జాగ్రత్తలు అవసరమని భావిస్తోంది. పార్టీ గెలుపు కోసం చిత్తశుద్ధితో పనిచేసే నాయకులకు ప్రాధాన్యత కల్పించే విధంగా జాబితా సిద్దమవుతోంది. దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. డిసిసి అధ్యక్షులుగా ప్రతి జిల్లా నుంచి నలుగురి పేర్లను సిద్ధం చేసినట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో వడపోత కార్యక్రమాన్ని పూర్తి చేసి ఏఐసిసి అనుమతి కోసం పంపనుంది. ఆమోదం లభించగానే టిపిసిసి నాయకత్వం అధికారికంగా జాబితాను విడుదల చేయనుంది.

సామాజిక సేవ సమాజంలో గుర్తింపు తెస్తుంది

- రెడ్ల సామాజిక సేవ ప్రశంసనీయం
- రైతులకు సేవచేసే అవకాశం సిఎం కెసిఆర్ కల్పించారు
- రైతులందరూ లక్ష్మీ పుత్రులు కావాలి
- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : లక్ష్మీ పుత్రుడిగా తనకు పేరున్నా జేబులో పైసా లేదని తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే రాష్ట్రంలోని ప్రతి ఒక్కిరిని లక్ష్మీ పుత్రులుగా తీర్చి దిద్దే అవకాశాన్ని ముఖ్యమంత్రి నాకు కల్పించడం నా అదృష్టంగా భావిస్తానని చెప్పారు. వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి ముఖ్యమంత్రి ఆశీస్సులతో రాష్ట్రంలోని రైతులందరిని ఆర్థికంగా బలోపేతం చేసే అవకాశం కలిగిందన్నారు. స్పీకర్ గా గురుతర బాధ్యతలు నాముందున్నాయని చెప్పారు. ఆదివారం రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో రాజ్‌బహుద్దూర్ వెంకటరామిరెడ్డి హాస్టల్లో పేదవిద్యార్థులకు ఉపకారవేతనాల చెక్కులు అందివ్వడంతో పాటు దాతలను పోచారం ఘనంగా సన్మానించారు. సామాజిక సేవలో రెడ్డిలు మరింత ముందువరసలో నిలవాలని పిలుపునిచ్చారు. పేదవిద్యార్థులకు మానవత్వంతో సహాయం చేస్తున్న వారిని పోచారం అభినందించారు. ఈసందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల కోసం పలువురు దాతలు మానవత్వంతో సహాయం చేయడం అభినందనీయమని ప్రశంసించారు. పెద్ద మనస్సుతో ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలను అభినందించారు. సమాజంలో అందరికీ సహాయం చెసే మనస్సు రెడ్లకుందన్నారు. జనాభలో రెడ్ల శాతం తక్కువగా ఉన్నా సహాయం చేసే మనస్తత్వం ఎక్కువగా ఉందన్నారు. అయితే సహాయం చేసే మనసు రెడ్లకు ఉండటంతోనే అధికంగా ప్రజాప్రతినిధులుగా ఎంపికవుతున్నారని చెప్పారు. అలాగే వ్యవసాయం, వ్యాపారం,రాజకీయం, సామాజిక రంగాలలో రెడ్లు తమ ప్రత్యేకతను చాటుకుంటూ ప్రజలకు సేవచేస్తున్నారని కొనియాడారు. అయితే రెడ్లతో పాటు అనేక సామాజికవర్గాలు సమాజానికి సేవచేయాలనే తపనతో ముందుకు వస్తున్నాయన్నారు. ఏసామాజిక వర్గానికి చెందినవారైనా మంచితనం, మానవత్వం సేవచేయాలనే తపనఉంటే సముచిత గౌరవం దక్కుతుందని చెప్పారు. ఏ పదవిలో ఉన్నా , ఏ స్థాయిలో ఉన్నా సహాయంకోసం వచ్చేవారిని ఆదుకుంటే సమాజం గౌరవిస్తుందన్నారు. పేదలే సహాయంకోసం వస్తారు వారిని విస్మరించకుండా తప్పనిసరిగా సహాయం చేయాలని రెడ్డిసామాజిక వర్గానికి సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యవసాయ శాఖామంత్రిగా అవకాశం కల్పించడంతో అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి వ్యవసాయరంగాన్ని తీర్చిదిద్దే అవకాశం లభించిందన్నారు. దేశానికి దిక్సూచిగా తెలంగాణ వ్యవసాయరంగాన్ని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషిలో నేను భాగస్వామిగా పనిచేసినందుకు గర్వంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ప్రతిసంవత్సరం లక్షా 25 వేల కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని పండించి ఆదర్శనీయంగా నిలిచారని ప్రశంసించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి అయితే గ్రామీణ ఆర్థికవ్యవస్థ స్వరూపం మారుతుందనీ, రైతుల జీవన ప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. విద్యార్థులు చదువులు పూర్తి చేసుకుని జీవితంలో స్థిరపడిన అనంతరం సహాయం చేసే గుణాన్నిమర్చిపోవద్దని హితవుచెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు,మాజీ హోంశాఖమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో రెడ్డి విద్యాసంస్థలు అందిస్తున్న సేవలు ప్రసంసనీయమన్నారు. అయితే దాతల ఆర్థిక సహాయంతో ఉన్నతచదులు చదివి సమాజంలో గుర్తింపు లభించిన అనంతరం పేదలను విస్మరించరాదని విద్యార్థులకు చెప్పారు. జీవితాల్లో స్థిరపడిన అనంతరం సమాజ సేవకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులను కోరారు.





భాషణ భూషణాలు

రావికొండల రావు ప్రముఖ సినీ నటుడు. సినీ రంగంలో రాణిస్తూనే చక్కని హాస్య నాటికలు కూడా రాశాడు. అందులో 'పానకంలో పుడక' అనే నాటకంలో ఓ చమత్కారపు జల్లు కురిపించాడిలా "ఓ సినిమాలో హీరో హీరోయిన్లు ప్రేమించుకోవటం చూసి, భార్య భర్తను ఇలా అడిగింది– "ఏ వండీ వాళ్లు అంత చక్కగా ప్రేమించుకుంటున్నారు. మీరు ఏనాడైనా నన్ను ఇంత ఇదిగా ప్రేమించారా?'' వెంటనే భర్త "ఓసి వెర్రిముఖమా, అలా ప్రేమించటానికి వాళ్లకి లక్షలకి లక్షలు ఇస్తారే, నీకూ నాకూ ఎవరిస్తారే... ఈ సినిమాకి టిక్కెట్టు కొనడమే దండగ'' అన్నాడట. అదీ రావికొండల రావు తన కలం ద్వారా పండించిన చమత్కారం. అట్లా హాస్య నాటక రంగానికి ఆయన తన వంతు కృషి చేశాడు.

పంపిన వారు: దామోదర్. పి; గ్రా॥, మం॥ మొగుళ్లపల్లి, జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

mail id : editor@manatelangana.org

కవిత్వ తపోధనుడు రామా

బహుముఖ ప్రజ్ఞావంతుడయిన కవి, కథకుడు, నవలాకారుడు రామాచంద్రమౌళి గారు రాసిన కవిత్వం నుంచే ఎంపిక చేసిన కవితల్ని ఆరుగురు ప్రముఖ అనువాదకులు ఆంగ్లీకరించారు. అదే 'తపస్సు' పేరుతో ఒక బృహత్ ద్విభాషా కవిత్వ సంపుటిగా వచ్చింది. ఎల్లలు లేని ఆయన కవిత్వం ఎల్లలు దాటే ప్రయత్నమిది.




సౌభాగ్య
9848157909

శాస్త్ర, సాంకేతిక విద్యలోనూ నిష్ణాతులయిన రామా చంద్రమౌళి భావుకతలో ఎన్నో రసాయనిక ప్రక్రియలకు అవకాశముంది. ఆయన కవిత్వం ద్రాక్షాపాకం కాదు. అట్లా అని నారికేళ పాకమూ కాదు. ఆసక్తి కలిగిన వారు సమీపిస్తే అక్కున చేర్చుకునే ఆత్మీయ కవిత్వం. సామాజిక అంశాల్ని స్పృశించినా అసాధారణమైన మానసిక విశ్లేషణే మౌలిక చింతనగా ఈ సృజన ప్రవహించింది.

'అతనికి చాలా దుఃఖంగా ఉంది
పంచుకోడానికి ఎవరూ లేరు. చుట్టూ వెదికాడు
అంతా అరణ్యం, నాభిలోంచి తన్నుకొస్తున్న ఆక్రోశంతో ఆకాశం దద్దరిల్లేలా అరిచాడు. సకల దిశలూ ప్రతిధ్వనించాయి'. బబ్బేల్లపాటి ఇందిర గారు చేసిన దీని అనువాదం చూడండి.

Filled with sorrow taking none to share with
He looked around, its all an endless wildeness
his agonizing sorrow came thrusting
From his morvel, his screamed, shuddered
The sky echoing in all the directions



రామాచంద్రమౌళి

చాలా సరళ సుందరంగా సమజంగా సాగిన అనువాదం కవి అంతరంగానికి అద్దం పట్టింది. కవిత్వాన్ని అనుభవించి పలవరిస్తే కానీ ఇట్లాంటి అనుసృజన సాధ్యం కాదు. అన్ని కవితలూ యిదే స్థాయిలో అనువదింపబడ్డాయి.

సామాజిక అంశాలనయినా హృదయంతో, ఆర్ద్రతతో రామాచంద్రమౌళి ఆవిష్కరిస్తారు. కవి మానవ జీవితాన్ని మణిమయం చేయాలనుకునే మనస్వి కదా ! రామాచంద్రమౌళిలో అట్లాంటి మానవత్వ పరిమళముంది. అందరూ ఉండి ఎవ్వరూ లేని స్త్రీ నిస్సహాయత గురించి 'సహచరి' అన్న కవిత రాశారు.

...ఆమె ఆ ఉదయమే వాకిట్లో స్పృహ కోల్పోతుండగా
మున్సిపల్ 'తడి' చెత్తవాడు చూచి 108కు ఫోన్ చేశాడు.
ఐసియూ డాక్టర్ 'ఈమెకు ఎవరూ లేరా' అనడిగితే జవాబు చెప్పేవాడెవడూ లేదు
వెంట ఒక తెల్లని పిల్లి మాత్రం కనబడింది.
ఈ కవిత యొక్క ఆత్రేయ శర్మ గారి అనువాధం.

That Morning on finding her losing consciousness
The Municipal wet waste collector called 108
'doesn't she have any one' asked the doctor
none to answer
but only white cat found just behind here

రామాచంద్రమౌళి కవితల్లో కథన రీతికి అనుగుణమయిన అనువాదమిది. అపురూప కవితల అనువాదాల మణిహారమయిన ఈ 'తపస్సు' కవితా సంపుటి రామాచంద్రమౌళి గారికి అంతర్జాతీయ గుర్తింపును తెస్తుందని బుజువౌతోంది.

జీవితంలో నమ్మకం, ఆరాధన, ఆత్మీయత అపురూపమయినది. రామాచంద్రమౌళి గారికి దశాబ్దాల తరబడి ధ్వన్యనుకరణ సామ్రాట్ కళాప్రపూర్ణ, పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ గారితో విడదీయరాని అనుబంధం, ఆత్మబంధుత్వం ఉండేది. ఆ కారణంగా ఈ గ్రంథం ఆయన దివ్యస్మృతికి అంకితం ఇచ్చారు. ఈ కవిత ఆయన 60వ జన్మదిన సందర్భంగా రామా చంద్రమౌళి గారు రాశారు. 2011లో వేలాది మంది సమక్షంలో చదివారు. ఇటీవలే స్వర్గస్థులయిన ఆయనకు నివాళిగా ఆ కవితను యిందులో చేర్చారు.


అతను శబ్ద కంఠుడు ఒక లిప్త కాలంలో కళ్ళు మూసుకుని
సకల స్వర సముద్రాలనూ తాగుతూ ఆగస్త్యుడౌతాడు.అంటూ మహా ప్రవాహ సదృశంగా సాగిన ఈ కవిత ఆ మహా కళాకారునికి నివాళిగా కొనసాగుతుంది.
'ఏదో ఒక తాదాత్మ్య వీచిక తలను నిమిరి వెళ్ళిపోతుంది.
మాతృ స్పర్శవలె. అతను... అలా పాదముద్రలను మనకు ఒక వారసత్వంగా
మిగల్చి నడిచి పోతుంటాడు... ఒక ఋషిలా
అతడు వేణుమాధవుడు... వేణువూ... మాధవుడూ రెండూ తానే ఐనవాడు
స్వర మాంత్రికుడు' అంటూ ముగుస్తుంది. ఈ వాక్యాల అనువాదం

'He leaves a trail of foot steps behind
for us and moves on like a rishi
venumadhav, he's both venu
the Flute and madhav,
the wizard of sound'

ఎంతో ఆరాధనా భావం వుంటే తప్ప యిలాంటి కవిత రాయడం అసాధ్యం !

రామాచంద్రమౌళి ప్రపంచాన్ని పరిశీలిస్తాడు. సంక్షుభిత సమాజాన్ని వివిధ కోణాల్లో సందర్శిస్తాడు. ఉద్విగ్నుడవుతాడు. ఆవేశపడతాడు. వేల కన్నీటి నదుల్ని వదుల్తాడు. నిస్సహాయుల పట్ల అవ్యాజ ప్రేమను ప్రకటిస్తాడు.

జైల్లో ఏండ్లకు ఏండ్లుగా యుద్ధ ఖైదీగా బంధింపబడ్డ ఒక ముస్లిం మాతృమూర్తి తన ఏడేళ్ళ కొడుకును చూడ్డానికి అనుమతిపొంది 'ములాఖత్' గదివైపు ఒంటిపై బురఖాతో వెళ్తున్నపుడు ఆ తల్లిని అధికారులు ముసుగు తొలగించమని నిర్బంధిస్తే ఒళ్ళంతా స్కానింగ్ చేస్తే అగ్ని పర్వతంలా రగిలిపోయిన ఆమె.



' దాదాపు నగ్న స్థితికి చేరిన ఆ తల్లి
మరుక్షణం బెబ్బులిలా సైనికుని దగ్గరకు ఉరికి
వాని ముఖం పై తుపుక్కున ఉమ్మేసి
విడిచిన తన బట్టలనూ, బురఖానూ, చారెడు కన్నీళ్ళనూ మోసుకుంటూ
వెనక్కి తన జైలు గదిలోకి పరిగెత్తింది. అప్పుడామె కొన్ని సార్లు బతకడం కంటే బతక్కపోవడమే ఉత్తమమని గ్రహించింది'

ఈ పాదాల అర్ధవంతనంతమయిన అనువాదం ఈ క్రింద చూడండి

In semi nakedness, as if prompted, she jumped
towords the sentry like a charged lionness
she spat voilently on his face, gathering her clothes, the
burka. and a handful of tears
she turned back to her chamber

వాఖ్యానానికి ఆస్కారమివ్వని అనువాదమిది.

ఈ కవిత చివర్లో బ్రాకెట్లో (ఆ తల్లిది సిరియానా, పాలస్తీ నానా, గాజానా, ఇరాకా, ఇరానా, పాకిస్తానా, అఫ్ఘనిస్థానా, అన్న ప్రశ్న పూర్తిగా అనవసరం) అన్న మాటలున్నాయి. ఆత్మాభిమానానికి, అహానికి, హింసకి ప్రాంతాల పరిమితులుండవు కదా !

'కొంత స్థలం కావాలి' అన్న ఒక అపురూపమయిన కవిత రాశాడు రామాచంద్రమౌళి. మనిషి నిరంతరం తన ఉనికి కోసం చేసే అన్వేషణా క్రమాన్ని ఆ కవితలో వివరించారు.

' ఒక మనిషి పారిపోతున్నాడంటే
తనున్న చోటు తనుండ వలసిన చోటుకాదనీ
తను జీవిస్తున్న జీవితం
తను జీవించవలసిన జీవితం కాదనీ
పక్షి తన గూటికోసం జానెడు జాగానూ వెతుక్కుంటున్నట్టు
మనిషి చారెడు 'స్థలాన్ని' (space) అన్వేషిస్తున్నాడని
అన్వేషణ అంటే... ఒక లేనిదాని ఉనికిని కనుక్కోవడమే... అని అర్థమా ?'

అంటూ మార్మికంగా, ప్రశ్నార్థకంగా కవిత ముగుస్తుంది. అతిక్లిష్టమయిన భావాన్ని అతి సరళంగా ఆవిష్కరించే రసవిద్య రామాచంద్రమౌళికి తెలుసు.

మనందరం నిరంతరయాత్రికులమే నిలువ నీడ కోసం, గూడు కోసం, మనసు పొందే ఆశ్రయం కోసం నిరంతర సంచారులమే. మనల్ని కలిసిన వాళ్ళు, మనతో కలిసి చదువుకున్న వాళ్ళు, తోడబుట్టిన వాళ్ళు, ఏవేవో శక్తుల ప్రేరణతో ఎక్కడికక్కడ విడిపోతూ ఏవేవో 'స్థలాలకు' చేరడం మన నిత్య అనుభవమే.

If a man runs away
franatically shapping every bond, it only means
That the place he has sofar lived at it no longer his
that the life he has so faor lived is no more his
that he is questing for a handful of space
like a bird looking for a nestful of space
quest is but seeking out a nonexistent existence

అంటూ ఆత్రేయ శర్మ గారి అనువాదం ప్రవాహ సదృశంగా సాగింది.

ఇట్లా జీవితాన్ని వివిధ కోణాల్లో విస్పష్టతగా పరిశీలించాక, విశ్లేషించిన కవితల సమాహారం ఈ సంపుటి.. నిరంతర కవితా తపస్సులో నిమగ్నమయిన కవికి గానీ యింత సాంద్ర కవిత్వ సృజన సాధ్యం కాదు. అపూర్వమయిన ఈ కవితల కాంతులు అన్ని ఖండఖండాల్లో విస్తరించాలని మనమందరం కోరుకుందాం.

రామా చంద్రమౌళి జీవితాన్ని బహుముఖాలుగా దర్శించినవాడు వ్యక్తిగతమయిన అనుభూతుల్ని ఎంత బలంగా ఆవిష్కరించగలడో సమూహాల, తెగల సంస్పందనల్నీ అదే స్థాయిలో ఆవిష్కరించారు. అనంత ప్రకృతి ఆహ్లాద విలాసాన్ని తన్మయత్వంతో తలకెత్తుకోగలడు ఈ కవి.

ఈ కవిత్వ రచన వెనుక ఉన్న రహస్యం ఆత్మ సమర్పణ. ఈ కవి అద్దంలాంటివాడు. ప్రకృతికి, సమాజానికి తనను తాను సమర్పించుకుంటాడు.ఆ కారణంగా అన్నీ అతన్లో ప్రతిఫలిస్తాయి.

'సృష్టి పులకించిపోతున్న వేళ' అన్న కవిత యిలా సాగుతుంది.
ఉదయమే సూర్యుడు కిరణకరాలతో స్పర్శించగానే
ఈ దేశంలోని రైతులు ఈ పుణ్యభూమి పై మోకరిల్లుతారు.
మట్టి... శత సహస్ర హస్తాలతో... మొక్కల ఆకులు ఆకులుగా వికసించి
ఈ ప్రజల కోసం పూలనూ, పండ్లనూ, ధాన్యరాశులనూ...
కోటి వసంతాలనూ వర్షిస్తుంది..'

ప్రకృతికీ జీవితానికివున్న పవిత్ర సంబంధాన్ని పరవశంగా గానం చేస్తాడు రామా చంద్రమౌళి.

ఇట్లాంటి ప్రతాభావిష్కారాలకు అర్థవంతమయిన అనువాదాలు చేయగలిగిన సమర్థులయిన అనువాదకులు దొరకడం రామాచంద్రమౌళి అదృష్టం.

ఆత్రేయ శర్మ గారు పై భాగాన్ని అనువదించిన తీరు చూడండి.

As soon as the rays of the sun touch the earth.
The farmers knel down on this holy land
he soil with its millions of hands into a
Wealth of foaliage and showers the Country men
With a bountis of flowers and fruits,
granaries of grains millions of vernal seasons

రామాచంద్రమౌళి 'దేశము పట్టనంత కవి'

దేశ కాల సరిహద్దులు దాటిన కవి. ఈ సంపుటి ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో తప్పక గొప్ప గుర్తింపును తెస్తుంది. అతని వస్తువులన్నీ వ్యక్తిగత. సాముదాయక, మార్మిక సమ్మేళనంతో వజ్రదీధుతుల్ని వెదజల్లుతూ వుంటాయి.

ఒక బహుముఖ నైపుణ్యమున్న, శాస్త్ర సాంకేతిక జ్ఞానమున్న భావుకుడు. కవి నిర్మించిన వజ్రపంజరం ఈ 'తపస్సు' . దానిలో మన మనసుల్ని బందీ చేసే మాంత్రికుడు రామా చంద్రమౌళి.

('తపస్సు' ద్విభాష సంపుటి. కవి : రామా చంద్రమౌళి, సంపాదకులు : కె. పురుషోత్తం, ప్రతులకు : జ్యోతి వలబోజు, సెల్ : 8096310140)

అనువాద గ్రంథావిష్కరణ

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి హైదరాబాద్‌లో ఆచార్య ఎస్వీ రాసిన 'జీవితం ఒక ఉద్యమం' కవితా సంపుటి ఆంగ్లానువాద గ్రంథం 'LIFE IS A MOVEMENT' 29.1.2019 మధ్యాహ్నం 3గంటలకు ఆవిష్కరణ జరుగుతుంది. ఆచార్య పి. లక్ష్మీనారాయణ సభాధ్యక్షత వహించే ఈ సభలో డా. నందిని సిధారెడ్డి గ్రంథావిష్కరణ చేస్తారు. దేశపతి శ్రీనివాస్, ఆచార్య అలేఖ్య పుంజాల, డా.పత్తిపాక మోహన్, గ్రంథాను వాదకురాలు, స్వాతిశ్రీపాద, గ్రంథ సంపాదకులు చింతపట్ల మోహన్, ఆచార్య శ్యామల, ఆచార్య జి.ఎస్ గాబ్రియెల్ తదితరులు పాల్గొంటారు.

ఒకరోజు వరవరరావు కవిత్వం

మహబూబ్‌నగర్‌లో గల తెలంగాణ చౌరస్తా దగ్గరి రోజ్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఫిబ్రవరి 3 వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ప్రముఖ విప్లవ కవి వరవరరావు కవిత్వంతో ఒక రోజు కార్యక్రమం జరుగుతుంది. ఇందులో బి.సుదర్శన్‌రెడ్డి, జి.హరగోపాల్, కె.శివారెడ్డి, ఖాదర్, పాణి, నందిని సిధారెడ్డి, జి.లక్ష్మీ నర్సయ్య, దేవిప్రియ, యాకుబ్, ఎ.కె.ప్రభాకర్, కోయి కోటేశ్వరరావు, కొండేపూడి నిర్మల తదితరులు పాల్గొంటారు.

బాసరలో సాహిత్య పురస్కారాలు

బాసరలో ప్రతియేటా ఇచ్చే డా॥ మూడ నాగభూషణంగుప్తతేజ సాహిత్య పురస్కారాలను ఈయేటికిగాను ఫిబ్రవరి 5వ తేదీన డా॥ నందిని సిధారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రదానం చేస్తారు. పాత ఉమ్మడి జిల్లాల వారీగా ఆదిలాబాద్–తుమ్మూరి రామ్మోహన్ రావు, కరీంనగర్ –సంకేపల్లి నాగేంద్రశర్మ, ఖమ్మం– చిగురుమళ్ల శ్రీనివాసులు, నల్లగొండ– డా॥ ఎం.పురుషోత్తమాచార్య, నిజామాబాద్–ప్రొద్దుటూరి మాధవీలత, మహబూబ్‌నగర్–జలజం సత్యనారాయణ, మెదక్ – డా॥ బెల్లంకొండ సంపత్‌కుమార్, రంగారెడ్డి– డా॥జనువాడ రామస్వామి, వరంగల్–డా॥ వాణిదేవులపల్లి, హైదరాబాద్–డా॥ రాపోలు సుదర్శన్, ప్రత్యేక సత్కారాలను అవధాని బెజుగామ రామ్మూర్తి, దారం గంగాధర్‌లు పొందుతారు. అవార్డు గ్రహీతలకు రూ.1016/–నగదుతో పాటు శాలువా, మెమెంటో అందిస్తారు. అని డా॥ పోరెడ్డి రంగయ్య తెలిపారు.

మౌనశ్రీ మల్లిక్‌కు పురస్కారం

ప్రతిష్ఠాత్మక సినారె కవితా పురస్కారం ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఐఎంఎ హాల్ కరీంనగర్ నందు తప్త స్పృహకర్త ప్రముఖ సినీ కవి మౌన శ్రీ మల్లిక్‌కు ప్రదానం చేస్తారు. ముఖ్య అతిథిగా కరీంనగర్ ఎంపి బి.వినోద్‌కుమార్, సభాధ్యక్షులుగా డా.ఎడవెల్లి విజయేంద్రరెడ్డి, అతిథులుగా డా॥ గంద్ర లక్ష్మణ్‌రావు, కె.ఎస్. అనంతాచార్యలతో పాటు తప్త స్పృహ పరిచయం నంది శ్రీనివాస్ చేస్తారు. దాస్యం సేనాధిపతి, గాజుల రవీందర్, ఇస్రత్ సుల్తానా, ఎ.గజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు.

నేటిప్రవణం

బతుకొచ్చినోడి బడాయి
తెల్లవాడి లడాయి
అమెరికా ఆర్భాటం
కొత్త వెలుగు చెలగాటం
ఒబామా సామీప్యం
ఆరోగ్యపు ఆనందం
ట్రంప్ గారి దొరతనం
అసహనాల ఘీంకారం
ఖర్చొద్దని పోరాటం
అభాసుపాలు అమెరి'కీ'లు //బ//
కిమ్ దూకుడు చైనా దే వాగుడు
ఆర్భాటపు డొల్లతనం
ట్రంప్ దాయె డాంబికం
అంతులేని నీటకం
పిచ్చుకపై బ్రహ్మాస్త్రం
మెక్సికో కు బంధనం
గోడయే ఇక సాధనం
ట్రంప్ దేమో చెలగాటం
ఫెడరల్స్ కు ప్రాణసంకటం //బ//
పైసలకై చదువు నమ్ముడు
మేలి బుర్రలకు గాలమేసుడు
ఉన్న వారికి వాతపెట్టుడు
గోటితో పోయే దానికి గొడ్డలి సాన
పెట్టుడు// బ//

డాక్టర్ కాసర్ల రంగారావు, 8332998881

నేనూ నువ్వూ

నేనేమో
చిటికెడు వెలుగును కోరుకున్నాను
నువ్వేమో
పిడికెడు చల్లని వెన్నెలను మోసుకొచ్చావు
నేనేమో
దాహం తీరేందుకు దోసెడు నీళ్ళడిగాను
నువ్వేమో
వానా కాలాన్నే వెంటేసు కొచ్చావు
నేనేమో
చిన్న గెలుపు కోసం తపన పడ్డాను
నువ్వేమో
వాకిట్లో విజయ తోరణమే కట్టావు
ఇంతకూ
నేనెవరు నువ్వెవరు
నేనేమో చిన్ని ఆశను
నువ్వేమో కొండంత ఆత్మవిశ్వాసానివి

–వారాల ఆనంద్ 9440501281

మొలకల పున్నమిలో రాయలసీమ




జె.బి చరణ్
9491977190

తెలుగు రాష్ట్రాలలో రాయలసీమలోని కడప జిల్లా పేరు తెలియని వారుండరని చెప్పడం అతిశయోక్తి కాదేమో! అటు రాజకీయంగా,ఇటు సినిమా పరిశ్రమ రాయలసీమ ఇతివృత్తంగా తీసుకొని నిర్మించిన ఎన్నో సినిమాల వల్ల, పూర్వం ఇక్కడ జరిగిన ఫ్యాక్షన్ హత్యల వల్ల కూడా రాయలసీమ చాలా ఫోకస్ అయ్యిందనే చెప్పాలి. ఇదొక కోణం మాత్రమే మరోకోణం అత్యంత వెనుకబడిన ప్రాంతంగానూ, కరువు, ఉద్యోగ, ఉపాధి, అక్షరాస్యత ఇలా ప్రతివిషయంలోనూ రాయలసీమ వెనుకబడే ఉంది. తెలుగు రాష్ట్రాన్ని ఎక్కువగా పరిపాలించిన రాయలసీమ రాజకీయ నాయకులు సీమను పెద్దగా పట్టించుకోలేదనే చెప్పాలి. రాయలసీమలోని కడప జిల్లా దాదాపు తెలుగువారందరికీ తెలుసంటే అది దాదాపుగా వై.ఎస్ కుటుంబం వలెనేనని చెప్తారు. అది మాత్రమే కాదు కడప జిల్లాలో ఎందరో సాహిత్యవేత్తలు కూడా ఉన్నారు. సీనియర్ రచయిత కేతు విశ్వనాథ్ రెడ్డి గారి నుండి నేటి వేంపల్లి గంగాధర్ గారి వరకు ఇక్కడి మూఢాచారాలపై, పద్ధతులపై, సంస్కృతిపై ఎన్నో రచనలు చేశారు. అలాంటి రచనే 'మొలకల పున్నమి' కథా సంపుటి. ఈ పుస్తకానికి తొలికేంద్ర సాహిత్య యువపురస్కారం లభించింది.

రాయలసీమ అనగానే ఫ్యాక్షన్, చంపడాలు, నరకడాలు, దుర్మార్గులనే భావన కలిగేలా చేసేశారు. కానీ ఇక్కడి వెనుకబాటును గుర్తిస్తూ మూఢనమ్మకాలపై వచ్చిన కథా సంపుటి మొలకలపున్నమి. కథలన్నీ కడప జిల్లా మాండలికంలో ఉండటం చేత సాధారణమైన రీడర్స్ కి త్వరగా చేరుతాయి. యామయ్య సామి గుర్రం అనే కథలో వర్షం రాకపోతే యామయ్య సామి వచ్చి తన గుర్రంతో విన్యాసాలు చేస్తే వర్షం పడుతుందని ఒక నమ్మకం. వర్షాన్ని ఒక సాధారణమైన వ్యక్తి ఎలా రప్పించగలడు?. మనిషిని అతినమ్మకం చాలా వెనక్కి నెట్టేస్తుంది. బాధ, కష్టం దేనినైనా నమ్మేలా చేస్తాయి. అలాంటి సందర్భంలోనే ఇలాంటి కట్టు కథలు పుట్టుకొస్తాయి. నిస్సహాయుడైన మనిషి వాటికి లొంగిపోతాడు అని తెలిపే కథ. వేంపల్లి గంగాధర్ కథల్లో వాస్తవికత, సహజత్వం ఉండటం చేత కథలు త్వరగా ఆకట్టుకుంటాయి. కథలో పాత్రలు మాట్లాడుతుంటే అలాంటి వ్యక్తిని మనం ఎక్కడో చూశామే అనిపిస్తాయి. అంటే రీడర్ ని కథలోకి ప్రవేశించేలా చేయడం ఈ రచయితకు బాగా తెలుసని నా అభిప్రాయం.

కథనంలో ఒకే పదాన్ని పదేపదే రాయడం చేత అప్పటివరకు కథ మాములుగా చదివే రీడర్ అలాంటి సందర్భం రాగానే కథలోని మార్పును గమనించడమే కాకుండా ఆ ఫీల్ ని, ఎమోషన్ ని ముందుకు తీసుకుపోవడానికి బాగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు నీళ్ళు కావాలని చెప్పడం ఎలా ఉంటుంది. నీళ్ళు నీళ్ళు నీళ్ళు ఒక చుక్క నీళ్ళు ,నేలను తడిపే నీళ్ళు, నాలుకను తడిపే నీళ్ళు, గొంతులో గలల పారే నీరు అని చెప్పినప్పుడు రీడర్ అందులోని ఎమోషన్ త్వరగా క్యాచ్ చేయగలడు. కథకుడు రీడర్‌ని దృష్టిలో పెట్టుకొని కథలు రాసినప్పుడు మాత్రమే అందులోని అంశం ఎక్కువ మందికి చేరుతుంది. వేంపల్లి గంగాధర్ గారి కథలు చదివినప్పుడు రచయిత ఊహించి రాశాడనే ఫీలింగ్ రాదు. కథలో రచయిత చెప్తున్న విషయం వాస్తవంగా జరిగిందని రీడర్ ఈజీగా అర్థం చేసుకోగలడు.



అందుకు కథలోని భాష, పాత్రల సహజ స్వభావమే సాక్ష్యం. రచయితలు రెండు రకాలుగా ఉంటారు కొంతమంది ఊహించి రాస్తేవారు మరికొంత మంది జరిగిన విషయాన్ని కాస్త మార్పులతో రాయడం. ఎలా రాసినా కథనం, చెప్పే విధానం తేలిపోతే కథాంశం ఎంత బలమైనదైన కథ సఫలం కాదు.

ఏ ప్రాంతమైనా సరే మహిళకు రక్షణ మాత్రం లేదు పేరుకే మహిళలను, పిల్లలను రాయలసీమ వారు ఏమీ చేయరని ఉంటుంది. మహిళకు చావుకన్న విలువైనది శీలం అదే పోతే ఆమె బతికున్న మరణించినట్లే అనుకుంటుంది. ఒక కథలో తండ్రి వయసు వాడు మహిళను ఏ విధంగా ఆక్రమించి బలిగొన్నాడో హృదయవిదారకమైన కథనంతో మనకు తెలియజేశారు.

ముందు భయంతో హింస, తరువాత అవసరంతో హింస, కోరికలతో హింస ఇలా పక్షులను, జంతువులను తన అవసరాలకో,ఆకలి కోసమో చంపడం మనం చూశాము. మూఢనమ్మకాలతో కూడా జంతువులను హింసించి చంపడం ఇప్పటికీ జాతర్లల్లో, పండుగ సమయాల్లో జరిగే పోటీలలో చూస్తూనే ఉన్నాము. అసలు రక్తం కోరేవారు దేవుడు/దేవత ఎలా అవుతారు? చదువుకున్నవారు అయినప్పటికీ ఇలాంటి విషయాల్లో మాత్రం చాలామంది ఆలోచనా రహితంగా ఉండటం చూస్తే అసహనం కలుగుతుంది. ఒక మేకపిల్లను ఎత్తుగా ఒక బండికి కట్టి అది మరణ భయంతో కొట్టుమిట్టాడుతూ ఉంటే రాక్షస ఆనందం పొందే మనిషిని చూస్తే అసహ్యం వేస్తుంది.

ఇప్పటికీ ఇలాంటి కార్యక్రమాలు రాయలసీమ జిల్లాల్లో జాతర పేరుతో చేస్తూనే ఉన్నారు. గత ఏడాది కూడా మా పులివెందులలో ఇలానే జరిగింది. గ్రామం బాగుండాలని జంతువులను హింసించి చంపడం నేటి సాంకేతిక సమాజంలో ఇంకా జరుగుతోందంటే దానిని మనం ఆపలేకపోతున్నామంటే మనిషిగా విఫలం చెందామనే అర్థం. ప్రభుత్వాలు, రాజకీయ నాయకుల అండదండలతో జరిగే ఈ సంఘటనలను న్యాయస్థానాలైనా అరికట్టాలి.

రాయలసీమను పట్టి పీడిస్తున్న సమస్యల్లో ఆడపిల్లలను బలవంతంగా వేశ్య వృత్తిలోకి దింపడం, వారిని దుబాయ్, సౌదీ లాంటి దేశాలకు తరలించడం ఇప్పటికీ రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో పడుపు వృత్తి ఎక్కువగా జరుగుతోంది. ముక్కుపచ్చలారని బీదకుటుంబాలకు చెందిన ఆడపిల్లలని టార్గెట్ చేసి మంచి పని దొరుకుతుందని నమ్మపలికి ఇతర దేశాలకు పంపే ఏజెంట్స్, సెక్స్ మాఫియా ఇప్పటికీ ఈ ప్రాంతలో ఉన్నాయి. వాటి మూలాలను తుడిచిపెట్టేయాలంటే. అక్ష్యరాస్యత పెరగాలి, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి, ఇలాంటి పడుపు వృత్తి వలన జీవితాలు ఎలా నాశనమౌతాయో తెలియజేస్తూ ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టాలి.

మొలకల పున్నమి కథల్లో ఆర్ధ్రత, సీమ ప్రజల జీవనవిధానం, మూఢనమ్మకాలు ఎలా బలహీనం చేస్తాయో, నిరక్షరాస్యత ఎలా వెనక్కి నెట్టేస్తుందో, విలువలు లేని సమాజం ఎలా ఉంటుందో, మనిషి సాటి జీవులైన జంతువులపై ఎంత క్రూరంగా ఉంటాడో, అమాయక ప్రజలు ఎలా మోసపోతున్నారో, నిస్వార్థమైన ప్రేమలు ఎలా ఉంటాయో, ఒక ప్రాంతం దశాబ్దాలుగా ఎలా వివక్షకు గురైందో, తప్పుగా ఎలా చిత్రీకరించబడిందో లాంటి ఎన్నో విషయాలను తెలిపే కథలు మొలకల పున్నమిలో కనపడుతాయి. రచయిత కడప ప్రాంతం వారు కావడం చేత దగ్గరిగా అన్ని విషయాలు గమనించడం చేత కథలు చాలా సహజసిద్ధంగా రాశారు.

అతికొద్ది మందికే దొరికే అరుదైన అవకాశం ఈ రచయితకు దొరికింది అదే రాష్ట్రపతి భవన్‌లో విడిది. కేంద్ర సాహిత్య పురస్కారమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో పురస్కారాలు అందుకొని తనదైన సహజ శైలితో రాసిన కథలు వారిని మరింత ఉన్నత స్థానానికి తీసుకువెళ్ళాలని ఆశిస్తూ ఇలాంటి సహజ కథలు రాయడం వల్ల గ్రౌండ్ లెవెల్ లో ఏమి జరుగుతోందో సమాజం దృష్టికి విషయాలను తీసుకెళ్ళవచ్చు కావున ఇలాంటి మరెన్నో రచనలు చేసి సమాజాన్ని చైతన్యపరచాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను.

ఏ కౌన్ థీ...
ఏక్ బేచారా, ఏక్ ఆవారా

ఇంతకంటే బాధాంకురం మరొకటి
ఉండదేమో....
ఇంతకన్నా ఉసూరుమన్పించే ఆక్రోశం కన్పించదేమో ...
షబనా ఆజ్మీ కానీ, స్మితా పాటిల్ కానీ
అనుభవించి, పల్లవించి ఉండదేమో
ఇంతటి అగాథం జగన్నాథం.
తీరానికి క్షణాలవారీగా
యుగాలుగా నుదురు బాదుకునే
సముద్రమూ భరించదేమో...



దర్జాను చూసే వెలుగు సంగతి
కంటికి తెలియదా?
నేలకంటుకుని ఉండే ధూరేణువు
గురించి
అంతటి మింటికి పట్టదా?
ఆడపడుచు పుట్టింటిని మరుస్తుందా?
వాగు తన హోయలను విస్మరిస్తుందా?
కాలనాగు తన దూసుకెళ్లే లక్ష్యాన్ని
తప్పుతుందా?
పిల్లగాలి చల్లదనం పిల్లతనం తనది
కాదంటుందా?

అందం తన కదుపుదనాన్ని
కసిరికొడుతుందా?
నింగి వసారాలో పచార్లు కొట్టే పతంగి
తన రెపరెపల కేతనపు
ఆధారాన్ని ..ఆ దారాన్ని
దిక్కులేని దానిని చేస్తుందా?

మన సంతకానికి
ఆసాంతం సొంతం
అక్షరాక్షరం కాదూ....?
ఆ అక్షరమే అక్కరలేదనుకుంటే
రాత అవుతుందా? పిచ్చి గీతవుతుందా?
పచ్చిగా చెప్పాలంటే ...
వేరును వెలివేసి
చెట్టు ఫలాలను జుర్రుకోవాలనుకోవడం
ఉంది చూశారూ....
అది వెర్రి వెంగళప్ప బాపతుగా
మారుతుంది...
చరిత్ర నలుపు పుటల్లో చేరుతుంది...
మనస్సు ఉషస్సును చెరిపి తీరుతుంది.

జగన్, 9848447631



ఆరోగ్యానికి బీట్‌రూట్

– ప్రవల్లిక



ఆకులతో కూర

కావాల్సిన వస్తువులు:
బీట్‌రూట్ ఆకుల తరుగు: 3 కప్పులు, ఉల్లిపాయ:1
పచ్చిమిర్చి: 3
పెసరపప్పు: 2 టీస్పూన్లు
పసుపు: చిటికెడు
కారంపొడి: 1 టీస్పూన్
గరం మసాలా పొడి: 1/4 టీ స్పూన్, అల్లం వెల్లుల్లి ముద్ద: 1 టీ స్పూన్, ఉప్పు: తగినంత
నూనె: 3 టీ స్పూన్లు

తయారీ విధానం: బీట్‌రూట్ ఆకులను కాడలతో సహా శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పెట్టుకోవాలి. వెడల్పాటి పాన్‌లో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి మెత్తబడే వరకు వేయించాలి. ఇందులో అరగంట నీళ్లలో నానబెట్టిన పెసరపప్పు, పసుపు, అల్లంవెల్లుల్లి ముద్ద వేసి కొద్దిగా వేయించాలి. ఇందులో కారంపొడి వేసి కలిపి బీట్‌రూట్ ఆకుల తురుము, తగినంత ఉప్పు వేసి కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. నీరంతా ఇగిరిపోయిన తర్వాత గరంమసాలా పొడి వేసి కలిపి దింపేయాలి. ఈ కూర అన్నం, చపాతీలకు బావుంటుంది. ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

బీట్‌రూట్ సూప్

కావలసిన వస్తువులు:
బీట్‌రూట్ : 1 చిన్నది, కార్న్‌ఫ్లోర్ : 2 టీస్పూన్లు
మాక్రోనీ : 1/2 కప్పు, ఉప్పు : తగినంత
మిరియాల పొడి : 1/4 టీస్పూన్
కొత్తిమిర : కొద్దిగా, వెన్న : 2 టీస్పూన్లు

తయారీ విధానం: మాక్రోని ఉడికించి జల్లెట్లో వేసి చన్నీళ్లతో వార్చుకోవాలి. బీట్‌రూట్ ముక్కలు, మూడు గ్లాసుల నీళ్లు కలిపి ఉడికించుకోవాలి. తర్వాత వడకట్టుకోవాలి. ఒక గిన్నెలో వెన్న కరిగించి వడకట్టుకున్న బీట్‌రూట్ నీళ్లు పోయాలి. అవి మరుగుతున్నప్పుడు తగినంత ఉప్పు , మిరియాల పొడి వేసి కలపాలి. తర్వాత చిన్న గిన్నెలో కార్న్‌ప్లోర్ , కాసిన్ని నీళ్లు పోసి ఉండలు లేకుండా కలుపుకుని మరుగుతున్న నీళ్లలో వేసి ఉండలు కట్టకుండా కలుపుతూ ఉండాలి. ఇది చిక్కబడుతుండగా ఉడికించిన మాక్రోని వేసి మరి కొద్దిసేపు మరిగించి దింపేయాలి. కొత్తిమిర వేసి సర్వ్ చేయాలి. పిల్లలు చాలా ఇష్టపడతారు. కోడిగుడ్డు పొరుటు చేసి కూడా కలుపుకోవచ్చు.



బీట్‌రూట్ పప్పు

కావాల్సిన వస్తువులు: బీట్‌రూట్ ఆకులు : 1/2 కప్పు, కంది పప్పు : 1 కప్పు
పచ్చిమిర్చి : 2, కరివేపాకు: 2రెబ్బలు,
ఉల్లిపాయ: 1 చిన్నది
పసుపు: 1/4 టీ స్పూన్, కారంపొడి: 1/2 టీ స్పూన్, ఉప్పు: తగినంత,
చింతపండు పులుసు: 3 టేబుల్ స్పూన్లు, ఎండుమిర్చి: 2, పోపు దినుసులు: 1/4 టీ స్పూన్, వెల్లుల్లి రెబ్బలు: 4, ఇంగువ: చిటికెడు, నూనె: 2 టీస్పూన్, నెయ్యి: 1టీ స్పూన్

తయారీ విధానం: కందిపప్పులో కొద్దిగా నూనె, పసుపు వేసి మెత్తగా ఉడికించాలి. బీట్‌రూట్ ఆకులను కాడలతో సహా శుభ్రంగా కడిగి సన్నగా తరిగిపెట్టుకోవాలి. ప్యాన్‌లో చెంచాడు నూనె వేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి కొద్దిగా వేపి బీట్‌రూట్ తరుగు వేసి మరికొద్దిసేపు వేయించాలి. తర్వాత ఇందులో పసుపు, కారం వేసి కలిపి కప్పడు నీళ్లు పోయాలి. ఉడికిన కందిపప్పును మెత్తగా మెదపాలి. ఆకుకూర పూర్తిగా ఉడికిన తర్వాత చింతపండు పులుసు, పప్పు, తగినంత ఉప్పు వేసి కలిపి మరో ఐదు నిమిషాలు ఉడికించాలి. ఒక గరిట లేదా చిన్న గిన్నెలో నూనె, నెయ్యి కలిపి వేడి చేసి ఇంగువ వేయాలి. అది కరిగిన తర్వాత ఎండుమిర్చి, పోపు దినుసులు, కరివేపాకు వేయాలి. అవి చిటపటలాడుతుండగా వెల్లుల్లి రెబ్బలు కొద్దిగా నలగ్గొట్టి వేయాలి. అవి కాస్త ఎర్రబడగానే పప్పులో వేసి కలిపేయాలి. వేడిగా సర్వ్ చేస్తే అన్నం, చపాతీలకు కూడా ఎంతో రుచిగా ఉంటుంది. ఈ పప్పు. కావాలంటే కాస్త పలుచగా పులుసులా కూడా ఉంచుకోవచ్చు.



పాపడ్ సలాడ్

కావలసిన వస్తువులు:
బీట్‌రూట్ తురుము : 5 టీస్పూన్లు
కారట్ తురుము : 5 టీస్పూన్లు
పచ్చి కొబ్బరి తురుము : 5 టీస్పూన్లు
సన్నగా తరిగిన కాప్సికమ్ : 5 టీస్పూన్లు
వేయించిన అప్పడాలు చిన్నవి : 10
ఉప్పు: తగినంత
మిరియాల పొడి లేదా చాట్ మసాలా
కొత్తిమిర తరుగు : కొద్దిగా

తయారీ విధానం: చిన్న వేయించిన అప్పడాలు తీసుకోవాలి లేదా పెద్ద అప్పడాలను ముక్కలుగా చేసుకోవాలి. బీట్‌రూట్ తురుము, కారట్ తురుము, కొబ్బరి తురుము, కాప్సికమ్ ముక్కలు, ఉప్పు, మిరియాల పొడి లేదా చాట్ మసాలా వేసి బాగా కలిపి అప్పడాల ముక్కలు వేసి కలిపి సర్వ్ చేయాలి. లేదా చిన్న అప్పడాల మీద ఈ తురుములన్నీ ఒకదాని తర్వాత ఒకటి పెట్టి కొత్తిమిరతో అలంకరించి వెంటనే సర్వ్ చేయాలి. ఇష్టముంటే నిమ్మరసం పిండుకోవచ్చు.

అరిటాకులో ఆరోగ్యం

కొన్ని సంవత్సరాల క్రితం ఇంటికి అతిథులొస్తే..కింద పీటవేసి, అరటిఆకు వేసి భోజనం వడ్డించేవారు. మరి ఇప్పుడు...కింద కూర్చోవడం అన్నది చిన్నతనంగా భావిస్తున్నారు. అరటి ఆకు స్థానంలో స్టీలు లేదా ప్లాస్టిక్ ప్లేట్లు ఆక్రమించాయి. ఆధునికంగా కనిపించే వీటిల్లో భోజనం చేయడం సౌకర్యంగా అనిపించినా, ఆరోగ్యరీత్యా చూస్తే అరటి ఆకులో భోజనం చేయడమే మంచిది.



* అరటి ఆకులో తినడం వల్ల కిడ్నీ, బ్లాడర్ సమస్యలు కొంత వరకూ తగ్గుతాయి. ఇది శాస్త్రీయంగా రుజువు కాకపోయినా, అరటి ఆకులో ఉండే మెడికల్ వాల్యూస్ కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచడానికి దోహపడపడతాయి.
* పచ్చని అరటి ఆకులో తినడం వల్ల ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది. అలాగే మోదుగ ఆకులతో కుట్టిన విస్తరిలో భోజనం చేయడం వల్ల తెలివి తేటలు కొంత వరకూ వృద్ధి అయ్యే అవకాశం ఉంది.
* అరటి ఆకులో భోజనం చేయడం వల్ల పేగుల్లోని క్రిములు నాశనం అవుతాయి.
* శరీరంలోని టాక్సిన్స్‌ను చాలా వరకూ బయటకు పంపించే శక్తి అరటి ఆకులో ఉంది.
* ఈ ఆకులో భోజనం చేయడం వల్ల రక్తం శుద్ధి అవుతుంది. చర్మకాంతి మెరుగు అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి.
* ఈ ఆకు కఫవాతాలను తగ్గించడానికి సహాయపడుతుంది.

కిచెన్ టూల్స్

పొత్తులు ఇక సులభంగా...

మొక్కజొన్న పొత్తులు ఒలవడానికి చాలా సమయం పడుతుంది. అయితే ఆ పని సింపుల్‌గా చేసుకునేలా మార్కెట్‌లోకి కొత్త పరికరం వచ్చింది. అదే కార్న్ రిమూవర్. దీంట్లో స్టీలు బ్లేడ్లు ఉంటాయి. కార్న్ రిమూవర్‌తో మొక్కజొన్నకండె నుంచి గింజలను క్షణాల్లో తీయొచ్చు. ఇంటా, బయటా వాడడానికి కూడా ఇది ఎంతో వీలుగా ఉంటుంది. కార్న్ పీలర్, స్ట్రిప్పర్, కట్టర్, స్లైసర్, చాపర్‌గా పనిచేస్తుంది. దీని పైభాగాన్ని సులువుగా ఓపెన్ చేయొచ్చు. మొక్కజొన్న పొత్తులను సెకన్లలో సులువుగా ఒలిచేలా ఈ పరికరాన్ని డిజైన్ చేశారు. దీని వాడకం ఎంతో సులువుగా ఉంటుంది. ఇందులో ఉండే కంటైనర్‌ని కూడా బయటకు తీసి శుభ్రం చేసుకోవచ్చు. మొక్కజొన్నతో చేసుకునే వంటలకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుంది.





గార్లిక్ చాపర్

వెల్లుల్లిని ఒలిచి తరగాలంటే చిరాకుగా అనిపిస్తుంది. పొట్టు తీయడానికే సగం ఓపిక పోతుంది. ఆ తరువాత వాటిని తరగాలంటే విసుగ్గానే ఉంటుంది మరి. ఆ ఇబ్బంది లేకుండా ఉండాలంటే గార్లిక్ చాపర్ వాడాలి. గార్లిక్ చాపర్ లోపల ఒక ప్లాస్టిక్ బాల్ ఉంటుంది. అందులో వెల్లుల్లిని ఉంచాలి. చాపర్‌ను నేల మీద ఉంచి వేగంగా ముందుకి, వెనక్కి తిప్పాలి. దానికి చక్రాలు ఉంటాయి కాబట్టి అలా తిప్పడం కాస్త సరదాగా కూడా ఉంటుంది. వెల్లుల్లి పొట్టు ఊడిపోవడంతో పాటు, తరగడం కూడా పూర్తవుతుంది.

చిట్కాలు

* కాకర ఆకులు, నాలుగు వెల్లుల్లి రెబ్బలు, మూడు మిరియాల గింజలు, చిన్న బెల్లం ముక్క వేసి గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని రోజూ రెండు పూటలా వారం రోజులు తీసుకున్నా లేదా గ్లాసు పాలలో పంచదారకి బదులు బెల్లం వేసి రోజూ తాగినా నెలసరి సమస్యలు ఉండవు.
* స్టౌ మీద నేతితో కలిపిన బెల్లం వేడి చేసి, నొప్పి ఉన్న చోట పట్టు వేస్తే బాధ తగ్గుతుంది.
* పెరుగు, బెల్లం కలిపి రోజుకు రెండు పూటలా తీసుకుంటే ముక్కు కారడం సమస్య తగ్గుతుంది.
* బెల్లం నెయ్యి సమపాళ్లలో కలిపి తింటే మైగ్రేన్ తలనొప్పి వారం రోజులలో తగ్గుతుంది.



న్యాయమూర్తి అందుబాటులో లేరు

అయోధ్యపై నేటి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : అయోధ్య వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ మరోసారి వాయిదా పడింది. రాజకీయంగా అత్యంత సున్నితంగా మారిన రామజన్మ భూమి బాబ్రీ మసీదు భూ వివాదం జటిలం అయింది . ఈ కేసు ఈ నెల 29వ తేదీన మంగళవారం విచారణకు రావల్సి ఉంది. అయితే ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి ఆ రోజున అందుబాటులో ఉండరని , దీనితో 29వ తేదీ నాటి విచారణను వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఆదివారం ఒక ప్రజా సమాచార ప్రకటన వెలువరించాయి. అయోధ్య వ్యాజ్యం సమగ్ర సత్వర విచారణకు ఇటీవలే ధర్మాసనం పునర్వ్యస్థీకరణ జరిగింది. ధర్మాసనంలోకి కొత్తగా ఇద్దరు న్యాయమూర్తులను తీసుకున్నారు. అయితే ఇందులో జస్టిస్ ఎస్ఎ బోడ్బే ఆ రోజున అందుబాటులో ఉండటం లేదు. దీనితో విచారణ ప్రక్రియను ప్రస్తుతానికి వాయిదా వేశారు. ఐదుగురు సభ్యుల ధర్మాసనమే ఈ కేసును విచారించాల్సి ఉన్నందున, వాయిదా వేయాల్సి వచ్చిందని, దీనిని అన్ని పక్షాలూ గుర్తించాలని సుప్రీంకోర్టు ప్రకటనలో తెలిపారు. జస్టిస్ యుయు లలిత్ ఈ కేసు విచారణ నుంచి విరమించుకుంటున్నట్లు తెలియచేయడంతో రెండు రోజుల క్రితమే ఈ ధర్మాసనం పునర్వ్యస్థీకరణ జరిగింది. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, ఎస్ఎ బోబ్డే, డివై చంద్రచూడ్, అశోక్ భూషణ్, ఎస్ఎ నజీర్‌లు సభ్యులుగా ఉంటారు. అయోధ్య కేసుకు సంబంధించి పలు పిటిషన్లు పెండింగ్‌లో సుదీర్ఘకాలంగా ఉన్నాయి. 2010 నాటి అలహాబాద్ హైకోర్టును సవాలు చేస్తూ ఇవి పోటాపోటీగా దాఖలు అయ్యాయి. నాలుగు సివిల్ దావాల క్రమంలో అలహాబాద్ హైకోర్టు వెలువరించిన తీర్పు కీలకంగా మారింది. అయోధ్యలోని ఈ వివాదాస్పద ప్రాంతపు 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహీ అకారా, రామ్ లల్లా మధ్య సమానంగా పంచాలని ఈ తీర్పులో వెల్లడించారు.

సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ సేవలు ఉత్తమం



మన తెలంగాణ/హైదరాబాద్: ములుగులోని పండ్లపై ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉద్యాన వర్సిటీకి అనుబంధంగా ఉంటూ అత్యుత్తమ సేవలు అందజేస్తుందని వ్యవసాయ ఉద్యాన ముఖ్య కార్యదర్శి సి.పార్థసారధి అన్నారు. ఆదివారం ఆయన ములుగును సందర్శించి విద్యార్థులు రూపొందించిన ఆర్నమెంటల్ గార్డెన్ ప్రాజెక్టును ఆమోదించి శంకుస్థాపన చేశారు. వర్సిటీకి ఆనుకొని ఉన్న 50 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ రైతులకు ఎంతో సేవలు చేస్తుందన్నారు. ములుగులో ఏర్పాటు చేయబోయే ఉద్యాన విశ్వవిద్యాలయంలో సోలార్ పవర్ వంటి వాటికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యాన వర్సిటీలోనూ, కళాశాలల్లోనూ రోడ్లు, హాస్టళ్లు, తరగతి గదులు, పరిశోధనకు అవసరమైన ప్రయోగశాలలను మార్చి 31వ తేదీ నాటికి పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. హరియాణలోని సోనేపట్‌లో ఉన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెం)ను ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు సందర్శించాలని ఆయన ఆదేశించారు. అక్కడి పరిశోధన, ప్రమాణాలపై అధ్యయనం చేయాలన్నారు. జాతీయ అంతర్జాతీయ సదస్సులు ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉద్యాన వర్సిటిలో ఆడిటోరియం నిర్మించాలని ఆదేశించారు.


ఎంఎల్‌సి ఖాళీలకు మార్చిలోనే ఎన్నికలు?

(మొదటిపేజీ తరువాయి)

ఏప్రిల్ చివరలో మే మొదటి వారంలో జరిగే అవకాశం ఉన్నందున అంత కంటే ముందే మార్చిలోనే వీటికి ఎన్నిక పూర్తి చేసేందుకు కసరత్తును మొదలుపెట్టింది. ఇటీవల అనర్హత వేటు పడిన ముగ్గురు ఎంఎల్‌సి ఖాళీ స్థానాలపై కూడా సిఇఒ రజత్ కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. ఎన్నికపై తదుపరి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీంతో ప్రస్తుతం 7 స్థానాలు ఖాళీ కాగా మార్చి నెలాఖరుకు 8, మే ఒకటికి మరొక స్థానం ఖాళీ కానుంది. వీటిలో 15 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. గవర్నర్ కోటాలో మరో స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది. వివరాల్లోకి వెళితే ముగ్గురు ఎంఎల్‌సిలు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి ఎంఎల్ఎలుగా గెలుపొందారు. ఇందులో పట్నం నరేందర్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు. వీరు వారి ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇక కొండా మురళీ తన ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేయగా, మరో ముగ్గురు భూపతి రెడ్డి, యాదవరెడ్డి, రాములు నాయక్‌లపై టిఆర్ఎస్ ఫిర్యాదు మేరకు మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అనర్హులుగా ప్రకటించారు. ఈ ఖాళీల జాబితా ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘానికి అందింది. అలాగే ఎంఎల్ఎ కోటాలో కొనసాగుతున్న పొంగులేటి సుధాకర్ రెడ్డి, షబ్బీర్ అలీ, మహమూద్ అలీ, జె. సంతోష్ కుమార్, మహ్మద్ సలీం, టీచర్స్ కోటాలో పాతూరి సుధాకర్ రెడ్డి, పూలరవీందర్, గ్రాడ్యుయేట్స్ కోటాలో కె.స్వామి గౌడ్‌ల పదవి కాలం మార్చి 29వ తేదీ నాటికి ముగియనుంది. స్థానిక సంస్థల కోటాలో ఎం.ఎస్ ప్రభాకర్ పదవికాలం మే 1వ తేదీతో ముగియనుంది. ఉపాధ్యాయుల, పట్టభద్రుల నియోజకవర్గాలకు చెందిన తుది ఓటర్ల జాబితా ఫిబ్రవరి 20న ప్రకటించనుంది. ఇసి ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని సిఇఒ అధికార వర్గాలు వెల్లడించాయి.

తెలుగు సంస్కృతి బతికున్నంతకాలం ఎన్‌టిఆర్ సజీవం

బయోపిక్ పుస్తకావిష్కరణలో అశోక్ గజపతి రాజు



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలుగు భాష, సంస్కృతి బతికున్నంత కాలం మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ ప్రజల గుండెల్లో బతికే ఉంటారని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. సినీ, రాజకీయ రంగాల మొదలు ఏ రంగంలో ఆయన అడుగు పెట్టినా అన్నింటా విజయం ఆయన సొంతమని, ఆయనకు మాత్రమే ఇది సాధ్యమని అన్నారు. చంద్రహాస్, లక్ష్మీ నారాయణ అనే ఇద్దరు రచయితలు రెండున్నరేళ్ళ పాటు కష్టపడి ఆంగ్లంలో 'ఎన్‌టిఆర్ బయోపిక్' అనే పేరుతో పుస్తకాన్ని రచించారని, దాన్ని తాను ఆవిష్కరించడం గర్వంగా ఉందన్నారు. నగరంలోని హైటెక్స్‌లో ఆదివారం రాత్రి ఆ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా గజపతిరాజు ప్రసంగిస్తూ, రాజకీయంగా ఎన్నో విషయాలను ఎన్‌టిఆర్ నుంచి తాను నేర్చుకున్నానని గుర్తుచేశారు. ఒక రాజకీయ నాయకుడిగా జయప్రకాశ్ నారాయణ తర్వాత రాజకీయాల్లో బిజెపి సహా అనేక రాజకీయ విపక్షాలను ఒక్క తాటిపైకి తీసుకొచ్చిన ఘనత ఎన్‌టిఆర్‌దేనన్నారు. ఎన్‌టిఆర్ పుస్తకాన్ని ఆవిష్కరించే విషయాన్ని చెప్పినప్పుడు ఎలాంటి విషయాలను పుస్తక రచయితలు ప్రస్తావిస్తారో, వాటి గురించి తాను ఏ విధంగా స్పందించాలో అనే ఒక మానసికమైన ఉత్కంఠ తనలో ఉందని అన్నారు. సినిమా, రాజకీయ రంగాల్లో స్వంత శక్తితో ఎదిగిన గొప్ప వ్యక్తి ఎన్‌టిఆర్ అని పేర్కొన్నారు. పుస్తక రచయిత చంద్రహాస్ ప్రసంగిస్తూ, ఎన్‌టిఆర్ గురించి ఆలోచన చేస్తే సినిమా, రాజకీయ రంగాల్లో ఏ సమయంలో ఏ పనిని ఎందుకు చేశారో, ముఖ్యమంత్రిగా ఏ సమయంలో ఎలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఆలోచనకే అందదని అన్నారు.

నేటి నుంచి వినియోగదారుల ఫిర్యాదులపై విచారణ

నగరంలో ప్రత్యేకంగా సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు

చేరుకున్న జాతీయ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్.కె.అగర్వాల్

భేటీ అయిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్



నగరానికి చేరుకున్న జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఛైర్మన్ అగర్వాల్‌తో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కమిషనర్ అకున్ సబర్వాల్

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి వినియోగదారుల కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, అప్పీళ్ళు, రివిజన్ పిటిషన్‌లపై జాతీయ వినియోగుదారుల వివాదాల పరిష్కార కమిషన్ సోమవారం నుంచి విచారణ చేపట్టనుంది. ఇందుకోసం నగరంలో ప్రత్యేకంగా సర్క్యూట్ బెంచ్ ఏర్పాటైంది. వచ్చే నెల 8వ తేదీ వరకు ఇది పనిచేస్తుందని, సత్వర పరిష్కారం కనుగొనే దిశగా జాతీయ, రాష్ట్ర కమిషన్‌లు చొరవ తీసుకోనున్నాయి. దాదాపు పది రోజుల పాటు ఇక్కడే ఉండేలా ఆదివారమే నగరానికి చేరుకున్న జాతీయ వినియోగుదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్‌కె అగర్వాల్‌ను తెలంగాణ వినియోగుదారుల వ్యవహారాల కార్యదర్శి అ కున్ సబర్వాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిరువు రూ ఆయా జిల్లాల వినియోగదారుల ఫోరంలను బలోపేతం చేయడంపై ఆయా జిల్లాల ఫోరం అధ్యక్షులు, స భ్యులతో సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎంఎస్‌కె జైస్వాల్ పాల్గొన్నారు.

ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సర్క్యూట్ బెంచ్‌లో వినియోగదారుల భద్రతా చట్టం, 1986 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను చేపట్టనుంది. జాతీయ వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్‌కె అగర్వాల్, సభ్యురా లు ఎం శిరీష నేతృత్వంలో ఏర్పాటయ్యే సర్క్యూట్ బెంచ్ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కేసుల విచారణను చేపట్టనుంది. వినియోగదారుల ఫిర్యాదుల కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల క మిషన్‌లో దాదాపు 2685 కేసులు పెండింగ్‌లో ఉన్నా యి. ఫిర్యాదుదారుల సహకారంతో వీలైనంత ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులను ఈ పది రోజుల విచారణలో పరిష్కారం చేయాలని కేంద్ర, రాష్ట్ర కమిషన్‌లు భావిస్తున్నాయి. ఫిబ్రవరి 8వ తేదీ లోపు కోటి రూపాయలు, అంతకు పైబడిన విలువ కలిగిన ఫిర్యాదులను కూడా వినియోగుదారులు ఈ సర్క్యూట్ బెంచ్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, వినియోగదారుల హక్కుల కమిషన్‌లు తెలిపాయి. ఈ రెండు రాష్ట్రాలకు సంబంధించి కొత్తగా అప్పీళ్ళుగానీ, రివిజన్ పిటిషన్లుగానీ ఉన్నట్లయితే ఈ పది రోజుల వ్యవధిలో నేరుగానే దాఖలు చేసుకోవచ్చని తెలిపాయి.

ఆర్థిక నేరాలపై డిజిపి సీరియస్

దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశాలు

మన తెలంగాణ/హైదరాబాద్: నగరంలో వరుసగా ఆర్థిక నేరాలు చోటుచేసుకోవడంపట్ల డిజిపి మహేందర్‌రెడ్డి సీరియస్ అయ్యారు. పల్లీ యంత్రాలు, క్యూనెట్, విజ్డం తదితర ఆర్థిక నేరాలపై దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భారీ ఎత్తున ఆర్థిక నేరాల విషయంలో బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఆర్థిక నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంలో చొరవ తీసుకోవాలన్నారు. ప్రలోభాలకు లోనయ్యేవారిని టార్గెట్ చేసుకుని మల్టీలెవల్ కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయని, ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చిన పల్లీ యంత్రాలు, క్యూనెట్, విజ్డం, మల్టీలెవల్ మార్కెటింగ్, హీరాగోల్డ్ ఫైనాన్స్, మనీ సర్క్యూలేషన్, కరక్కాయ, మునక్కాయ, ఆన్‌లైన్ వ్యాపారం తదితరాలన్నీ ఈ కోవకు చెందినవేనన్నారు. పల్లీకాయల యంత్రం పేరిట మహిళలను, క్యూనెట్ పేరిట నిరుద్యోగులను ట్రాప్ చేసి చైన్ సిస్టమ్ ద్వారా ప్రైజ్ మనీ, కమీషన్లు వస్తాయని నమ్మించి కోట్లాది రూపాయలు మోసం చేసిన కేసులను పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులకు డిజిపి స్పష్టం చేశారు. కొద్ది మంది పోలీసు అధికారులతో ఆదివారం సమావేశమైన సందర్భంగా పై ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. నిరుద్యోగులు, నిరక్షరాస్యులకు డబ్బు ఆశ చూపి సులభంగా డబ్బు సంపాదించవచ్చని, ఎఫ్‌ఎంఎల్‌సీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని, సభ్యులను చేర్పిస్తే కమీషన్ వస్తుందని ఆశపెట్టి పెద్ద ఎత్తున దోచుకుంటున్నారని పోలీసు అధికారులు ఈ సందర్భంగా డిజిపికి వివరించారు.

బాబోయ్ నురగ

(మొదటిపేజీ తరువాయి)

యాంటీ ఫోమ్ ఏజెంట్‌లను వినియోగించి నియంత్రించారు. మరికొన్ని చోట్ల నానో పార్టికల్స్‌ను చల్లుతున్నారు. హైదరాబాద్‌లో మాత్రమే కాక పలు మెట్రోపాలిటన్ నగరాల్లోనూ నురగ సమస్య ఉందని పర్యావరణవేత్తలు గతంలో జరిగిన ఓ సదస్సులో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ (నీరి) రెండు సంవత్సరాల పాటు నగరంలోని పలు చెరువులతో పాటు మూసీ కాల్వలోని కాలుష్యంపైనా, బెంగుళూరు, ఢిల్లీ లాంటి నగరాల్లోని నురగపైనా అధ్యయనం చేసింది.

గ్రేటర్ పరిధిలో సుమారు 185 చెరువులు :

పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను చెరువుల్లోకి వదలకుండా అరికట్టడమే తక్షణ నివారణ మార్గమని, వరద నీటిని ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకిపోయే విధంగా చర్యలు చేపట్టాలని నీరి సంస్థ తన అధ్యయనంలో పేర్కొంది. నీరి సంస్థ చేసిన అభిప్రాయంతో పలువురు నిపుణులు ఏకీభవించారు. గ్రేటర్ పరిధిలో సుమారు 185 చెరువులు ఉండగా, అందులో చాలా చెరువులు వ్యర్థాలతో నిండిపోయాయి. ఈ వ్యర్థాల మూలంగా వెల్లువెత్తుతున్న నురగ కొన్ని చెరువుల్లో ప్రమాదకర స్థాయికి చేరిందని 'నీరి' తన అధ్యయనంలో తేల్చింది. నగరంలోని ఇబ్రహీం చెరువు, ఆర్‌కె పురం చెరువు, హస్మత్‌పేట, నల్లచెరువు, కూకట్‌పల్లి చెరువుల నుంచి వ్యర్థాలకు సంబంధించిన నురగలు ఎక్కువగా వస్తున్నట్టు ఈ అధ్యయనం తేల్చింది. ఈ నురగలను నిర్లక్ష్యం చేస్తే బెంగళూరులోని బెలందూర్ లేక్ తరహాలో పొంగి రోడ్లపైకి, ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని నీరి సంస్థ హెచ్చరిస్తోంది. అత్యంత ప్రమాదకరమైన నురగ వల్ల బెలందూర్ ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. విషపూరితమైన రసాయనాలతో కూడిన నురగ పొగలు కక్కుతూ ఇళ్లలోకి ప్రవహించిందని, దీనివలన చర్మవ్యాధులతో పాటు తలనొప్పి, దద్దుర్లు వంటి సమస్యలు తలెత్తాయని 'నీరి' పేర్కొంది. రోడ్లపైన నురగ కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం తలెత్తినట్టు తెలిపింది. వర్షం వచ్చినప్పుడు పోటెత్తే వరదనీటితో పాటు మురుగునీరు వ్యర్థాలు చెరువుల్లో పెద్ద ఎత్తున వచ్చి చేరుతున్నట్టు కూడా 'నీరి' తన అధ్యయనంలో గుర్తించింది. అలాంటి ముప్పే నగరంలోని చెరువుల వల్ల తలెత్తవచ్చని 'నీరి' పేర్కొంది. నురుగను నివారించేందుకు చేపట్టవలసిన చర్యలపై పలు రకాలుగా అధ్యయనం చేయాలని నీరి ఇనిస్టిట్యూట్ నిర్ణయించింది.

మిషన్ 16 ఎంఎల్‌ఎలదే బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

శ్రమించాలని అధినాయకత్వం సంకేతాలు ఇచ్చింది. హైదరాబాద్‌లో టిఆర్ఎస్ మిత్రపక్షం ఎంఐఎం మినహా మిగతా పార్లమెంట్ స్థానాలన్నిటిలో గులాబి జెండా ఎగరవేసేందుకు పార్టీనాయకత్వం ప్రయత్నాలను ప్రారంభించింది. అనేక సర్వేలు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్ 16 స్థానాలను సంపాదిస్తుందని వెల్లడిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో టిఆర్ఎస్ భారీ మెజారిటీ సాధించలేకపోయింది.

ఈ రెండు నియోజకవర్గాల్లోను భారీమెజారిటీ కోసం కృషిచేయాలని పార్టీ ఆలోచిస్తుంది. అయితే ఖచ్చితంగా 16 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించడం కాదు భారీమెజారిటే లక్ష్యంగా కార్యకర్తలు కృషిచేయాలని కార్యకర్తలను తీర్చిదిద్దుతుంది. పంచాయితీ ఎన్నికల్లో గులాబీదళం విజయాలను సాధిస్తుండటంతో టిఆర్ఎస్‌కు ప్రజల్లో చెక్కుచెదరని విశ్వాసం ఉందనీ, అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయనే నమ్మకం టిఆర్ఎస్ లో కలిగింది. దాదాపుగా మరో రెండునెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలను కైవసం చేసుకునే అవకాశాలు పార్టీకి అధికంగా ఉన్నాయనీ ఆతర్వాత ఏప్రిల్ లేదా మేనెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్ కు సంపూర్ణ విజయం చేకూరుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో యుపిఎ, ఎన్‌డిఎ కూటమిలకు ప్రభుత్వం ఏర్పాటు చేసే మెజారిటీ రాదనీ ప్రాంతీయపార్టీలకే ప్రాముఖ్యతపెరుగుతుందని టిఆర్ఎస్ అనేక సమావేశాల్లో కార్యకర్తలకు ఉద్ఘాటించింది.

ఈనేపథ్యంలో 16 పార్లమెంట్ స్థానాలను సాధిస్తే కేంద్రంలో శాసించేస్థాయికి టిఆర్ఎస్ ఎదిగి తెలంగాణాభివృద్ధికి అధిక నిధులు సాధించే అవకాశాలున్నాయని టిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సంకేతాలు ఇచ్చింది. ఈనేపథ్యంలో జిల్లాలవారిగా పార్లమెంట్ సభ్యులను గెలిపించే బాధ్యతలను శాసనసభ్యులు తీసుకుని క్షేత్రస్థాయిలోని కార్యకర్తలందరిని కదిలించాలని ఇచ్చిన సంకేతాలు పార్టీవిజయానికి మరింత ప్రోత్సాహకరంగా ఉన్నాయని నాయకులు చెప్పారు.

కన్నీటి వాన



(మొదటిపేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలతో ఈసారి పంట ఉత్పత్తి కూడా భారీగానే వచ్చింది. క్వింటాకు రూ. 10 వేల వరకు మార్కెట్‌లో ధర ఉంది. కొంత నష్టమైన పెట్టుబడి వచ్చే పరిస్థితి ఉండేనని, ఇప్పుడు వర్షంతో మొత్తం నష్టపోయామని పేర్కొంటున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షం ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

మిర్చి పంటతో పాటు పత్తి, మొక్కజొన్న పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది.

పెట్టుబడి నీటిపాలు

24 వేల ఎకరాల మిర్చి సాగుకు ఎకరాకు రూ.30 వేలకు పైగా రైతులు పెట్టుబడి పెట్టారు. అకాల వర్షంతో ఇప్పుడు పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. ఎక్కువ మొత్తం 5 నుండి 10 ఎకరాలు సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొంతమంది కౌలురైతులు అప్పులు చేసి పంట సాగు చేశారు. వారి పరిస్థితి దయనీయంగా మారింది. పంటల బీమా పథకం వర్తింపచేస్తున్నట్లు అధికారులు చెపుతున్నా క్షేత్రస్థాయిలో అమలులో లోపాలున్నాయి.

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో పామిరెడ్డిపల్లి,వీరాయపల్లి, దొడగుంటపల్లి తదితర గ్రామాల్లో రైతులు వందల ఎకరాల్లో వేరుశనగ పంటను సాగుచేశారు. పంటలు చేతికొచ్చిన తర్వాత నేడోరేపో మార్కెట్‌కు తీసుకెళ్దామనుకున్న రైతులకు అకాల వర్షం తీవ్ర నష్టాలపాలు చేసింది. శనివారం,ఆదివారం కురిసిన వర్షాలకు వందల ఎకరాల్లో వేరుశనగ పంట నష్టపోయింది. పొలాల్లో ఉన్న వేరుశనగ కుప్పలు భారీగా తడిసి పోవడంతో వేరుశనగ ధాన్యం మొలకలు వచ్చాయి. పామిరెడ్డిపల్లి, వీరాయపల్లి గ్రామాల్లోని రైతులను ఈ వర్షాలు భారీగా నష్టా న్ని మిగిల్చాయి. మండలంలోని దొడగుంటపల్లి, చిన్నమందడి,మనిగిళ్ల, మోజర్ల,మద్దిగట్ల, అ మ్మపల్లి, అల్వాల గ్రామాల్లో కూడా వేరుశనగ పంట లు భారీగా దెబ్బతిన్నాయి. మండలంలో 70ఎకరాల్లో వేరుశనగ పంటకు నష్టం వాటిల్లినట్లు తమ దృష్టికి వచ్చిందాని సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తామని మండల వ్యవసాయ అధికారి మలయ్య యాదవ్ తెలిపారు.

రాహుల్‌లో ప్రధాని అయ్యే లక్షణాలున్నాయి

ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్



పాట్నా: ప్రధానమంత్రి పదవిని చేపట్టడానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అర్హుడని, ఆయనలో ఇందుకు కావాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ అన్నారు. అయితే, ప్రతిపక్షాల నుంచి ఈ పదవిని ఎవరు చేపడతారన్న విషయంపై ఎన్నికల తర్వాతే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆదివారం ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... 'రాహుల్ గాంధీ నాయకత్వ లక్షణాలపై ఎటువంటి అనుమానాలు అవసరం లేదు. ఆయనకు వ్యతిరేకంగా కొందరు పెద్ద ఎత్తున ప్రచారం చేసినప్పటికీ, తనలోని పట్టుదల, విశాల హృదయం వల్ల ఆయన ప్రజల ఆదరాభిమానాల్ని పొందారు. ఆయన నాయకత్వంలో ఇటీవల రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఈ విజయాలతో ఆయన తమ పార్టీ నేతల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు' అని వ్యాఖ్యానించారు. 'ఓ గొప్ప ప్రధాని కావడానికి గల అన్ని లక్షణాలు ఆయనలో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఆయన అధ్యక్షుడు. 15 ఏళ్లుగా ఎంపిగా ఉన్నారు. ఆయన పార్టీ ఐదు రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఆయన నాయకత్వ లక్షణాలను ప్రశ్నించే అవకాశం లేదు' అని తేజస్వీ యాదవ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ తీర్పని, ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించాలని మనం కోరుకోమని, ఇటువంటి సంస్కృతి మనకువద్దని ఆయన భాజపాను ఉద్దేశిస్తూ విమర్శలు చేశారు. భాజపాను ఓడించేందుకు తాను పని చేస్తానని తెలిపారు. 'ఎన్నికలు ముగియగానే మహాకూటమి నేతలు చర్చలు జరుపుతారు. ప్రధానమంత్రి అభ్యర్థిత్వంపై తొందరేమీ లేదు. 2004 లోక్‌సభ ఎన్నికల ముందు మన్మోహన్ సింగ్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించలేదు. ఆయన ప్రధాని అయిన తర్వాత దేశంలో ప్రభుత్వాన్ని పదేళ్లపాటు సమర్థంగా నడిపించారు' అని తేజస్వీ వ్యాఖ్యానించారు. 2004 ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను ఏకం చేయడానికి తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ పోషించిన పాత్రను ఇప్పుడు మీరు పోషిస్తారా? అని ఆయనను ప్రశ్నించగా... 'ప్రస్తుతం రాజకీయాల్లో నేను నేర్చుకునే స్థాయిలోనే ఉన్నాను. ఓ నాయకుడికి కాదు' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతలపై బిజెపి తప్పుడు కేసులు పెడుతోందని, అయినప్పటికీ తాము భయపడబోమని ఆయన అన్నారు. కాగా, ఇటీవల డీఎంకే అధినేత స్టాలిన్.. ఓ సమావేశంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీయే తదుపరి ప్రధాని అంటూ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీంతో తొందరపాటు ప్రకటన అంటూ ఆయనపై కొందరి నుంచి విమర్శలు వచ్చినప్పటికీ, ఆయన తన మాటపై ఇప్పటికీ కట్టుబడే ఉన్నానని పలుసార్లు పునరుద్ఘాటించారు.

13 నుంచి కృష్ణా జలాల ట్రిబునల్ విచారణ

(మొదటిపేజీ తరువాయి)



క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా తెలంగాణ తరపు సాక్షి పళనిస్వామిని ఎపి తరపు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. గత విచారణలో తెలంగాణ తరపు న్యాయవాదులు ఎపి తరపు సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. ఈ ప్రక్రియ పూర్తికావడంతో ఎపి తరపు న్యాయవాదులు తెలంగాణ తరపు సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసేందుకు ట్రిబ్యునల్ అంగీకరించింది. జనవరి 29 నుంచి మూడు రోజుల పాటు విచారణ జరగాల్సి ఉన్నా వివిధ కారణాలతో వాయిదాపడింది. అంతకు ముందు జనవరి 9 నుంచి మూడు రోజుల పాటు జరగాల్సి ఉన్నప్పటికీ వేర్వేరు కారణాలతో వాయిదా పడింది. జస్టిస్ బ్రిజేష్ కుమార్ సతీమణి శశి శ్రీవాస్తవ ఈ నెల 17న డిల్లీలో మరణించడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున నదీ జలాల అంతర్రాష్ట్ర వ్యవహారాల విభాగం చీఫ్ ఇంజనీర్ నర్సింహారావు ఈ నెల 19న డిల్లీకి వెళ్లి ఆమె మృతికి సంతాపాన్ని ప్రకటించి, నివాళులు అర్పించారు.

పల్లె రోడ్లపై నజర్

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణంతో పాటు నిర్వహణ విషయంలోనూ ఆ శాఖ అధికారులు దృష్టి పెడుతున్నారు. రహదారుల నిర్మాణం కోసం నిధుల కొరత లేదని స్వయంగా సిఎం స్పష్టం చేయడంతో రంగంలోకి దిగిన ఇంజనీరింగ్ అధికారులు రహదారుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. రహదారుల నిర్మాణానికి వేసవి కాలమే అనుకూలం కావడంతో అప్పటికల్లా అన్ని గ్రామాల్లో రహదారులను సిద్దం చేసే దిశగా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు రూ.12 వేల కోట్లను కేటాయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం కోసం త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో మరింత పెద్దఎత్తున నిధులను కేటాయించే అవకాశం ఉంది. గ్రామాల్లోని మట్టి రోడ్లు త్వరలో బిటి రోడ్లుగా రూపు దిద్దుకోనున్నాయి. రోడ్ల నిర్మాణంతో పాటే ఇరవైపులా మొక్కలను పెంచే కార్యక్రమాన్ని కూడా ఆ శాఖ అధికారులు ప్రణాళికలోనే పొందుపర్చనున్నారు.



కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసింది

నేతాజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి : నాదెండ్ల


మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : దేశం కోం వీరోచిత పోరాటం చేసిన నేతాజీ సుభాస్ చంద్రబోస్‌కి కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు అన్నారు. ఆంగ్లేయుల అరాచక పాలనను తుదముట్టించేందుకు నేతాజీ తన ఉద్యోగాన్ని వదిలేసి ఉద్యమ బాట పట్టారని శ్లాఘించారు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఆల్ ఇండియా జైహింద్ పార్టీ అధ్వర్యంలో నేతాజీ 122వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జై హింద్ పార్టీ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన నాదెండ్లతో పాటు ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్‌లు సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన అంతం చేయాలంటే వారికి వ్యతిరేకులైన రష్యా, జర్మనీ, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల్లో పర్యటిస్తూ వారి మద్దతు కూడగట్టిన వీరుడు నేతాజీ అని కొనియాడారు. జై హింద్ నినాదాన్ని దేశానికి అందించిన వ్యక్తి నేతాజీ అని అన్నారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన నేతాజీ సుభాస్ చంద్రబోస్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలడుగు పోతురాజు, ఆవుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి



మన తెలంగాణ/జమ్మికుంట : జమ్మికుంట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అప్పాల షణ్ముఖ (7) అనే బాలుడు పాముకాటుతో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామానికి చెందిన అప్పాల రజిత, సాగర్‌లకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు అయిన షణ్ముఖ చారి శనివారం ఇంట్లో ఆడుకుంటూ ఉండగా ఇంట్లోని బీరువా క్రింద ఉన్న నాగుపాము కాటు వేయడంతో గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించగా పరిస్థితి విషమంగా ఉందని వరంగల్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని డాక్టర్లు సూచించడంతో వరంగల్ జిల్లాలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వారు తెలిపారు. షణ్ముఖ చారిమృతితో అతని కుటుంబ సభ్యులు రోదనలతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.

పెగడపల్లిలో జింక కొమ్ముల పట్టివేత



మన తెలంగాణ/కాల్వశ్రీరాంపూర్ : పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంకు చెందిన పిక్కల కుమార్ ఇంటి వద్ద ఆదివారం జింక కొమ్ములను పోలీసులు పట్టుకొన్నట్లు ఎస్ఐ షేక్ మస్తాన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పిక్కల కుమార్ ఇంట్లో జింక కొమ్ములు ఉన్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. అటవీ ప్రాంతం నుంచి వన్య ప్రాణుల మాంసంను తెచ్చి విక్రయిస్తు సొమ్ము చేసుకొంటున్నారన్న ఫిర్యాదుపై గ్రామంలో విచారణ చేయగా, పెగడపల్లికి చెందిన పిక్కల కుమార్ ఇంట్లో జింక కొమ్ములున్నాయని తెలుసుకొన్న పోలీసులు సోదాలు చేసి పట్టుకొన్నారు. ఈ మేరకు నింధితుడు పిక్కల కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తొర్రూరు ఎంపిడిఓ సస్పెన్షన్



మనతెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి : గ్రామ పంచాయితీ ఎన్నిక ల్లో నిర్వహించాల్సిన విధుల్లో నిర్లక్ష్యం చేయడం పట్ల మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎంపిడిఓ జి. బాబును సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమీషన్ నుండి సెక్రటరి ఎం.అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండో విడత జరిగిన తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఎన్నికల నిర్వహణలో అశ్రద్ధ చేయడంతో జిల్లా ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు, ఆటంకం కలిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు సూచించిన మేరకు ఎంపిడిఓను సస్పెండ్ చేస్తూ ఎన్నికల కమీషన్ నుండి ఎల్ఆర్ నెం.187/టిఎస్ఇసిపిఆర్/201916 ఉత్తర్వులు జారీచేశారు.

విగ్రహాల ధ్వంసం హేయమైన చర్య



మన తెలంగాణ/కీసర : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, స్వాతంత్ర్య సమరయోదుడు చంద్రశేఖర్ ఆజాద్‌ల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు పెద్ద ధర్నా చేపట్టి ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కీసర మండలం రాంపల్లిలో ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై గ్రామస్థులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైటాయించి ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. జరిగిన ఘటనపై తీవ్రంగా ఖండించారు. దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఆదేశాలను జారి చేశారు. కాగా కీసర ఇన్స్‌ఫెక్టర్ ప్రకాశ్ కథనం ప్రకారం రాంపల్లి గ్రామానికి చెందిన చంద్యానాయక్ ఎన్ఎఫ్‌సి కంపెనీలో రిటైర్డ్ ఉద్యోగని, గత శనివారం మధ్యహ్నం విగ్రహాలను రాయితో ధ్వంసం చేశారు. ఇతడు మతిస్థిమితం లేదని, అప్పుడప్పుడు ఆ విగ్రహాలో మాట్లాడేవాడని ఆయన తెలిపారు. విగ్రహాలను ధ్వంసం చేయడం హేయమైన చర్య కాబట్టి నేరంగా పరిగణిస్తు నిందితున్ని పై 427, 153ఏ ప్రకారం కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

విగ్రహాలను తిరిగి నిర్మిస్తాం : ఎమ్మెల్యే

రాంపల్లి ప్రధాన కూడలిలో ధ్వంసం చేసిన అంబేద్కర్, చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహాలను పునర్ నిర్మిస్తామని ఎమ్మెల్యే మల్లారెడ్డి హామీ ఇచ్చారు. విగ్రహాల పనుల నిర్మాణంకు స్వీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుజాత, తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ కౌకుంట్ల చంద్రారెడ్డి, నాయకులు మచ్చ శ్రీనివాస్‌గౌడ్, గండి అంజయ్యగౌడ్, మాజీ సర్పంచ్ అరిగె రాములు, వి. పెంటయ్యగౌడ్, నీరుడు వాసు, మాజీ జడ్పిటిసి సభ్యుడు సురేశ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను నిర్వహించ లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం పాఠశాలలకు విడుదల కావల్సిన నిర్వహణ నిధులు మరో రెండు నెలల్లో విద్యాసంవత్సరం ముగుస్తున్నా విడుదల చేయలేదు. పాఠశాలల్లో చాక్‌పీస్ కొనాలన్నా ఆర్థిక పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు అన్ని బాలారిష్టాలను దాటుకుని సమర్థవంతంగా పని చేస్తోన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నిధుల విడుదల సమస్యగా మారింది. ప్రైవేటకు దీటుగా విద్యా బోధన అందిస్తున్నా వారికి సరైన గౌరవం దక్కడం లేదు. పాఠశాలలకు నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోంది. వెయ్యి, అంతకు పైగా విద్యార్థులున్న పాఠశాలల్ని, 200 మంది విద్యార్థులున్న వాటిని ఒకే రకంగా చూస్తున్నారు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతి చమురు వదుల్తోంది. విద్యాసంవత్సరం ఆరంభమై 9 నెలలు గడుస్తున్నా పాఠశాలలకు నిధులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మన తెలంగాణ అందిస్తోన్న ప్రత్యేక కథనం..

అత్తెసరు నిధులు..
అవీ ఇవ్వరు!



- కష్టతరంగా మారిన పాఠశాలల నిర్వహణ
- సర్కారు పాఠశాలల్లో మునుపటికంటే రెట్టింపైన నిర్వాహణ వ్యయం
- అవస్థలు పడుతున్న ప్రధానోపాధ్యాయులు

మన తెలంగాణ/మెదక్/పెద్దశంకరంపేట : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ భారంగా మారింది. ప్రతి సంవత్సరం పాఠశాలలు ఆరంభమైన నెలరోజుల్లో పాఠశాలలకు విడుదల చేసే నిర్వహణ గ్రాంటు, పాఠశాల గ్రాంటులను ఆయా పాఠశాల యాజమాన్య కమిటీల అకౌంట్‌లో ప్రభుత్వం జమ చేయడం ఆనవాయితీగా వస్తోంది. పాఠశాల స్థాయిని బట్టి, విద్యార్థులు, గదుల సంఖ్యను బట్టి నిర్వహణ గ్రాంటు మారుతుంటుంది. స్కూలు గ్రాంట్ మాత్రం ఒకే విధంగా ఉంటుంది. ప్రతి పాఠశాలకు సంవత్సరానికి స్కూలు గ్రాంటు కింద రూ. 5 వేలు చెల్లిస్తున్నారు. నిర్వహణ గ్రాంటు కింద రూ.10 వేల నుండి రూ 15 వేల వరకుంటుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి సర్వశిక్షా అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ కలిపి సమగ్ర శిక్షా అభియాన్‌గా మార్చారు. వీటి నిధుల జాడ ఇప్పటి వరకు కానరాలేదు. ప్రతి నెల విద్యుత్, పేపర్ తదితర బిల్లుల చెల్లింపు తలకు మించిన భారంగా మారుతోందని పలువురు ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. సర్వ శిక్షా అభియాన్ నుంచి నిధులు నేరుగా ఆయా ఎస్ఎంసిల అకౌంట్‌లలో జమ అయ్యేవి. అదనంగా ఆర్ఎంఎస్ఏ నుంచి కొన్ని నిధులు కేటాయించే వారు. ప్రస్తుతం ఈ రెండు శాఖలు ఒకే గొడుగు కింద రావడంతో నిధుల విడుదలకు అంతరాయం ఏర్పడింది. ఇంత వరకు పాఠశాలలకు సంబంధించిన నిధుల విడుదలకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేదు. ఈ విద్యా సంవత్సరం నిధులు వస్తాయా... లేదా అనేది ఇంకా సందిగ్ధమేనని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు. నిధులు రాకుంటే పాఠశాలలకు సంబంధించిన ఖర్చు ఎలా చేయాలని వారు మదనపడుతున్నారు.



బాలికల ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా కనువిందు చేసిన రంగ వల్లులు

మోత మోగిస్తున్న విద్యుత్ బిల్లులు

మరో వైపు మెజార్టీ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ఆరంభమయ్యాయి. గతంలో పాఠశాలకు ఒకే రకమైన నిధులు కేటాయిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో అధనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. పదో తరగతి కొనసాగుతున్న పాఠశాలలన్నింటిలోని ఆర్ఎంఎస్ఏ పథకం కింద రూ. 36 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు అధనపు తరగతి గదులు నిరించారు. ఈ తరగతులలో ప్రత్యేకంగా విద్యుత్ సౌకర్యం కల్పించారు. అప్పటి వరకు అంతంత మాత్రంగా ఉన్న విద్యుత్ వినియోగం నూతన గదులు అందుబాటులోకి రావడంతో బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. వాటి చెల్లింపులు పాఠశాలలకు భారంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నందున విద్యుత్ వాడకం బాగానే పెరిగింది. ప్రభుత్వం ఇప్పటి వరకు, ఈ విద్యుత్ బిల్లుల విషయంలోగానీ, గ్రాంటుల విషయంలోగానీ స్పష్టమైన ప్రకటన చేయలేదు. విద్యుత్ బిల్లులు తామే చెల్లిస్తామని విద్యాశాఖాధికారులు కొన్ని చోట్ల చెబుతున్నారని తెలిసింది. ప్రధానోపాధ్యాయులు మాత్రం కరెంట్ బిల్లు కట్టాలా... కడితే డబ్బులు ఎలా సర్దుబాటు చేయాలనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తే మేలు జరుగుతుందని వారు కోరుతున్నారు.

పెరిగిన వినియోగం

ప్రభుత్వం ఎప్పటికప్పుడు కోరే వివరాలను సమర్పించేందుకు ఇంటర్నెట్ పై ఆధార పడుతున్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా నాటిన మొక్కలకు నీటిని పట్టేందుకు బోరు వినియోగం, మరుగుదోడ్ల నిర్వహణకు తప్పనిసరిగా నీటి వినియోగం తప్పనిసరి. తరచూ బోరు తో నీటిని తొడటం వల్ల విద్యుత్ బిల్లులు కూడా పెరిగిపోతున్నాయని వీరి వాదన. నెలకు సుమారుగా రూ.3 వేల వరకు కరెంట్ బిల్లు వస్తుంది. అంటే పది నెలలకు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు అవుతుందని. కేవలం విద్యుత్ బిల్లులకే ఇలా వేలకు వేలు ఖర్చు చేస్తే మిగిలిన వాటి సంగతేంటని వారు ప్రశ్నిస్తున్నారు.

గతంలో ఇలా..

గతంలో సర్వశిక్షా అభియాన్ నుంచి నిధులు విడుదల చేసేవారు. 1 నుంచి 5 తరగతులు బోధించే పాఠశాలలకు నిర్వహణ గ్రాంటు కింద రూ. 10 వేలు, 18 తరగతులు బోధించే ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.13 వేలు, 610 తరగతులు బోదించే ఉన్నత పాఠశాలలకు రూ.15 వేలు సర్వశిక్షా అభియాన్ చెల్లించేది. ఉన్నత పాఠశాలలకు అదనంగా ఆర్ఎంఎస్ఏ నుంచి రూ. 50 వేల వరకు గ్రాంటులు వచ్చేవి. ఉన్నత పాఠశాలలు ఆర్ఎంఎస్ఏ నిధులతోనే నెట్టుకొస్తున్నాయి. ఈ ఏడాది ఎస్ఎస్ఏలో విలీనం చేశారు. దీని కింద వచ్చే రూ. 50 వేల గురించి ఇక ఆశ వదులు కోవాల్సిందేనని పలువురు భావిస్తున్నారు. గత సంవత్సరం రూ.25 వేలతో సైన్స్‌కు సంబంధించిన పరికరాలు, రూ.25 వేల తో విద్యుత్ బిల్లులు చెల్లించారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ 50 వేలకు సంబంధించిన ఎలాంటి క్లారిటి ఇంకా ప్రధానోపాధ్యాయులకు అందలేదు.

గురుకుల ఆశ్రమ పాఠశాలలో
తోటివిద్యార్థిపై మరో విద్యార్థి పైశాచికత్వం



మనతెలంగాణ/కొత్తగూడెం సింగరేణి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డ మహాత్మ జ్యోతిరావుపూలే బిసి బాలుర ఆశ్రమ పాఠశాలలో ఒక విద్యార్థి పై మరో విదార్థి తీవ్రంగా దాడిచేసి, పెన్నుతో వంటిపై పలు చోట్ల పొడిచి, వృషణాలపై కొట్టి, ఇతర విధంగా వేధించటంతో బాలుడు ఉసికాల రాఘవేంద్ర తండ్రి నరసింహారావు సుజాతనగర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జూలూరుపాడుకు చెందిన ఉసికాల నరసింహారావు కుమారుడు రాఘవేంద్ర బిసి బాలుర ఆశ్రమపాఠశాలలో 7 చదువుతున్నాడు. శనివారం రాత్రి నిద్రపోతున్న సమయంలో రాఘవేంద్ర పై మరో విద్యార్థి తీవ్రంగా దాడిచేసి కొట్టాడు. వృషణాలపై దాడి చేశాడు.వాటి పై తీవ్రంగా కొట్టాడు. అంతేకాకుండా తన వద్ద ఉన్న పెన్నుతో రాఘవేంద్ర వంటిపై పిరుదుల భాగంలో, నడుంపై , ఛాతీపై తీవ్రంగా పొడిచాడు. దీనితో విషయాన్ని రాఘవేంద్ర ఆదివారం తల్లి తండ్రులకు తెలియజేశాడు. వారువెంటనే పాఠశాల వద్దకు రాగా ఎవరు అందుబాటులో లేరు. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన వారు కొద్దిసేపు తమకుమారుడి గాయాలు చూసి కంటతడిపెట్టారు. అక్కడి నుంచి వెంటనే సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ ఐ వరుణ్‌ప్రసాద్ కు రాఘవేంద్ర తండ్రి నరసింహారావు ఫిర్యాదు చేశాడు. తన కుమారుడిపై మరో విద్యార్థి దాడిచేసి, శరీరంపై వివిధచోట్ల పొడిచాడని, వృషణాలు గాయపర్చాడని ఫిర్యాదు లో పేర్కొన్నాడు. తమ కుమారుడిపై ఇంతజరిగా పాఠశాల ప్రిన్సిపాల్ కాని, వార్డెన్ కాని , మిగతా భాద్యులెవరు తమ దృష్టికి ఈ విషయం తీసుకురాకపోవటంతో విధ్యార్ధి తల్లి తండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ వరుణ్‌ప్రసాద్ మనతెలంగాణ కు చెప్పారు. కాగా గాయపడ్డ విద్యార్ధిని ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనపై వివరణ కోసం ప్రయత్నించగా పాఠశాల వద్ద ప్రిన్సిపాల్ కాని ఆశ్రమస్కూలు వార్డెన్ కాని అందుబాటులో లేరు. అక్కడున్న సిబ్బంది ఎవరు నోరు మెదపటం లేదు. కనీసం ఆయా బాధ్యుల ఫోన్ నెంబర్లు కూడా ఇవ్వలేదు. పైగా పాఠశాలలో ఎటువంటి సమాచారం సూచించే బోర్డు లేదు. సమాచారహక్కు చట్టం కు వివరాలు తెలిపే బోర్డు లేదు. మొత్తం 320మంది విద్యార్థులు ఈ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్న ఆరోపణలున్నాయి. కాగా గతంలో ఉమ్మడి జిల్లాలోని హాస్టళ్లలో ఇటువంటి సంఘటనలు జరిగి ఇప్పటికే ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. ఇక్కడి సంఘటనలో వృషణాలపై కొట్టడం పలు అనుమానాలకు దారితీస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్ లో కూడా ప్రిన్సిపాల్, వార్డెన్ వివరణకు ప్రయత్నించగా వారెవరు అందుబాటులోకి రాలేదు.ఇదిలా ఉండగా పాఠశాల ప్రస్తుతం ఉన్నది సుజాతనగర్ మండలంలో, కాని పాఠశాల వద్ద ఉన్న బోర్డు పై మాత్రం వేపలగడ్డ చుంచుపల్లి మండలం అని ఉండటం విశేషం.

పంట నష్టపోయిన
రైతులను ఆదుకోవాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన ఆకాల వర్షాలకు పలు పంటలు దెబ్బతిన్నాయని, ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశెనగ Aలాంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేరుశెనగ పంటకు మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు మామిడి పూత రాలిపోయిందని, దీంతో లక్షలాది ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారని ఆయన వాపోయారు.

దీంతో కోట్లాది రూపాయల నష్టం సంభవించిదని రైతాంగాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. వెంటనే పంటల నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి రెవెన్యూ, వ్యవసాయాధికారులను పంపాలని, నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.20 వేల పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని చాడ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.



మల్లన్న సన్నిధిలో..
ఘనంగా లష్కర్ బోనాలు



- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి (కొమురవెల్లి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లష్కర్ వారం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చి మల్లన్నకు, ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. బోనాల సందడి, పోతురాజుల నృత్యాలతో కోలాహలం నెలకొంది. మల్లన్నను దర్శించుకున్న అనంతరం భక్తులు సమీపంలో గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లిని దర్శనం చేసుకొని కల్లు శాకను సమర్పించుకున్నారు. మల్లన్న ఆలయ ముఖ మండపం, గంగరేణి చెట్టు ప్రాంతాల్లో భక్తులు పట్నాలు వేసి మొక్కులు సమర్పించుకోగా, ఎల్లమ్మ తల్లికి ఓడి బియ్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ సెవెల్లి సంపత్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లను చేపట్టారు. ట్రైనీ ఐపీఎస్ డాక్టర్ శబరీష్, హుస్నాబాద్ ఏసీపీ మహేందర్‌ల ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.





నన్ను ప్రేమించే, ఇష్టపడే వారి గురించే నేను పట్టించుకుంటా. నేను పాజిటివిటీనే తీసుకుంటా. సోషల్‌మీడియా ఉండేది అందుకే. అంతేకానీ చెత్తగా మాట్లాడే వారిని నేను పట్టించుకోను.

– బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా



'వాల్మీకి' ప్రారంభోత్సవ వేడుకలో వరుణ్‌తేజ్‌పై క్లాప్ కొడుతున్న నిహారిక. మరో చిత్రంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట, సుకుమార్, వి.వి.వినాయక్, హరీష్ శంకర్ తదితరులు.

'వాల్మీకి' సినిమా షురూ

ఫిదా, తొలిప్రేమ, అంతరిక్షం, ఎఫ్2 వంటి విభిన్న చిత్రాలతో ఘన విజయాలు అందుకున్న వరుణ్‌తేజ్ హీరోగా 14 రీల్స్ ప్లస్ పతాకంపై హరీష్ శంకర్ దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న భారీ చిత్రం 'వాల్మీకి'. ఈ చిత్రం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. వరుణ్‌తేజ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు నిహారిక కొణిదెల క్లాప్ నివ్వగా... రామ్ బొబ్బ కెమెరా స్విచ్చాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఫస్ట్ షాట్‌ను డైరెక్ట్ చేశారు. స్టార్ డైరెక్టర్ సుకుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ చిత్రానికి సంగీతంః దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీః అయనంకా బోస్, కథః కార్తీక్ సుబ్బరాజ్, స్క్రీన్‌ప్లేః మధు, చైతన్య, ఆర్:అవినాష్ కొల్ల,ఎడిటింగ్ః ఛోటా కె.ప్రసాద్, ఫైట్స్ః రామ్‌లక్ష్మ ణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ః హరీష్ కట్టా.

క్రేజీ కాంబినేషన్‌లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



వెంకటేష్



త్రివిక్రమ్

త్రివిక్రమ్ మాటల రచయితగా ఉన్న సమయంలో వెంకటేష్ సినిమాలకు ఎక్కువ శాతం పనిచేశారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అప్పటి నుండి కూడా వీరిద్దరి కాంబోలో సినిమా అదుగో ఇదుగో అంటూ వాయిదాలు పడుతూ వస్తోంది. త్రివిక్రమ్ వరుసగా యంగ్ స్టార్‌లతో సినిమాలు చేస్తూ వస్తున్న కారణంగా వెంకీతో ఆయన మూవీ వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా వెంకటేష్ 'ఎఫ్2' చిత్రంతో మంచి కమర్షియల్ సక్సెస్‌ను దక్కించుకున్నారు. దీంతో ఇక ఈ సీనియర్ స్టార్ వరుసగా సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక మల్లీశ్వరి వంటి ఒక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథను వెంకటేష్ కోసం త్రివిక్రమ్ సిద్ధం చేసినట్లుగా తెలిసింది. 'ఎఫ్2' చిత్రంతో వెంకీలో ఆ కామెడీ యాంగిల్ అలాగే ఉందని నిరూపితం అయింది. అందుకే గతంలో ఈ సీనియర్ స్టార్ కోసం అనుకున్న స్టోరీ లైన్‌ను త్రివిక్రమ్ డెవలప్ చేసి కథను సిద్ధం చేస్తున్నట్లుగా తెలిసింది. హారిక అండ్ హాసిని బ్యానర్‌లో సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో వెంకటేష్, త్రివిక్రమ్‌ల సినిమా ఉండబోతోంది.

నేచురల్ స్టార్ చిత్రంలో ప్రియా?

'మనం' ఫేమ్ విక్రమ్ కుమార్ దర్శకత్వంలో నేచురల్ స్టార్ నాని తన 24వ చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రంలో ఆరుగురు కథానాయికలు నటించబోతున్నారు. అందులో ఒక హీరోయిన్‌గా మలయాళ బ్యూటీ, వింక్ సెన్సేషన్ ప్రియా ప్రకాష్ వారియర్‌ను తీసుకోవాలనుకుంటున్నారట ఫిల్మ్‌మేకర్స్. ఈమేరకు ఆమెకు స్క్రీన్‌టెస్ట్ కూడా నిర్వహించనున్నారని తెలిసింది. ఈ టెస్ట్‌ను క్లియర్ చేస్తే ప్రియా ప్రకాష్ ఈ సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేసినట్లే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ లేదా అనిరుధ్ సంగీతాన్ని అందించే అవకాశం ఉంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పిసి శ్రీరామ్ ఛాయాగ్రహణం అందించనున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 19 నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇక నాని ప్రస్తుతం 'జెర్సీ' చిత్రంలో నటిస్తున్నారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తుది దశ షూటింగ్‌ను జరుపుకుంటోంది. ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదల కానుంది.



ప్రియా ప్రకాష్ వారియర్

శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర బ్యానర్‌లో మరో సినిమా



వెంకీ అట్లూరి

తన తొలి చిత్రం 'తొలి ప్రేమ'తో సూపర్‌హిట్ సాధించిన వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్ అక్కినేని హీరోగా తెరకెక్కిన రొమాంటిక్ లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ ''మిస్టర్ మజ్ను చిత్రానికి మంచి స్పందన వస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇక 'ప్రేమనగర్'లోని అక్కినేని నాగేశ్వరరావు పాత్రను ఆధారంగా చేసుకొని అఖిల్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసుకున్నాను. ఈ సినిమాలో విక్కీ క్యారెక్టర్‌లో అఖిల్ అద్భుతంగా నటించాడు. నేను అనుకున్న దానికంటే అతను 50 శాతం ఎక్కువే చేశాడు. ఇక ఈ సినిమా విషాదంగా ఉండదు అని చెప్పడానికి మజ్నుకు ముందు మిస్టర్‌ను జత చేసి టైటిల్ పెట్టాం. ఈ కథను ముందుగా దిల్‌రాజుకు చెప్పాను. కాస్త అనుభవం వచ్చిన తర్వాత ఈ సినిమా చేస్తే బావుంటుందని ఆయన అన్నారు. ఆయన కథాపరంగా కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చారు. ఆయన సలహాలను తీసుకున్నాను. నాగార్జున ఈ సినిమాకు తొలి ప్రేక్షకుడు. సినిమా పూర్తయిన తర్వాత ఆయన 'మిస్టర్ మజ్ను'ను చూశారు. ఆతర్వాత ఓ పబ్ సీన్‌ను రీషూట్ చేయమని సలహా ఇచ్చారు. ఆయన ఇచ్చిన సలహా సినిమాకు ఎంతో హెల్ప్ అయింది. దిల్‌రాజు మనవడు ఆరాన్ష్ చాలా యాక్టివ్‌గా ఉంటాడు. ఏడాదిన్నర వయసు ఉన్న అతన్ని కొండబాబు క్యారెక్టర్ కోసం తీసుకోవాలని దిల్‌రాజును, ఆయన అమ్మాయిని అడిగాను. వారు ఒప్పుకోవడంతో ఆరాన్ష్‌ను కొండబాబు క్యారెక్టర్‌కు తీసుకున్నాను. ఆరాన్ష్ చక్కగా నటించాడు. నిధి అగర్వాల్‌తో పనిచేసేటప్పుడు నాకు పెద్దగా కష్టమనిపించలేదు. ఆమె తన పాత్రలో అద్భుతంగా నటించింది. థమన్ 'తొలిప్రేమ' సినిమాకు ఎంత న్యాయం చేశాడో ఈ సినిమాకు కూడా అంతే న్యాయం చేశాడు. ఇక శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి బ్యానర్‌లోనే మరో సినిమా కూడా ఉంటుంది. కానీ ఎప్పుడు ఉంటుందో ఇప్పుడే చెప్పలేను. రెండు, మూడు కథలను సిద్ధం చేస్తున్నాను. మైత్రీ మూవీస్‌లో ఓ సినిమా కమిట్‌మెంట్ ఉంది''అని అన్నారు.



కుమారుడి కోసం తండ్రి 'ఎదురీత'

ఓ 40 ఏళ్ల మధ్యతరగతి తండ్రికి కుమారుడు అంటే అమితమైన ప్రేమ. కుమారుడు కోరినది ఏదీ కాదనకుండా ఇస్తాడు. కుమారుడి ప్రతి కోరిక నెరవేరుస్తాడు. ఆ ప్రేమ అతనికి ఎన్ని సమస్యలు తీసుకువచ్చింది? అనేది తెలుసుకోవాలంటే మా సినిమా చూడాలంటున్నారు దర్శకుడు బాలమురుగన్. శ్రీ భాగ్యలక్ష్మి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై బాలమురుగన్ దర్శకత్వంలో బోగారి లక్ష్మీ నారాయణ నిర్మించిన సినిమా 'ఎదురీత'. శ్రవణ్ రాఘవేంద్ర కథానాయకుడిగా నటించారు. లియోనా లిషోయ్ కథానాయికగా చేసిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. రిపబ్లిక్ డే సందర్భంగా సినిమా ఫస్ట్‌లుక్, ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బోగారి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ''దర్శకుడు బాలమురుగన్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. కుమారుడి కోసం కన్న తండ్రి సాగించిన ఎదురీత ప్రేక్షకుల హృదయాలను తాకుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చిలో మా చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని అన్నారు. జియా శర్మ, నోయెల్ సేన్, 30 ఇయర్స్ పృథ్వీ, 'రంగస్థలం' మహేష్, కాశీ విశ్వనాథ్, రవిప్రకాష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణంః విజయ్ ఆర్పుదరాజ్, రచయితః ధనేష్ నెడుమారన్, ఎడిటర్ః నగూరన్ రామచంద్రన్.

హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్



సప్తగిరి

అతని పేరు గోవిందు. ఫన్నీ దొంగ. అతనికి ఓ లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం ఏం చేశాడన్నది తెలుసుకోవాలంటే 'వజ్ర కవచధర గోవింద' సినిమా చూడాల్సిందేనని అంటున్నారు సప్తగిరి. ఈ స్టార్ కమేడియన్ దొంగగా నటిస్తున్న చిత్రమిది. అరుణ్ పవార్ దర్శకత్వంలో శివ శివమ్ ఫిలిమ్స్ పతాకంపై నరేంద్ర యెడల, జివిఎస్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అరుణ్ పవార్ మాట్లాడుతూ ''సప్తగిరి నుంచి ప్రేక్షకులు ఏం ఆశిస్తారో ఆ అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి. సప్తగిరి వ్యవహారిక శైలికి పర్‌ఫెక్ట్‌గా సూటయ్యే కథ ఇది. ఈ చిత్రంలో కడుపుబ్బ నవ్వించే అంశాలతో పాటు మంచి యాక్షన్, ఎమోషన్స్, ఇతర వాణిజ్య అంశాలు మెండుగా ఉంటాయి''అని అన్నారు. నిర్మాతలు నరేంద్ర యెడల, జివిఎస్ రెడ్డి మాట్లాడుతూ ''సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. మిగిలిన సన్నివేశాలను కర్నాటకలోని ఒక గుడిలో తెరకెక్కిస్తాం. మా చిత్రానికి కీలకమైన ఈ ఎపిసోడ్స్‌ను 10 రోజుల పాటు ఆ దేవాలయంలో చిత్రీకరిస్తాం. హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది''అని తెలిపారు. వైభవీ జోష్ కథానాయికగా చేస్తున్న ఈ చిత్రంలో అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, రాజేంద్ర జాన్ కొట్టోలి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరాః ప్రవీణ్ వనమాలి, సంగీతంః విజయ్ బుల్గానిన్, కథః జిటిఆర్ మహేంద్ర, ఎడిటింగ్ః కిషోర్ మద్దాలి.



కంగనా రనౌత్

కంగన వల్లే తప్పుకున్నాను: క్రిష్



క్రిష్

'మణికర్ణిక' సినిమా విషయంలో తనను కో డైరెక్టర్‌గా పేర్కొనడంపై దర్శకుడు క్రిష్ ఫైర్ అవుతున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఏదో కొంత వర్క్ కంగనారనౌత్ చేసిందనీ, మెజారిటీ వర్క్ తనదేనని ఆయన అంటున్నారు. తాను చిత్రీకరించిన కొన్ని సీన్లను ఆమె రీషూట్ చేశారని... యథారీతిన ఆ సీన్లను తీసిన కంగన తానే ఈ సినిమాకు దర్శకత్వం వహించినట్టుగా ప్రకటించుకుంటోందని క్రిష్ పేర్కొన్నారు. ఈ సినిమా నుండి తాను వైదొలగడానికి గల కారణాలను ఈ దర్శకుడు వివరించారు. సోనూసూద్ పాత్ర లెంగ్త్ తగ్గించేయాలని, ఫస్టాఫ్‌లోనే ఆ పాత్రను చంపేయాలని కంగనా రనౌత్ తనను కోరిందని... దానికి తాను నిరాకరించినట్టుగా ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనతో కంగనా నిర్మాత వద్దకు వెళ్లిందని... దానికి అతను కూడా వత్తాసు పలికాడని, అలాంటి మార్పులు చేయడం ఇష్టంలేక తాను సినిమా నుంచి తప్పుకున్నట్టు క్రిష్ పేర్కొన్నారు. పాత్ర నిడివి తగ్గిపోవడంతో సోనూసూద్ కూడా తప్పుకున్నాడని... ఆతర్వాత కంగనా చేతుల్లోకి 'మణికర్ణిక' సినిమా వెళ్లిపోయిందని చెప్పారు. తాను చిత్రీకరించిన వర్షన్‌ను చూసి ఆమె దారుణమైన కామెంట్లు చేసిందని... భోజ్‌పురి సినిమాలా ఉందని వ్యాఖ్యానించిందని క్రిష్ అన్నారు. ఏతావాతా 'మణికర్ణిక' సినిమా దర్శకత్వ క్రెడిట్ తనకే దక్కుతుందని దర్శకుడు క్రిష్ చెబుతున్నారు. నిర్మాతలు తనకు ఇంకా పూర్తి పారితోషికం కూడా చెల్లించలేదని ఆయన అన్నారు.

ఇస్మార్ట్ హీరోకు జోడీగా ఇస్టైల్ బ్యూటీలు



నిధి అగర్వాల్



నభా నటేష్

హీరో రామ్, దర్శకుడు పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో 'ఇస్మార్ట్ శంకర్' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈమధ్యే షూటింగ్ ప్రారంభమైన ఈ చిత్రానికి తాజాగా ఇద్దరు హీరోయిన్లను ఫైనల్ చేశారని తెలిసింది. ఇస్మార్ట్‌గా ఉండే శంకర్‌కు జోడీగా ఇద్దరు ఇస్టైల్‌గా ఉండే బ్యూటీలను తీసుకున్నారట పూరీ జగన్నాథ్. 'నన్ను దోచుకుందువటే' సినిమాలో తన నటనతో ప్రేక్షకులను మెప్పించిన నభా నటేష్‌ను ఒక హీరోయిన్‌గా... 'సవ్యసాచి'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి 'మిస్టర్ మజ్ను'లో కూడా నటించిన నిధి అగర్వాల్‌ను మరో హీరోయిన్‌గా తీసుకున్నారని సమాచారం. కొత్త హీరోయిన్లను వెతికి తీసుకురావడంలో, టాలెంటెడ్ హీరోయిన్లకు మంచి పాత్రలు డిజైన్ చేసి వారికి బ్రేక్ ఇవ్వడంలో పూరి స్పెషలిస్ట్. ఈ చిత్రంలో రామ్ యాక్షన్‌తో పాటు ఇద్దరు బ్యూటీల గ్లామర్ షో హైలైట్ కానుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను పూరీ జగన్నాథ్, ఛార్మీలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

'నన్ను క్షమించండి' అంటున్న శశిధర్

శ్రీదేవి ప్రసన్న మూవీస్ బ్యానర్‌పై దర్శకుడు ఓంకార్ శశిధర్ రూపొందించిన సరికొత్త షార్ట్‌ఫిల్మ్ 'నన్ను క్షమించండి'. గతంలో ఇదే బ్యానర్‌పై రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించిన 'లడ్డు' ఏ స్వీట్ మెమరీ షార్ట్‌ఫిల్మ్‌కు మంచి ప్రేక్షకాదరణతో పాటు 28 ఇంటర్నేషనల్ అవార్డులు, 3 కేటగిరీల్లో నంది పురస్కారాలు లభించాయి. పి.కృష్ణకాంత్, రాఘవ్ ఓంకార్ శశిధర్ సంయుక్తంగా నిర్మించిన 'నన్ను క్షమించండి' షార్ట్‌ఫిల్మ్‌కు సునీల్ కశ్యప్ సంగీతాన్ని అందించగా శేఖర్ గంగనమోని సినిమాటోగ్రఫీ అందించారు. ఈ షార్ట్‌ఫిల్మ్ ప్రీమియర్ షో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరై తమ అభినందనలను తెలియజేశారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ''శశిధర్ మంచి దర్శకుడు అని 'లడ్డు'తో నిరూపించుకున్నాడు. ఇప్పుడు 'నన్ను క్షమించండి' పేరుతో ఓ మంచి ఆలోచనాత్మక షార్ట్‌ఫిల్మ్ రూపొందించాడు. ఓ మంచి కథ చెబితే శశిధర్‌తో సినిమా నిర్మించడానికి నేను రెడీ''అని అన్నారు. నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ ''తల్లి సెంటిమెంట్ మీద చాలా సినిమాలు వస్తుంటాయి. తండ్రి 'మీద చాలా తక్కువగా వస్తుంటాయి. అలా వచ్చిన వాటిలో టాప్ టెన్‌లో 'నన్ను క్షమించండి' నిలుస్తుంది. అంత అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో దర్శకుడు శశిధర్ ఈ షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందించాడు''అని తెలిపారు. దర్శకుడు శశిధర్ మాట్లాడుతూ ''నా దర్శకత్వంలో వచ్చిన 'లడ్డు' షార్ట్‌ఫిల్మ్‌కు చాలా అవార్డులు వచ్చాయి. మంచి పేరొచ్చింది. దీంతో ఇక షార్ట్‌ఫిల్మ్‌లు చేయొద్దు అనుకున్నాను. కానీ కృష్ణకాంత్ షార్ట్‌ఫిల్మ్ చేయమని అడగడంతో కాదనలేక ఆయన కోసం 'నన్ను క్షమించండి' చేశాను. డిఓపి శేఖర్, మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్ సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ నా కోసం ఈ షార్ట్‌ఫిల్మ్‌కు పనిచేశారు. తాగుబోతు రమేష్, గిరి అన్న చాలా సపోర్ట్ చేశారు. ఇక నెక్స్ట్ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తాను''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత లక్ష్మీ భూపాల్, రవివర్మ, సాగర్, సుధీర్‌బాబు, అస్మిత, గిరిధర్, తాగుబోతు రమేష్, కర్రా నగేష్, యు.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



రాఘవ్ ఓంకార్ శశిధర్, పి.కృష్ణకాంత్, రవివర్మ తదితరులు

క్యూ3, బడ్జెట్ శాసిస్తాయ్



ఈ వారం మార్కెట్‌పై విశ్లేషకులు

ముంబై : ఈ వారం దేశీయ స్టాక్‌మార్కెట్లకు బడ్జెట్–2019, క్యూ3 ఫలితాలు కీలకమని విశ్లేషకులు సూచిస్తున్నారు. అలాగే, డెరివేటివ్స్ గడువు ముగియనుండడం, అంతర్జాతీయ అంశాలు, క్రూడ్ ఆయిల్ ధరల్లో మార్పులు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయని హెచ్చరిస్తున్నారు. పెద్ద సంస్థలు కోటక్ మహీంద్రా బ్యాంక్, యస్ బ్యాంక్, మారుతీ సుజుకీ ఇండియాల క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలు ఇప్పటికే మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ వారంలో యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, భారతీ ఎయిర్ టెల్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, ఐసిఐసిఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు క్యూ3 ఫలితాలను వెల్లడించనున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లలో అప్రమత్తంగా ఉన్నారు. అదే సమయంలో మరో మూడు రోజుల్లో బడ్జెట్–2019ను ప్రవేశపెట్టనుండడం, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ గడువు తేదీ సమీపించడం దృష్ట్యా ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించనున్నారు. ఇంకా అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులు, ముడిచమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలను గమనించాలి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు వంటి పలు ఇతర అంశాలు కూడా మార్కెట్ల ట్రెండ్‌ను ప్రభావితం చేయగలవని నిపుణులు సూచిస్తున్నారు.



మధ్యంతర బడ్జెట్

ప్రభుత్వం శుక్రవారం(ఫిబ్రవరి1)న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. 2019 ఏప్రిల్‌లో లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వైద్య చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లడంతో మోడీ అధ్యక్షతన ఈసారి బడ్జెట్‌ను పీయూష్ గోయల్ ప్రకటించనున్నారు. దీంతో ఇన్వెస్టర్లు బడ్జెట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు

డెరివేటివ్స్ గడువు ముగింపు

గురువారం(31న) జనవరి డెరివేటివ్ సిరీస్ ముగియనుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ గడువు ముగియనుండటంతో ట్రేడర్లు తమ పొజిషన్లను రోలోవర్ చేసుకోనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. దీంతో మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఇంకా అమెరికా, చైనా మధ్య వాణిజ్య వివాద చర్చలు కూడా సెంటిమెంటును ప్రభావితం చేయనున్నాయి. వాణిజ్య చర్చల నిమిత్తం ఈ నెలాఖరున చైనా ఆర్థికశాఖ అధికారి అమెరికా సందర్శించనుండడంతో ఇన్వెస్టర్ల దృష్టి ఈ అంశంపై నెలకొంది.

క్యూ3 ఫలితాలు

ఈ వారం క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలను పలు కంపెనీలు వెల్లడించనున్నాయి. వాటిలో ఈనెల 28న టాటా పవర్, 29న యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి ఫలితాలు ప్రకటించనున్నాయి. ఇంకా ఈనెల 30న బజాజ్ ఆటో, ఐసిఐసిఐ బ్యాంక్, ఐఒసి, ఎన్‌టిపిసి, 31న టెలికం దిగ్గజం ఎయిర్‌టెల్, డాబర్, హీరో మోటో, పవర్ గ్రిడ్, యుపిఎల్, వేదాంతా వంటి సంస్థలు ఫలితాలను చెప్పనున్నాయి. బడ్జెట్ రోజున ఎస్‌బిఐ, డాక్టర్ రెడ్డీస్, బెర్జర్ పెయింట్స్, టైటన్ కంపెనీ క్యూ3 ఫలితాలు విడుదల చేయనున్నాయి.



రూ.6 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి

న్యూఢిల్లీ : జనవరిలో దేశీయ స్టాక్‌మార్కెట్ల నుంచి దాదాపు రూ.6000 కోట్లను విదేశీ ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు. రాబోయే నెలల్లో ఇదే విధంగా పెట్టుబడుల ఉపసంహరణ ఉండే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. జనవరి 1 నుంచి 15 తేదీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐ) రూ.5,880 కోట్ల నిధులు వెనక్కి తీసుకున్నారు. ఇదే కాలంలో డెబిట్ మార్కెట్లలో రూ.163 కోట్లను విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టారు. అంతర్జాతీయంగా ఎదురుగాలులు, కొద్ది నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు. విదేశీ పెట్టుబడులను చూస్తే ఈ ఏడాది ఇది శుభారంభం కాదు, భారత్‌లో జరిగే పరిణామాల పట్ల ఎఫ్‌పిఐ ఇన్వెస్టర్లు జాగ్రత్త వహిస్తున్నారని, పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. కాగా 2017 నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈక్విటీ మార్కెట్లలోకి రూ.8,584 కోట్లు విదేశీ పెట్టుబడులు రాగా, 2019 అక్టోబర్‌లో రూ.28,900 కోట్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

కొచ్చర్ కేసులో సిబిఐ అధికారి బదిలీ



న్యూఢిల్లీ: వీడియోకాన్‌కు ఐసిఐసిఐ బ్యాంక్ రుణం మంజూరు కేసును దర్యాప్తు చేస్తున్న సిబిఐ అధికారిని బదిలీ చేశారు. ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ చందాకొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ అధినేత వేణుగోపాల్ ధూత్‌పై సిబిఐ కేసు నమోదు చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. బ్యాంకింగ్, సెక్యూరిటీస్ ఫ్రాడ్ సెల్ ఎస్పి హోదాలో బాధ్యతలు నిర్వహిస్తున్న సుధాన్షు ధార్ మిశ్రాను తాజాగా ఝార్ఖండ్‌లోని రాంచీ శాఖకు బదిలీ చేశారు. ఈ నెల 22న చందాకొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్‌తో పాటు ఇతరులపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌పై సుధాన్షు ధార్ సంతకం చేశారు. ఆ మరుసటి రోజే ఆయన్ని బదిలీ చేస్తున్నట్లు సిబిఐ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో 24న చందా కొచ్చర్ తదితరులపై సిబిఐ కేసు నమోదు చేసింది. చందా కొచ్చర్ అధ్యక్షతన గల కమిటీ వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌కు 2009లో రూ.300 కోట్లు, 2011లో రూ.750 కోట్లు రుణంగా మంజూరు చేసిందని, ఈ విషయంలో నిబంధనలు పాటించలేదని సిబిఐ పేర్కొంది. ఇచ్చిన రుణాల్లో చాలావరకు తిరిగి వసూలుకాకపోవడంతో బ్యాంకుకు రూ.1,730 కోట్లు నష్టం వచ్చినట్టు ఆరోపించింది. రుణాలు మంజూరుకు ప్రతిఫలంగా వేణుగోపాల్ ధూత్ సూపర్ ఎనర్జీ పేరుతో చందా కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన నూపవర్ కంపెనీలో రూ.64 కోట్లు పెట్టుబడి పెట్టారని తెలిపింది. ఈ పెట్టుబడి అవినీతి కిందికే వస్తుందని ఆరోపిస్తూ కేసు నమోదు చేసింది. కాగా వీడియోకాన్–ఐసిఐసిఐ బ్యాంక్ కేసు విషయంలో సిబిఐ అత్యుత్సాహం ప్రదర్శిస్తోందంటూ కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ తీవ్రంగా స్పందించారు. చందా కొచ్చర్ కేసు నమోదు చేసిన మరసటి రోజు జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు.

సిబిఐ బ్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంది: చిదంబరం



జైట్లీ తర్వాత మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి.చిదంబరం కూడా సిబిఐ విమర్శలు గుప్పించారు. కొందరు బ్యాంకర్లను సిబిఐ విచక్షణారహితంగా టార్గెట్ చేసుకుందని, ఈ చర్యలకు గాను కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ నుంచి సిబిఐ అద్భుతమైన ధృవపత్రాన్ని అందుకుందని విమర్శించారు. చిన్న మొత్తాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసుల్లో సిబిఐ ఇష్టమొచ్చినట్టుగా వ్యవహరిస్తోందని చిదంబరం అన్నారు. సిబిఐ తీరుపై జైట్లీ కూడా తీవ్రంగా స్పందించారని, ఉత్యుత్సాహం ప్రదర్శించవచ్చని సిబిఐకి హితవు పలికారని గుర్తు చేశారు. శుక్రవారం నాడు వీడియోకాన్ రుణం కేసులో సిబిఐ తీరుపై కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఆగ్రహంగా స్పందించారు. దర్యాప్తు సంస్థ సిబిఐ సాహసోపేత దోరణిని వదులుకోవాలని, బుల్ కంటిపైనే దృష్టిని కేంద్రీకరించాలని జైట్లీ ట్విట్టర్ ద్వారా వ్యాఖ్యలు చేశారు. చందా కొచ్చర్‌పై కేసు నమోదు చేసిన తర్వాత బ్యాంకింగ్ దిగ్గజం కెవి కామత్‌ను ప్రశ్నించనున్నారనే వార్తల నేపథ్యంలో జైట్లీ ఈవిధంగా స్పందించడం గమనార్హం. ప్రస్తుతం జైట్లీ క్యాన్సర్ చికిత్స నిమిత్తం అమెరికాలో ఉన్న విషయం తెలిసిందే.



నేడు బ్యాంకర్లతో గోయల్ భేటీ


న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక పరిస్థితి మెరుగుదల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకుల సిఇఒలతో నేడు కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ సమావేశం కానున్నారు. మరో మూడు రోజుల్లో బడ్జెట్–2019 ప్రవేశపెట్టడానికి ముందు ఆయన బ్యాంకర్లతో భేటీ కానుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏప్రిల్–మే నెలల్లో సాధారణ ఎన్నికలు జరగడానికి ముందు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆఖరికి బడ్జెట్ ఇది. కాగా సోమవారం బ్యాంకర్ల సమావేశంలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా హాజరుకానున్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై భేటీలో చర్చించనున్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంకా ఎంఎస్‌ఎంఇ (మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమలు)లకు రుణాల మంజూరు, మొండి బకాయిల సమస్య, బ్యాంకుల ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై మంత్రి చర్చించనున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాల అమలు తీరు, గడిచిన తొమ్మిది నెలల దేశ ఆర్థిక స్థితి గురించి సమీక్షించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వరంగ బ్యాంకులు 2018మార్చి నాటికి రూ. 23,000 కోట్ల మొండి బకాయిలను రికవరీ చేయగలిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్థభాగం ముగిసే సరికి రికార్డు స్థాయిలో రూ.60,700 కోట్ల మొండి బకాయిలను వసూలు చేశాయి. అంతకు ముందు పీయూష్ గోయల్ ఆర్థికమంత్రిగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సునీల్ మెహతా నేతృత్వంలో సమస్యాత్మకంగా పరిణమించిన బకాయిలను వేగంగా వసూలు చేసేందుకు ఉన్న మార్గాలను అన్వేషించేందుకు కమిటీని నియమించారు. అయితే ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అనారోగ్యంతో అమెరికాలో చికిత్స పొందుతున్న కారణంగా పీయూష్ గోయల్ ఆర్థిక మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

బిపిసిఎల్

రిఫైనరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

పెట్రో కెమికల్ కాంప్లెక్స్ జాతికి అంకితం చేసిన ప్రధాని

కొచ్చి: కొచ్చిలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బిపిసిఎల్) రిఫైనరీ కాంప్లెక్స్‌ను జాతికి అంకితమిస్తున్నట్టు ఆదివారంనాడు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. ఇక్కడ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎల్‌పిజి బాటిలింగ్ ప్లాంట్ వద్ద స్టోరేజ్ నౌక ప్రారంభోత్సవంతో పాటు ఎట్టుమనూర్ వద్ద స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, రిఫైనరీ వద్ద పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, దేశంలో పెట్రో కెమికల్ రంగం వేగంగా వృద్ధిని సాధిస్తోందని, దేశంలో రిఫైనరీ హబ్‌గా మారిందని అన్నారు. డిమాండ్ కంటే ఎక్కువగా రిఫైనింగ్ నిర్వహిస్తోందని అన్నారు. 2016 మేలో ఉజ్వలా యోజనా పథకం ప్రారంభించగా, అప్పటి నుంచి ఈ పథకం కింద పేద ప్రజలకు ఆరు కోట్ల ఎల్‌పిజి కనెక్షన్లను ప్రభుత్వం అందించిందని అన్నారు. ఆధునిక కాంప్లెక్స్‌తో కొచ్చి రిఫైనరీ దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ రిఫైనరీగా మారనుంది. ఇక్కడ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో దీనిని స్థాపించారు. ఇది ఎల్‌పిజి, డీజిల్ ఉత్పత్తిని రెట్టింపు చేసి, ప్లాంట్‌లో పెట్రోకెమికల్ ప్రాజెక్టులకు ముడిపదార్థాల ఉత్పత్తిని ప్రారంభిస్తుంది.



కొచ్చిలో పెట్రోకెమికల్ కాంప్లెక్స్ శంకుస్థాపనలో నమూనా చిత్రాన్ని చూస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ




రేపటి నుంచి చాలెట్ హోటల్స్ ఐపిఒ

ముంబై : కె.రహేజా గ్రూప్‌నకు చెందిన చాలెట్ హోటల్స్ ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) జనవరి 29న ప్రారంభం కానుంది. ఈ ఆఫర్ ఈనెల 30న ముగియనుంది. ఈ ఐపిఒ ద్వారా సంస్థ రూ.1641 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఐపిఒ ధర స్థాయి రూ.275 నుంచి రూ.280గా ఉంది. ఇష్యూలో భాగంగా కంపెనీ 950 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ప్రమోటర్ గ్రూప్ రూ.609 కోట్ల విలువైన 2.46 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఇష్యూ కోసం కనీసం 53 షేర్ల(ఒక లాట్)కు దరఖాస్తు చేసుకోవాలి. సమీకరించిన మూలధన నిధుల్లో కొంత రుణ చెల్లింపులు, సాధారణ వ్యాపార అవసరాల నిమిత్తం వినియోగిసున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ఐపిఒకు జెఎం ఫైనాన్షియల్ లిమిటెడ్, యాక్సిస్ క్యాపిటల్ లిమిటెడ్, మోర్గాన్ స్టాన్లీ ఇండియా కంపెనీలు లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి. ఐపిఒ ప్రక్రియ అనంతరం షేర్లను బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇ ఎక్స్ఛేంజ్‌లలో లిస్ట్ చేయనున్నట్టు కంపెనీ తెలిపింది.



ఆదివారంనాడు ముంబైలో ఎంఎన్‌ఎస్ చీఫ్ రాజ్ థాకరే కుమారుడు అమిత్ థాకరే వివాహానికి హాజరయ్యేందుకు వస్తున్న టాటా గ్రూప్ గౌరవ చైర్మన్ రతన్ టాటా



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.99
యూరో	80.36
బ్రిటిష్ పౌండ్	93.14
ఆస్ట్రేలియన్ డాలర్	50.44
కెనెడియన్ డాలర్	53.27
సింగపూర్ డాలర్	52.23
స్విస్ ఫ్రాంక్	71.32
చైనీస్ యువాన్	10.48
మలేషియన్ రింగిట్	17.16
న్యూజిలాండ్ డాలర్	48.06
హాంకాంగ్ డాలర్	9.05
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	233.95
సౌతాఫ్రికన్ రాండ్	5.18

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30920	33069.52	0.1%
ముంబై	31720	33925.13	0%
ఢిల్లీ	31550	33743.32	0%
కోల్‌కతా	31850	34064.17	0.03%
కేరళ	30100	32192.51	0%
బెంగళూరు	30320	32427.81	0.07%
హైదరాబాద్	30920	33069.52	0.1%
గల్ఫ్	136.28	145.75	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42242.00
ముంబై	₹ 42242.00
ఢిల్లీ	₹ 42242.00
కోల్‌కతా	₹ 42242.00
హైదరాబాద్	₹ 42242.00



యాత్రికుల భద్రతకోసం మరో ప్రాంతానికి మొసళ్ల తరలింపు

స్టాచ్యు ఆఫ్ యూనిటీ వద్ద మడుగుల్లో మొసళ్లు



అహ్మదాబాద్: గుజరాత్ నర్మాదా జిల్లాలో ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ సమీపంలో ఉన్న రెండు మడుగుల్లో ఉన్న మొసళ్లను మరోచోటికి తరలిస్తున్నారు. సర్దార్ పటేల్ స్మారకాన్ని సందర్శించే యాత్రికుల భద్రతకోసం ఈ చర్యను తీసుకున్నామని అధికారులు ఆదివారం తెలిపారు. సముద్ర విమానాలకు, ఈ చర్యకు సంబంధం ఉందన్న ప్రచారాన్ని వారు ఖండించారు. డైక్ 3, డైక్ 4 పేరున్న ఈ రెండు మడుగుల ఒడ్డుల వద్ద మొసళ్లను పట్టుకునేందుకు 20 బోనులను సిద్ధం చేశామని ఒక అధికారి చెప్పారు. సర్దార్ సరోవర్ డ్యామ్ నుంచి విడుదలైన నీరు నర్మాదా ప్రధాన కాలవ ప్రారంభ ప్రాంతాన్ని చేరడానికి ముందు ఆ నీటిని నిలవచేసేందుకు కృత్రిమంగా ఈ రెండు నీటి మడుగుల్ని ఏర్పాటుచేసినట్టు అధికారి వివరించారు. ఇంత వరకు 12 మొసళ్లను పట్టుకున్నామని, అయితే ఇన్ని మొసళ్లను మాత్రమే పట్టుకుంటామనే టార్గెట్ ఏమీ లేదని వడోదరా వైల్డ్ లైఫ్ సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ ఆరాధనా సాహు తెలిపారు. 'కేవడియా గ్రామం సమీపంలో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ చుట్టుపక్కల ప్రాంతం భారీ సంఖ్యలో యాత్రికుల్ని ఆకర్షిస్తోంది. ఇక్కడి మడుగుల్లో మొసళ్లు ఉండడంవల్ల యాత్రికులకు ముప్పు కలగవచ్చు. అందుకే వాటిని మరోచోటికి తరలిస్తున్నాం' అని సాహూ తెలిపారు. రెండు మడుగుల నుంచీ 12 మొసళ్లను పట్టుకున్నాం. ఆ ప్రాంతంలో దాదాపు 300 మొసళ్లు ఉండవచ్చు' అని ఆమె తెలిపారు.

చర్చి ప్రార్థనలపై ఉగ్రదాడి

ఫిలిప్పీన్స్ పేలుళ్లలో 27 మంది మృతి



మనీలా : ఫిలిప్పీన్స్‌లో ఆదివారం క్రైస్తవ మత ప్రార్థనల సమయంలో ఉగ్రవాదులు బాంబు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 27 మంది మృతి చెందారు. 77 మంది గాయపడ్డారు. దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని జోలో దీవి ప్రాంతంలో రోమన్ క్యాథలిక్ కెథడ్రెల్ చర్చిలో వందలాది మంది . ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అంతా ప్రశాంతంగా ఉన్న సమయంలో చర్చి ప్రాంగణంలోనే క్షణాల వ్యవధిలో రెండు శక్తివంతమైన బాంబులు పేలాయి. దీనితో చర్చి దద్దరిల్లింది. నిశ్శబ్దాన్ని చీలుస్తున్నట్లుగా బాధితుల హాహాకారాలతో ఈ ప్రాంతం అంతా భయానకంగా మారింది. చర్చిలోపల రక్తపు మడుగులో కొందరి కుప్పకూలి పడి ఉన్నారు. జోలో ప్రాంతంలో ముస్లిం మిలిటెంట్ల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. తరచూ ఇక్కడ దాడులు జరుగుతూ వస్తున్నాయి. బాంబులు పేలడంతో పలువురు గాయపడటంతో లోపల ఒక్క సారిగా తొక్కిసలాట జరిగింది. పలువురు బయటకు రావడానికి పోటీ పడ్డారు. దీనితో ప్రధాన ద్వారం వద్ద పలువురు కింద పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మొదటి బాంబు పేలగానే ఏదో జరిగిందని తెలుసుకున్న సైనిక దళాలు, పోలీసు బృందాలు చర్చివైపు దూసుకువచ్చాయి. ఈ తరుణంలోనే రెండో బాంబు కూడా భీకరశబ్ధంతో పేలింది. ప్రధాన ద్వారం వద్దనే ఈ పేలుడు జరిగింది. చర్చి ఆవరణలో , ప్రధాన ద్వారం వద్ద బాంబులను అమర్చినట్లు గుర్తించారు. మృతులు ఎంత మంది? గాయపడ్డ వారు ఎందరు? అనేది వెంటనే నిర్ధారణ కాలేదు. చర్చికి సమీపంలో ఉన్న బైక్‌కు పేలుడు పదార్థాలను అమర్చి ఉంచినట్లు, రిమోట్ కంట్రోలుతో అత్యంత వ్యూహాత్మకంగా దీనిని భద్రతా సిబ్బంది దూసుకువస్తున్నప్పుడు పేల్చినట్లు వెల్లడైంది. మొదటి బాంబు పేలుడు తీవ్రతతో చర్చిలోని కిటికీలు తలుపులు పూర్తిగా దెబ్బతిని , వాటి శకలాలు చాలా దూరం వరకూ వచ్చిపడ్డాయి. చర్చి అంతటా గాజు ముక్కలు నెత్తుటితో నిండిపోయింది. దాడి తరువాత కొద్ది గంటల సేపు సెల్‌ఫోన్లు పనిచేయకుండా పొయ్యాయి. దీనితో దాడి సమాచారం వెనువెంటనే పూర్తి స్థాయిలో వెల్లడి కాలేదు. మృతులలో ఏడుగురు సైనికులు కూడా ఉన్నారని, గాయపడ్డ వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. గాయపడ్డ వారిలో 14 మంది సైనికులు, ఇద్దరు పోలీసులు, 61 మంది పౌరులు ఉన్నట్లు వెల్లడైంది. ఘటన తరువాత ఈ ప్రాంతానికి వెళ్లే మార్గాలన్నింటినీ సైనిక బృందాలు మూసివేశాయి. గాయపడ్డ వారిని సైనిక శకటాలలో ఆసుపత్రులకు తరలించారు. కొందరిని సమీపంలోని జంబోంగా నగరానికి హెలీకాప్టర్లలో తరలించారు. భద్రతను కట్టుదిట్టం చేయాలని తాము సైనిక వర్గాలను ఆదేశించినట్లు, ఈ ప్రాంతంలోని అన్ని మత ప్రార్థనా కేంద్రాలకు భద్రత కల్పించాలని సూచించినట్లు రక్షణ శాఖ ఉన్నతాధికారి డెల్ఫిన్ రోడ్రిగో డుటెర్టె మనీలాలో తెలిపారు. దేశంలోని శత్రువులు ఈ విధంగా దొంగదెబ్బలకు దిగుతూ, ప్రభుత్వ సమర్థతను సవాలు చేస్తున్నారని దీనిని తిప్పికొడుతామని, ఉగ్రవాద శక్తులను అణచివేస్తామని స్పష్టం చేశారు.పౌరుల భద్రతకు అన్ని చర్యలూ తీసుకోవడం జరుగుతుందని, దేశ సాయుధ బలగాలు ఇటువంటి సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటాయని, దేవుడు అంటే కూడా భయంలేని ఇటువంటి నేరస్తులను పూర్తిగా అణచివేయడం జరుగుతుందని తెలిపారు.

రాయబారిని తొలగించిన కెనడా ప్రధాని

ఒట్టావా: చైనాలో ఒట్టావా రాయబారి జాన్ మెక్‌కల్లమ్‌ను రాజీనామా చేయమని విజ్ఞప్తిచేశామని, ఆ రాజీనామాను ఆమోదించామని కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడియూ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నదీ ఆ ప్రకటన పేర్కొనలేదు. చైనాలో దిగ్గజ సంస్థ హుయావీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మెంగ్ వాన్‌ఝూకు సంబంధించి జాన్ మెక్‌కల్లమ్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది డిసెంబర్ 1న వాంకూవార్‌లో అరెస్టయిన వాన్‌ఝూను అమెరికాకు అప్పగించాలన్న డిమాండ్ వినబడుతోంది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షల్ని ఉల్లంఘనలతో సంబంధమున్న అక్రమాలకు పాల్పడిందన్న ఆరోపణ ఎదుర్కొంటున్న వాన్‌ఝూ బెయిల్‌పై విడుదలైంది. అయితే ఆమె అరెస్ట్ ఒట్టావా, బీజింగ్ మధ్య దౌత్యపరమైన సంక్షోభానికి దారితీసింది.

29న కిసాన్ కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలో వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం అనుసరించాల్సిన విధానాలపై చర్చించేందుకు ఈ నెల 29న దక్షిణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ సదస్సు నగరంలోని గాంధీభవన్‌లో జరగనుంది. కిసాన్ కాంగెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేశ్‌రెడ్డి ఆదివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా వ్యవసాయ సంక్షోభం ఉందని, కొన్ని రాష్ట్రాల్లో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, వ్యవసాయ రంగంలో ఏ విధాన నిర్ణయాలను తీసుకోవడం ద్వారా పరిష్కారం కనుగొనవచ్చో చర్చించనున్నట్లు తెలిపారు. ఏఐసిసి కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ నానాపటేల్‌తో పాటు కర్నాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ ప్రతినిధులు హాజరు అవుతారని తెలిపారు. సదస్సులో పార్లమెంట్ ఎన్నికల్లో వ్యవసాయ విధానాలు, ప్రతిపాదనలపై కూడా చర్చ ఉంటుందన్నారు. టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, ఏపి పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డిలతో పాటు కార్య నిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని కోదండరెడ్డి చెప్పారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్

ఢిల్లీ, వారణాసి మధ్య తిరిగే ట్రైన్-18కి నామకరణం



న్యూఢిల్లీ : ఢిల్లీ – వారణాసి మధ్య త్వరలో పరుగులు తీసే ట్రైన్ 18 స్పీడ్ రైలుకు ' వందే భారత్ ఎక్స్‌ప్రెస్' అని పిలుస్తారు. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం ఇక్కడ తెలిపారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో సంపూర్ణ స్వదేశీ పరిజ్ఞానంతో దీనిని రూపొందించారు. గంటలకు 160 కిలోమీటర్ల వేగంతో వెళ్లే ఈ రైలు గరిష్ట వేగం గంటకు 180 కిలోమీటర్లు. మార్గమధ్యంలో కేవలం కాన్పూర్, అలహాబాద్‌లలో కొద్ది సేపు ఆగుతుంది. ఇది శరవేగపు ట్రైన్ కాకుండా సెమీఫాస్ట్ ట్రైన్‌గా ఉంటుంది. దీనిని 18 నెలల కాలంలో రూ 97 కోట్ల వ్యయంతో తయారు చేశారు. దేశ రాజధానికి దేశ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వారణాసికి మధ్య నడిచే ఈ రైలుతో ప్రయాణ కాలంతగ్గుతుంది. ఈ రైలు ప్రారంభ తేదిని ఇంకా నిర్ణయించలేదని మంత్రి పీయూష్ చెప్పారు. 30 ఏళ్లుగా ఉన్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ స్థానంలో ఈ నూతన రైలు పట్టాలకు చేరుతుంది. తొలుత ఈ రైలుకు ట్రైన్ 18 అని పేరు పెట్టారని, అయితే ప్రజానీకం నుంచి విశేష రీతిలో అందిన సూచనలతో ఇప్పుడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ పేరు పెట్టినట్లు తెలిపారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో, భారతీయ ఇంజినీర్ల నైపుణ్యంతో దీనిని రూపొందించినట్లు తెలిపారు. మేకిన్ ఇండియాలో భాగంగా దేశంలోనే ప్రపంచ స్థాయి అత్యుత్తమ శ్రేణి రైళ్లను తయారుచేసేందుకు రంగం సిద్ధం అవుతోందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ రైలు పూర్తి ఎయిర్‌కండిషన్‌తో ఉంటుంది. రెండు ఎక్సిక్యూటివ్ ఛెయిర్ కార్స్ ఉంటాయని మంత్రి వివరించారు. అత్యంత అధునాతన సౌకర్యాలు ఉంటాయని, ప్రామాణిక ఎయిర్ సస్పెన్షన్‌తో సుఖవంతమైన ప్రయాణానికి వీలేర్పడుతుందని చెప్పారు. దేశ 70వ గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో దేశ ప్రజలకు ఈ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కానుక అని కదిలే కానుక అని చమత్కరించారు. ప్రధాని నరేంద్ర మోడీ స్వ నియోజకవర్గం వారణాసి వరకూ ఈ రైలు వెళ్లుతుంది.

శతాబ్ధితో పోలిస్తే 50 శాతం ఎక్కువ ఛార్జీలు

ఈ రైలు అంతా బాగానే ఉంటుంది కానీ ఇంతకు ముందటి శతాబ్ధి రైళ్లతో పోలిస్తే ప్రయాణికులు ఎక్కువ డబ్బులు చెల్లించుకోవల్సిందే. ఈ రైలులో 40 నుంచి 50 శాతం అదనంగా ఛార్జీలు వసూలు చేస్తారని తెలిసింది. ఎగ్జిక్యూటివ్ క్లాస్ ఛార్జీలు రూ 2800 నుంచి రూ 2900 మధ్యలో ఉంటాయి. ఇక ఛైర్ కార్‌లో రూ 1600 నుంచి రూ 1700 వరకూ ఉంటుంది. ఈ రైలు భద్రతా నిర్మాణ ప్రమాణాలను అన్ని స్థాయిలలో పలు దఫాలుగా పరీక్షించారు. పలు సార్లు ట్రైన్ 18 నిర్ణీత మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రధాని మోడీ వచ్చే వారం ఈ రైలును ప్రారంభిస్తారని భావిస్తున్నారు. అయితే కేంద్ర బడ్జెట్ తరువాతనే దీనిని ప్రారంభించేందుకు వీలుంటుందని ప్రధాన మంత్రి కార్యాలయ వర్గాలు స్పష్టం చేసినట్లు వెల్లడైంది. నమూనా ప్రయాణం దశలో ఈ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకువెళ్లింది. ఢిల్లీ నుంచి వారణాసి మధ్య దూరం 682 కిలోమీటర్లు. ఇప్పుడున్న రైళ్లలో నిర్ణీత ప్రయాణానికి 12 గంటలకు పైగా సమయంపడుతోంది. సరికొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రాకతో కేవలం ఆరుగంటల్లోనే లక్ష్యం చేరుకోవచ్చునని భావిస్తున్నారు. డిసెంబర్ చివరిలోనే ఈ రైలు ప్రారంభానికి యత్నించారు. అయితే పూర్తి స్థాయిలో ట్రయల్ రన్ తరువాతనే తగు సమయం కోసం కార్యక్రమం వాయిదా పడుతూ వచ్చింది.

ప్రతి హైకోర్టు జడ్జికి 4,500 పెండింగ్ కేసులు



న్యూఢిల్లీ: దేశంలో ప్రతి హైకోర్టు జడ్జి దాదాపు 4,500 కేసుల భారాన్ని మోస్తున్నారని న్యాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇకపోతే, సబార్డినేట్ కోర్టుల్లో ప్రతి జడ్జికి దాదాపు 1,500 కేసులున్నాయని కూడా మంత్రిత్వశాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. హైకోర్టులు, దిగువ కోర్టుల్లో పెండింగ్ కేసుల సగటును అంచనావేసిన తర్వాత ప్రతి జడ్జిపైన పడే కేసుల భారాన్ని మంత్రిత్వశాఖ లెక్క కట్టింది. నేషనల్ జ్యుడీషియల్ డాటా గ్రిడ్ ప్రకారం 2018 చివరి నాటికి జిల్లా కోర్టులు, సబార్డినేట్ కోర్టుల్లో 2.91 కోట్ల కేసులు, 24 హైకోర్టుల్లో 47.68 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జనవరి 1నుంచి తెలంగాణకు సొంత హైకోర్టు రావడంతో దేశంలో హైకోర్టుల సంఖ్య 25కు పెరిగింది. ప్రస్తుతం అన్ని సబార్డినేట్ కోర్టుల్లో కలిపి మంజూరు చేసిన జడ్జీల సంఖ్య 22,644 కాగా, పనిచేసేవారి సంఖ్య17,509. ఇంకా 5,135మంది న్యాయాధికారుల కొరత ఉంది. అలాగే హైకోర్టులకు మంజూరు చేసిన జడ్జీలు1,079 కాగా, వర్కింగ్‌స్టాఫ్ 695. ఇంకా 384 మంది జడ్జీలను నియమించాల్సి ఉంది. దిగువ కోర్టుల్లో ఖాళీలను నింపవలసిందిగా ప్రతి న్యాయశాఖామంత్రి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కోరుతూ వస్తున్నారు. దిగువ కోర్టుల్లో జడ్జిల నియామకాలను వేగవంతం చేయమని ఇటీవల కేంద్ర న్యాయశాఖామంత్రి రవిశంకర్ ప్రసాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల్ని కోరారు.


బడ్జెట్ భేటీకి సిద్ధం

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31వ తేదీ గురువారం నుంచి ఆరంభం అవుతున్నాయి. దీనికి సంబంధించి లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, రాజ్యసభ అధ్యక్షులు ఎం వెంకయ్య నాయుడు వేర్వేరుగా కార్యాచరణకు దిగారు. ఈసారి బడ్జెట్ సమావేశాలు అధికార ఎన్‌డిఎకు అత్యంత కీలకం అయినవి. ప్రత్యేకించి లోక్‌సభ ఎన్నికలకు ముందు నిర్వహించే తుది విడత పార్లమెంట్ సెషన్ ఇదేనని భావిస్తున్నారు. ఈ నెల 30వ తేదీన అఖిలపక్ష భేటీకి వివిధ రాజకీయ పార్టీల నేతలను లోక్‌సభ స్పీకర్ ఆహ్వానించినట్లు ఆదివారం అధికార వర్గాలు తెలిపాయి. ఇక మరుసటి రోజు అంటే సెషన్ ప్రారంభం నాడే వివిధ పార్టీలతో రాజ్యసభ అధ్యక్షులు వెంకయ్యనాయుడు ఉదయమే సమావేశం అవుతారు. ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ సమర్పణ ఉంటుంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అమెరికాలో చికిత్స పొందేందుకు సెలవుపై వెళ్లారు. దీనితో అత్యంత కీలకమైన కేంద్ర బడ్జెట్‌ను ఈ దఫా రైల్వే మంత్రి పీయూష్ గోయల్ సభకు ప్రవేశపెడుతారు. ఇది ఓటాన్ అకౌంట్ గా ఉంటుందని విశ్లేషించారు. అయితే ఎన్నికల పంవత్సరం అయినప్పటికీ పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టవచ్చునని బిజెపి వర్గాలు తెలిపాయి. ఎన్నికలలో సరైన ఫలితాలను రాబట్టుకునేందుకు మోడీ ప్రభుత్వం ఈ సారి బడ్జెట్‌లో పలు ఆకర్షక పథకాలకు దిగుతారని వెల్లడైంది. ప్రత్యేకించి రైతాంగానికి వ్యవసాయ సాయానికి భారీ స్థాయి నిధులు, పలు వర్గాలకు పథకాల ప్రకటనలు ఉంటాయని భావిస్తున్నారు. సభలు సజావుగా సాగేందుకు అన్ని పక్షాలూ సహకరించాలని కోరుతూ సభాధ్యక్షులు వివిధ ప్రతిపక్ష నేతలకు లాంఛనంగా లేఖలు రాశాయి. ఇక ప్రభుత్వం కూడా ఉభయ సభలకు చెందిన పార్టీల నేతలను అఖిల పక్ష భేటీకి ఆహ్వానించనుంది. ఈ నెల 30వ తేదీన ఈ సమావేశం ఉంటుందని భావిస్తున్నారు. దీనికి ప్రధాని మోడీ కూడా హాజరవుతారు. ఈ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13వరకూ నిర్వహిస్తారని అధికార వర్గాలు ధృవీకరించాయి. ఈ సారి సభలను తమతమ రాజకీయ ప్రయోజనాలకు అనువుగా మలుచుకోవాలని అటు అధికార పక్షం ఇటు ప్రతిపక్షం సంకల్పించడంతో ఇప్పుడు కూడా ఈ సమావేశాలు పోటాపోటీగానే ఉంటాయని వెల్లడయింది.

అఖిలపక్ష సమావేశాలు



జెన్‌కోలో 6నెలల పాటు సమ్మె నిషేధం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టిఎస్ జెన్‌కో)లో సమ్మెను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 29వ తేదీ మొదలు రాన్నున ఆరు నెలల పాటు జెన్‌కోలోని ఏ విభాగంలోనూ సమ్మెలు జరగడానికి వీలు లేకుండా రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా శుక్రవారం ఈ ఉత్తర్వులను జారీచేశారు. గతేడాది జూలైలో ఉత్తర్వులు జారీ చేసిన అజయ్‌మిశ్రా ఆరు నెలల పాటు సమ్మెలను నిషేధించారు. ఆ గడువు జనవరి 28వ తేదీతో ముగుస్తున్నందున మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జెన్‌కో లోని అన్ని విభాగాల్లో ఇది అమలులో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలతో సంబంధం కలిగిన జెన్‌కోలో సమ్మెల కారణంగా విధులకు ఆటంకం కలిగే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంది. తెలంగాణ 'ఎస్మా' (ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనాన్స్ చట్టం' లోని సెక్షన్ 3 (1), (3) ప్రకారం ఈ ఏడాది జూలై వరకు ఆరు నెలల పాటు సమ్మెలను నిషేధించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో అజయ్‌మిశ్రా పేర్కొన్నారు.

బ్రెజిల్ ఆనకట్ట ఘటనలో వందలలో మృతులు?

ఇప్పటికి 40 మృతదేహాలు లభ్యం




బ్రుమాడినో : బ్రెజిల్‌లో గని వద్ద ఆనకట్ట కూప్పకూలిన ఘటన దేశంలో అత్యంత విషాదాన్ని నింపింది. వందలాది మంది ఈ దుర్ఘటనలో దుర్మరణం చెంది ఉంటారని ఆదివారం వెలువడ్డ వార్తలతో స్పష్టం అయింది. ఆదివారం మరికొన్ని మృతదేహాలను బురద నీటిలో నుంచి వెలికితీశారు. దీనితోఇప్పటివరకూ మృతుల సంఖ్య40 వరకూ చేరుకున్నట్లు నిర్ధారణ అయింది. ఈ ప్రాంతంలోని వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు ప్రమాద హెచ్చరికలు వెలువరించారు. గని ప్రాంతాన్ని ఆవలి వైపున ఉన్న నది నుంచి వేరుచేసేందుకు ఈ ప్రాంతంలో చాలా కాలం క్రితం ఆనకట్టను నిర్మించారు. అయితే ఆనకట్ట కుప్పకూలడం, నీరు ఉధృత రీతిలో సమీపంలోని గని సంబంధిత భవనాలలోకి చేరుకోవడం, అందులో వందలాది మంది ఉండటం ఇప్పటివరకూ వారు ఏమయ్యారనేది వెల్లడి కాకపోవడంతో ఆందోళన తీవ్రం అయింది. వందలాది మంది ఈ ఘటనలో కొట్టుకుపోయి ఉంటారని భయపడుతున్నారు. ఆనకట్టలో అధిక నీటి మట్టం ఉండటం దీని నుంచి ఉధృతంగా పల్లపు ప్రాంతాలలోకి నీరు దూసుకురావడంతో మృతుల సంఖ్య వందలలోనే ఉంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఇప్పటికీ గాలింపు చర్యలు చేపడుతున్నట్లు, ఈ ప్రాంతంలో బురద మేటలను తొలిగించడం కష్టంగా మారిందని తెలిపారు. దక్షిణ బ్రెజిల్ లోని ఫియిజావో మైనింగ్ కాంప్లెక్స్ వద్ద ఆనకట్ట కూలడంతో ఈ దరిదాపులలోని వారంతా సురక్షిత ప్రాంతాలతకు తరలివెళ్లాలని ప్రమాద హెచ్చరికలు వెలువరించారు. దీనితో గని సమీపంలోని పట్టణంలోని దాదాపు 40 వేల మందిలో ఆందోళన నెలకొంది.ప్రమాద స్థలికి బ్రెజిల్ అధ్యక్షులు జైర్ బోలస్సోనరో హుటాహుటిన చేరుకున్నారు. వెనువెంటనే ఈ ఘటనపై తానేమీ స్పందించలేనని, ఉద్వేగంతో కాకుండా కార్యాచరణతో ముందుగా సహాయక చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రాంతంలో సహాయక చర్యలను హెలీకాప్టర్లను రంగంలోకి దింపారు. గనుల చుట్టుపక్కల పేరుకుపోయిన బురద నీటిలో పీకలలోతు వరకూ చిక్కుకుని పలువురు అలమటిస్తున్నట్లు , కొందరు ఎత్తైన ప్రాంతాలలో ఆశ్రయం పొందినట్లు అధికారులు తెలిపారు.



ఆదివారం కుంభమేళాలో పవిత్ర స్నానాలు సిద్ధంగా ఉన్న నవతరం నాగా సాధువులు

హైదరాబాద్... చూసిన కొద్దీ చరిత్ర

పురాతత్వవేత్త పద్మశ్రీ మహమ్మద్



న్యూఢిల్లీ/హైదరాబాద్ : అందరినీ తనలో ఇముడ్చుకునే తత్వంతో విలసిల్లే హైదరాబాద్‌కు విశిష్టత ఉందని పురాతత్వవేత్త కెకె మెహమ్మద్ చెప్పారు. గణతంత్ర దినోత్సవ తరుణంలో ఆయనకు పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకున్నారు. నగరంలో ఆరంభం అయిన హైదరాబాద్ సాహిత్య ఉత్సవంలో పాల్గొనేందుకు ఆయన హైదరాబాద్ వచ్చారు. ఆర్కియాలజీకి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ ఏటి పద్మశ్రీ అవార్డు వచ్చింది. దక్కని మణికర్ణిక వంటి హైదరాబాద్‌తో ఆయనకు గత అనుబంధం ఉంది. కొంతకాలం ఆయన ఇక్కడి ఆగాఖాన్ ట్రస్టులో విశేష బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ నగరానికి ఘనమైన పురాతత్వ ప్రాశస్త్యం ఉందని, ఘనమైన గత చరిత్ర ఈ నగరానికి వన్నె తెచ్చిందని తెలిపారు. ఈ దక్కనీ పీఠభూమిలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ఈ ప్రాంతానికి ఇది కీలకమైన స్థావరం, అంతేకాకుండా ప్రాచీన పురాతత్వ విశేషాలను వెలికితీయాలనుకునే వారికి ఇది కలల పంట అని కితాబు ఇచ్చారు. ఆర్కియాలాజిస్టు సర్వే ఆఫ్ ఇండియాలో కీలక బాధ్యతలు నిర్వర్తించి ఆయన రిటైర్ అయ్యారు. హైదరాబాద్ గురించి అందరికీ తెలిసింది చాలా తక్కువేనని, అయితే దీని గురించి ఇంకా తెలుసుకోవల్సింది ఎంతో ఎంతో ఉందని చెప్పారు. హైదరాబాద్ చరిత్ర విశిష్టమైనది, దీని గురించి ఎంతో చెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏ ప్రాంతంలో నివసించే వారికైనా ఆ ప్రాంతపు వారసత్వ వైభవం గురించి తెలియాల్సి ఉంది. దాని గురించి తెలుసుకోవాలనే తపన వారిలో ఉండాలని కోరారు. కేవలం అధ్యయన సంస్థలలతోనే చరిత్ర వెలికితీత సాధ్యం కాదు. అదే విధంగా అత్యంత పురాతన కట్టడాల , చరిత్ర పుటల్లోకి రాని స్థలాల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల చర్యలతోనే వీలు కాదని ఆయన స్పష్టం చేశారు. తమ ఉనికికి ప్రాతిపదికగా నిలిచే ప్రాంతపు చరిత్ర అన్వేషణలో స్థానికుల కీలక పాత్ర ఉంటుంది. వారు దీనిని ఉద్యమంగా భావించాల్సి ఉంటుంది. ఇక ప్రైవేటు సంస్థలు ఆ ప్రాంతాలలో కేవలం తమ వ్యాపార విస్తరణలకు పాల్పడటంతోనే సరి పెట్టుకోరాదని, వారు కూడా చరిత్ర అన్వేషణలో అంతకు మించి పురాతత్వ పరిశోధనలలో తమ వంతు సాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్పోరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రైవేటు సంస్థలు చారిత్రక కట్టడాల పారిశుద్ధ్యానికి చర్యలు తీసుకుంటున్నాయి. అయితే ప్రామాణిక నిర్వహణలో ఉన్న వాటి గురించే ఈ సంస్థలు పట్టించుకుంటున్నాయి. అంతేకానీ నిర్లక్ష్యానికి గురి అవుతున్న వాటి గురించి వారి దృష్టికి రావడం లేదు. దీనితో వీరి సామాజిక బాధ్యత పరిధిలోకి కుప్పకూలిపొయ్యే దశలోని కట్టడాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు కుంభమేళాలో యుపి కేబినెట్ భేటీ

లక్నో: కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్ మంత్రివర్గం ఈనెల 29న అలహాబాద్‌లో సమావేశమవుతుందని ఒక అధికారి ఆదివారం చెప్పారు. ఇక్కడ కేబినెట్ మీటింగ్ జరగడం ఇదే మొదటిసారి అవుతుంది. సమావేశం తర్వాత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఇతర మంత్రులు త్రివేణీ సంగమంలో పవిత్ర జలాల్లో స్నానం చేయవచ్చని ఆయన తెలిపారు. 'కుంభమేళా ప్రాంతంలో ఇంటెగ్రేటెడ్ కమాండ్, కంట్రోల్ సెంటర్‌లో జనవరి 29న ఉత్తరప్రదేశ్ మంత్రివర్గం సమావేశం జరుగుతుంది. అది ఉదయం పదిన్నరకు ప్రారంభం కావచ్చు' అని అడిషనల్ చీఫ్ సెక్రెటరీ అవానిష్ అవస్థి తెలిపారు. యోగి ఆదిత్యనాథ్ తన మంత్రులతో కలిసి అక్షయ్‌వత్, సరస్వతీ కూప్‌లను సందర్శిస్తారు.



చాంపియన్ సైనా నెహ్వాల్

జకార్తా: భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ప్రతిష్టాత్మకమైన ఇండోనేసియా మాస్టర్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో స్పెయిన్ క్రీడాకారిణి కరోలినా మారిన్ గాయం వల్ల అర్ధాంతరంగా తప్పుకోవడంతో సైనాకు టైటిల్ లభించింది. ఒక దశలో 7–2 ఆధిక్యంలో నిలిచిన మారిన్ గాయం వల్ల మైదానంలో కుప్పకూలింది. దీంతో మారిన్‌కు ప్రాథమికి చికిత్స చేశారు. చికిత్స తర్వాత మారిన్ మళ్లీ ఆటను ప్రారంభించింది. అయితే మరో రెండు పాయింట్లు సాధించిన తర్వాత గాయం మరోసారి తిరగబడింది. ఈసారి ప్రాథమికి చికిత్స చేసినా ఫలితం లేకుండా పోయింది. నొప్పితో విలవిల్లాడిన మారిన్ ఆట నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో నిర్వాహకులు భారత స్టార్ సైనాను విజేతగా ప్రకటించారు. సైనా పూర్తి మ్యాచ్ ఆడకుండానే టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ ఏడాది జరిగిన మలేసియా ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో మారిన్ చేతిలో సైనా సెమీస్‌లోనే ఓటమి పాలైంది. ఈసారి కూడా మారిన్ ఆధిపత్యం చెలాయించినా గాయం వల్ల మధ్యలోనే ఆట నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. దీంతో సైనాకు టైటిల్ వరించింది. ఈ ఏడాది సైనాకు ఇదే తొలి టైటిల్ కావడం విశేషం. కాగా, ఈ టోర్నీలో మరో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి పి.వి.సింధు క్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. మారిన్ చేతిలోనే సింధు ఓటమి పాలైంది. అయితే ఫైనల్లో మాత్రం గాయం వల్ల మారిన్‌కు చేదు అనుభవమే మిగిలింది.

చరిత్ర సృష్టించిన జకోవిచ్



ఫైనల్లో నాదల్ చిత్తు, నొవాక్‌కు ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో సెర్బియా యోధుడు, టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ విజేతగా నిలిచాడు. ఆదివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో జకోవిచ్ 6–3. 6–2, 6–3 తేడాతో చిరకాల ప్రత్యర్థి, రెండో సీడ్, స్పెయిన్‌బుల్ రఫెల్ నాదల్‌ను చిత్తు చేశాడు. ఈ క్రమంలో ఏడో ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ సాధించి జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు ఆరేసి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్స్ గెలిచిన దిగ్గజాలు రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా) రికార్డును బద్దలు కొట్టాడు. అంతేగాక ప్రపంచ పురుషుల టెన్నిస్ అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన మూడో ఆటగాడిగా అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇంతకు ముందు పీట్ సాంప్రస్ పేరిట ఉన్న 14 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ రికార్డును జకోవిచ్ తిరగరాశాడు. ప్రస్తుతం జకోవిచ్ కంటే ఇద్దకు మాత్రమే అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన వారు ఉన్నారు. స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, స్పెయిన్ స్టార్ నాదల్ 17 టైటిల్స్‌తో రెండో స్థానంలో నిలిచాడు. జకోవిచ్ వీరిద్దరి తర్వాత మూడో స్థానంలో ఉన్నాడు. ఇక, జకోవిచ్‌కు ఇది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం. కిందటి ఏడాది జకోవిచ్ వింబుల్డన్, అమెరికా ఓపెన్ టైటిల్స్‌ను సాధించాడు. తాజాగా ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్‌లోనూ గెలిచి హ్యాట్రిక్ టైటిల్స్ తన ఖాతాలో వేసుకున్నాడు.



ప్రారంభం నుంచే..

నాదల్‌తో జరిగిన ఫైనల్లో జకోవిచ్ ప్రారంభం నుంచే ఆధిపత్యం చెలాయించాడు. చూడచక్కని ఆటతో నాదల్‌ను హడలెత్తించాడు. ఫైనల్ చేరే క్రమంలో అద్భుతంగా ఆడిన నాదల్ ఈసారి మాత్రం ఆ జోరును కొనసాగించలేక పోయాడు. జకోవిచ్ దూకుడు ముందు ఎదురు నిలువలేక పోయాడు. తనకు మాత్రమే సాధ్యమయ్యే ప్రత్యేక షాట్లతో జకోవిచ్ చెలరేగి పోయాడు. నాదల్ కనీస ప్రతిఘటన కూడా ఇవ్వడంలో విఫలమయ్యాడు. దిగ్గజాల మధ్య పోరు నువ్వా నేనా అన్నట్టు సాగడం ఖాయమని భావించిన అభిమానులకు నిరాశే మిగిలింది. జకోవిచ్ ప్రారంభం నుంచే అసాధారణ ఆటతో చెలరేగి పోయాడు. అతని దూకుడు ముందు స్పెయిన్‌బుల్ నాదల్ తేలి పోయాడు. కళ్లు చెదిరే షాట్లతో విరుచుకు పడిన జకోవిచ్ అలవోకగా తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. తర్వాతి సెట్‌లలో కూడా జకోవిచ్ అదే జోరును కొనసాగించాడు. అద్భుత షాట్లతో అలరించిన జకోవిచ్ మరో రెండు సెట్లను గెలిచి టైటిల్‌ను దక్కించుకున్నాడు.

హోబర్ట్ జోడీకి డబుల్స్ టైటిల్స్

ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను ఫ్రాన్స్‌కు చెందిన ఐదో సీడ్ నికోలస్ మహూత్, హోబర్ట్ జోడీ కైవసం చేసుకుంది. ఆదివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో మహూత్ జోడీ 6–4, 7–6 తేడాతో హెన్రీ కొంటెనన్ (ఫిన్లాండ్), జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జంటను ఓడించింది. రారంభం నుంచే ఫ్రాన్స్ జోడీ ఆధిపత్యం చెలాయించింది. చూడచక్కని ఆటతో అలరించిన ఫ్రాన్స్ జంట అలవోకగా తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి కాస్త పోటీ ఎదురైనా చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుంటూ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మరోవైపు పీర్స్ జంట గట్టి పోటీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. చివరికి రన్నరప్‌తో సరిపెట్టుకోక తప్పలేదు.





సిరీస్‌పై భారత్ కన్ను

కివీస్‌కు చావోరేవో

నేడు మూడో వన్డే

మౌంట్ మాంగనుయ్: వరుస విజయాలతో జోరుమీదున్న టీమిండియా సిరీస్‌పై కన్నేసింది. సోమవారం జరిగే మూడో వన్డేలోనూ న్యూజిలాండ్‌ను ఓడించి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని తహతహలాడుతోంది. ఇక, ఇప్పటికే రెండు వన్డేల్లో ఓటమి పాలైన ఆతిథ్య కివీస్ జట్టుకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాల్సిందే. ఇందులో ఓడితే సిరీస్ కోల్పోక తప్పదు. దీంతో కివీస్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఒత్తిడిని తట్టుకుని భారత్‌ను ఓడించడం అంత తేలిక కాదనే చెప్పాలి. మరోవైపు భారత్ మాత్రం వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచ జోరుమీదుంది. మూడో వన్డేలో కూడా ఇదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు కొదవలేదు. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో టీమిండియా దుర్భేధ్యేయంగా కనిపిస్తోంది. ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు భీకర ఫామ్‌లో ఉన్నారు. ధావన్ వరుసగా రెండు మ్యాచుల్లోనూ అర్ధ సెంచరీలు సాధించి సత్తా చాటాడు. రెండో వన్డేలో రోహిత్ కూడా భారీ ఇన్నింగ్స్ ఆడాడు. తొలి రెండు మ్యాచుల్లో శుభారంభం అందించిన రోహిత్, ధావన్‌లు ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని భావిస్తున్నారు. ఇదే జరిగితే కివీస్ బౌలర్లకు మరోసారి ఇబ్బందికర పరిస్థితులు తప్పక పోవచ్చు.

జోరుమీదున్నారు..

తొలి రెండు మ్యాచుల్లో కూడా భారత బ్యాట్స్‌మెన్ కదం తొక్కారు. తొలి వన్డేలో ధావన్, కోహ్లిలు అద్భుతంగా ఆడారు. రెండో మ్యాచ్‌లో కూడా వీరిద్దరూ అదే జోరును కొనసాగించారు. తాజాగా రెండో వన్డేలో రోహిత్ కూడా మెరుపులు మెరిపించాడు. వీరికి తోడుగా అంబటి రాయుడు, మహేంద్ర సింగ్ ధోని, కేదార్ జాదవ్‌లు అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచారు. ఇలా టాప్ ఆర్డర్ అంతా జోరుమీదుండడంతో రెండో భారత్ భారీ స్కోరును సాధించింది. ఈ మ్యాచ్‌లో కూడా ఇలాంటి ప్రదర్శనే ఇవ్వాలని భావిస్తోంది. ఆసీస్ సిరీస్‌లో నిలకడగా రాణించిన ధోని కివీస్‌పై ఆడిన తొలి మ్యాచ్‌లోనే చెలరేగి పోయాడు. రానున్న మ్యాచుల్లో కూడా మెరుపులు మెరిపించాలని తహతహలాడుతున్నాడు.

ఎదురేలేదు..

ఇక, బౌలింగ్‌లో అయితే భారత్‌కు ఎదురే లేకుండా పోయింది. రెండు మ్యాచుల్లోనూ కివీస్‌కు తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో భారత బౌలర్లు సఫలమయ్యారు. స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్‌లు రెండు మ్యాచుల్లోనూ సత్తా చాటారు. కుల్దీప్ అయితే రెండు మ్యాచుల్లో కూడా నాలుగేసి వికెట్లు పడగొట్టాడు. చాహల్ కూడా కీలక సమయంలో వికెట్లు తీస్తూ జట్టుకు అండగా నిలుస్తున్నాడు. స్పీడ్‌స్టర్లు మహ్మద్ షమీ, భువనేశ్వర్‌లు కూడా జోరుమీదున్నారు. ఈ మ్యాచ్‌లో కూడా చెలరేగాలనే పట్టుదలతో బౌలర్లు ఉన్నారు. ఇదే జరిగితే కివీస్‌ను మరోసారి తక్కువ స్కోరుకే పరిమితం చేయడం భారత్‌కు కష్టం కాదు.

గెలవాల్సిందే..

మరోవైపు ఆతిథ్య న్యూజిలాండ్ జట్టుకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. సిరీస్ అవకాశాలు సజీవంగా ఉంచుకోవాలంటే మూడో వన్డేలో తప్పక గెలవాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో కివీస్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. బ్యాటింగ్, బౌలింగ్ వైఫల్యం జట్టును వెంటాడుతోంది. రెండు మ్యాచుల్లో కూడా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. తొలి వన్డేలో కెప్టెన్ విలియమ్సన్, రెండో వన్డేలో బ్రేస్‌వెల్ మాత్రమే అర్ధ సెంచరీలు సాధించారు. ఓపెనర్లు గుప్టిల్, మన్రోలు శుభారభం అందించడంలో విఫలమవుతున్నారు. ఇది జట్టుపై తీవ్ర ప్రభావాన్నే చూపుతోంది. కీలకమైన ఈ మ్యాచ్‌లోనైనా బ్యాటింగ్ గాడిలో పడాల్సిన అవసరం ఉంది. లేకుంటే కివీస్‌కు మరో ఓటమి ఖాయమనే చెప్పాలి. అంతేగాక బౌలింగ్‌లో కూడా కివీస్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. కీలక బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకుంటున్నారు. వీరి వైఫల్యం జట్టుకు ప్రధాన సమస్యగా మారింది. ఈ మ్యాచ్‌లో బౌలర్లు మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే భారత్‌ను సిరీస్ గెలవడకుండా ఆపడడం దాదాపు అసాధ్యమే.



విండీస్ చేతిలో ఇంగ్లండ్ చిత్తు

బ్రిడ్జ్‌టౌన్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆతిథ్య వెస్టిండీస్ జట్టు 381 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. వరుస ఓటములతో దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్లాడుతున్న విండీస్ అగ్రశ్రేణి జట్టు ఇంగ్లండ్‌పై భారీ విజయం సాధించి ఆత్మ విశ్వాసాన్ని రెట్టింపు చేసుకుంది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్ తొలి మ్యాచ్‌లోనే చిత్తుగా ఓడిపోవడం విశేషం. అసాధారణ పోరాట పటిమను కనబరిచిన విండీస్ నాలుగో రోజే మ్యాచ్‌ను సొంతం చేసుకుని ప్రపంచ క్రికెట్‌లో పెను ప్రకంపనలు సృష్టించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విండీస్ 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. 628 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లండ్ 246 పరుగులకే కుప్పకూలింది. నాలుగో రోజు ఇంగ్లండ్ ఓ దశలో బాగానే ఆడింది. విండీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగింది. ఇంగ్లండ్ ఆటను చూస్తుంటే మ్యాచ్ డ్రా దిశగా సాగుతుందని అనిపించింది. కానీ, విండీస్ బౌలర్ రోస్టన్ ఛేజ్ అసాధారణ బౌలింగ్‌తో ఇంగ్లండ్ బ్యాటింగ్ పతనాన్ని శాసించాడు. ఆఫ్ బ్రేక్ బౌలర్ అయిన ఛేజ్ ఏకంగా ఎనిమిది వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ఛేజ్ ధాటికి ఇంగ్లండ్ కుదేలైంది. చివరి 246 పరుగులకే కుప్పకూలి అవమానకర ఓటమిని చవిచూసింది. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 289 పరుగులు చేసింది. కాగా, ఇంగ్లండ్ 77 పరుగులకే కుప్పకూలింది. విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల నష్టానికి 415 పరుగులు చేసింది. కెప్టెన్ జాసన్ హోల్డర్ డబుల్ సెంచరీతో విండీస్‌కు భారీ స్కోరు అందించాడు.



సర్ఫరాజ్‌పై వేటు

దుబాయి: అనుకున్నట్టే పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) నిషేధం విధించింది. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఆండిల్ పెహ్లువాకియాపై వర్ణ వివక్ష వ్యాఖ్యాలు చేసిన సర్ఫరాజ్‌పై ఐసిసి నాలుగు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది. దీంతో సర్ఫరాజ్ దక్షిణాఫ్రికాతో జరిగే చివరి రెండు వన్డేలు, మరో రెండు టి–20 మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. సర్ఫరాజ్‌పై వేటు పడడంతో పాకిస్థాన్ జట్టు తాత్కాలిక కెప్టెన్‌గా వెటరన్ క్రికెటర్ షోయబ్ మాలిక్ వ్యవహరిస్తాడు. ఇటీవల దర్బన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో సర్ఫరాజ్ ప్రత్యర్థి క్రికెటర్ పెహ్లువాకియాపై వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేశాడు. ఈ విషయంపై సౌతాఫ్రికా ఆటగాళ్లు ఫిర్యాదు చేయకున్నా ఐసిసి స్వాతంత్రంగా దర్యాప్తును చేపట్టింది. విచారణలో సర్ఫరాజ్ దోషిగా తేలడంతో అతనిపై నాలుగు మ్యాచ్‌ల నిషేధాన్ని విధిస్తూ ఐసిసి నిర్ణయం తీసుకుంది. ఆ మ్యాచ్‌లో సర్ఫరాజ్ ప్రత్యర్థి క్రికెటర్ పెహ్లువాకియాపై అసభ్యకర వ్యాఖ్యలు చేశాడు. ఏ నల్లోడా.. మీ అమ్మ ఎక్కడ కూర్చుంది..నీకు ఏం కావాలని ఆమెను ప్రార్థించమన్నావ్? అంటూ సర్ఫరాజ్ వ్యాఖ్యానించాడు. ఈ మాటలు స్టంప్స్ మైక్‌లో రికార్డయ్యాయి. దీనిపై విచారణ చేపట్టిన ఐసిసి సర్ఫరాజ్‌పై కఠిన చర్యలు తీసుకుంది.





పాకిస్థాన్ జయకేతనం

జోహెన్నస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో వన్డేలో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 41 ఓవర్లలో 164 పరుగులకే కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 31.3 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ ఇమామ్‌ల్ హక్ అద్భుత బ్యాటింగ్‌తో పాక్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన హక్ ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో 71 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ ఫకర్ జమాన్‌తో కలిసి తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించాడు. ఫకర్ జమాన్ ఏడు ఫోర్లతో 44 పరుగులు సాధించాడు. మరోవైపు బాబర్ ఆజమ్ 41 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో పాక్ ఘన విజయం సాధించింది. అంతకుముందు సౌతాఫ్రికా జట్టు తక్కువ స్కోరుకే కుప్పకూలింది. జట్టులో ఇద్దరు మాత్రమే కాస్త రాణించారు. ఓపెనర్ డికాక్ ఏడు ఫోర్లతో 59 పరుగులు చేశాడు. మరోవైపు కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన డుప్లెసిస్ 57 పరుగులు చేశాడు. పాక్ బౌలర్లలో ఉస్మాన్ ఖాన్ నాలుగు వికెట్లు తీశాడు. షాహిన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఈ విజయంతో పాకిస్థాన్ సిరీస్‌ను 2–2తో సమం చేసింది.

ప్రముఖ సంగీత విద్వాంసుడు, సినీ నిర్మాత దివంగత భూపేన్ హజారికాకు ప్రభుత్వం భారత రత్న ఇవ్వాలని నిర్ణయించడం మానవత్వం, వైవిధ్య విజయమని ఆయన తనయుడు తేజ్ హజారికా అభివర్ణించారు. తన తండ్రి పాటల్లో భారత దేశ యువత, భవిష్యత్ నమూనా(బ్లూప్రింట్)ను చూడవచ్చని అమెరికా నుంచి తేజ్ మెయిల్ పంపారు. ఈశాన్య రాష్ట్రాల్లోనే కాక మొత్తం భారత దేశ సంస్కృతి గొప్పదనాన్ని ప్రతిబింబింప జేశారన్నారు.

విశాల

జాతీయ జెండా ముద్రించిన టీ షర్టులను విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

థానే: మహారాష్ట్రలో టి షర్టులపై త్రివర్ణ పతాకాన్ని ముద్రించి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. జనజాగృతి సమితి ఫిర్యాదుచేయడంతో నిందితులను డోంబివలికి చెందిన జలిందర్ కార్లికర్, అమర్ అదర్గిగా గుర్తించినటు థానే పోలీస్ స్టేషన్ సీనియర్ ఇన్స్పెక్టర్ వివిం పవార్ తెలిపారు. జాతీయ పతాకాన్ని ముద్రించిన టి షర్టులనన్నింటిని సీజ్ చేశామన్నారు. ఎంబ్లమ్ అండ్ నేమ్స్ యాక్టు-1950, ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ హానర్ యాక్టు-1971, ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా-2002 ప్రకారం జాతీయ జెండాను యూనిఫాంలు, ఎంబ్రాయిడరీ, కర్చీఫ్‌లు,ఇతర దుస్తులపై ముద్రించడం నేరంగా పరిగణిస్తారని పోలీస్ అధికారి తెలిపారు.

కన్యాకుమారిలో శ్రీవారి ఆలయం



తిరుపతి: తమిళనాడులోని కన్యాకుమారిలో భారీ ఎత్తున నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆదివారం ఆ ఆలయాన్ని భక్తుల సందర్శనార్థం ప్రారంభించింది. రూ. 22.5 కోట్లతో ఈ ఆలయాన్ని తిరుమలలోని శ్రీవారి ఆలయానికి ప్రతిరూపంగా భారీ ఎత్తున నిర్మించారు. బంగాళాఖాతం, హిందుమహాసముద్రం, అరేబియా సముద్రం సంగమ స్థానంలో ఉన్న కన్యాకుమారిలో నిర్మించిన ఈ ఆలయం ప్రారంభోత్సవం ఆదివారం ఉదయం జరిగిందని ఆలయాధికారి ఒకరు తెలిపారు. ఈ ఆలయ ప్రారంభోత్సవానికి టిటిడి కార్యనిర్వాహక అధికారి ఎకె సింఘాల్‌తో సహా దేవస్థానం ఉన్నతాధికారులు అనేకమంది విచ్చేశారు. ఇలా ఉండగా....శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాన్ని పోలిన ఆలయాన్ని రూ 5.75కోట్లతో చెన్నైలో భారీ ఎత్తున నిర్మించాలని, అలాగే నగరంలో శ్రీవారి ఆలయాన్ని కూడా నిర్మించాలని కూడా టిటిడి నిర్ణయించిందని ఆ అధికారి వెల్లడించారు. ఇందుకు తమిళనాడు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించవలసి ఉందని ఆయన తెలిపారు.

జమ్మూకశ్మీర్‌లో బస్సు బోల్తా, ఇద్దరి మృతి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఆదివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆదివారం జమ్మూ-పటాన్ కోట్ జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడడంతో మహిళా సహా ఇద్దరు మృతి చెందగా, 24 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన భక్తులు వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తుండగా అమృత్‌సర్ వద్ద బస్సు డివైడర్‌ను ఢీకొట్టినట్లు వారు తెలిపారు. గాయపడ్డవారిని వెంటనే సహాయక బృందాలు కథువా ఆస్పత్రికి తరలించాయి. గాయపడ్డవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు, 8మంది మృతి



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం చంపావత్ జిల్లాలో కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లడంతో ఎనిమిది మంది మృతి చెందగా, 10 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. బారాకోట్ నుంచి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఘాట్‌కు తీసుకెళ్తుండగా లోహఘాట్ ప్రాంతంలో ఘటన చోటు చేసుకుందని చంపావత్ ఎస్‌పి ధీరేంద్ర గంజ్యాల్ తెలిపారు. ఘటనా స్థలాన్ని సందర్శించి గాయపడ్డవారిని వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

'యూరి' చూసిన నిర్మలా సీతారామన్

బెంగళూరు: రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ కొందరు యుద్ధ నిపుణులతో కలిసి ఇక్కడి ఒక థియేటర్‌లో 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్' సినిమాను చూశారు. ఇక్కడి సెంట్రల్ స్పిరిట్ మాల్‌లో ఈ చిత్రాన్ని చూసిన రక్షణ మంత్రి 'చాలా ఉత్తేజితంగా ఉంది' అని ఇక్కడి నుంచే ట్వీట్ చేశారు. సినిమా చూడ్డానికి ఆమె హాలులోకి వస్తున్నప్పుడు అక్కడ ఉన్న ప్రేక్షకులు..భారత్ మాతాకీ జై..వందేమాతరం' అని నినాదాలు చేశారు. ఆ సందర్భంగా తీసిన వీడియోను కూడా ట్వీట్ చేసిన నిర్మలా సీతారామన్ ఉత్సాహం ఎలా ఉంది? చివరికి ఈ రోజు ఈ సినిమా చూడ్డానికి వీలు కలిగింది. చాలా ఉత్తేజితంగా ఉంది. ఈ సినిమాలో నటించిన వికీ కౌశల్, యామీ గౌతమ్, డైరెక్టర్ ఆదిత్యధర్, నిర్మాత రోనీ స్క్రూవాలాకు అభినందనలు' అని సీతారామన్ ట్వీట్ చేశారు. సినిమా చూసిన నిర్మలా సీతారామన్ అక్కడ కొందరు పిల్లలు, ప్రజలతో సెల్ఫీలు దిగారు.

డబ్ల్యుహెచ్ఓ ప్రాంతీయ డైరెక్టర్‌గా పూనం

న్యూఢిల్లీ: పూనం ఖేత్రపాల్‌సింగ్‌ను ప్రపంచ ఆరోగ్యసంస్థలోని (డబ్ల్యూహెచ్‌ఓ) ఆగ్నేయాసియా ప్రాంతీయ డైరెక్టర్‌గా అయిదేళ్ల కాలానికి రెండోసారి కూడా నియమితులయ్యారు. ఆమె నియామకాన్ని డబ్ల్యుహెచ్ఓ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఏకగ్రీవంగా ధ్రువీకరించింది. మరో అయిదేళ్ల పాటు ఆమె ఆ పదవిలో ఉండేందుకు ఆ ప్రాంతానికి చెందిన పదకొండు దేశాలు ఏకగ్రీవంగా నామినేట్ చేశాయి. ఆమెను అభినందిస్తూ డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రియెసస్... డబ్ల్యుహెచ్ఓ ఆగ్నేయాసియా ప్రాంతానికి ప్రాంతీయ డైరెక్టర్‌గా నియమితులైన మొదటి మహిళ ఖేత్రపాల్‌సింగ్. ప్రాంతీయంగా మీరు చురుకైన నాయకత్వాన్ని అందించారు. ప్రపంచంలో నాలుగో వంతు జనాభా కలిగిన ఈ ప్రాంతంలో వ్యాధులు వంటి అనేక సమస్యలు అస్తవ్యస్త పరిస్థితులు ఉన్నాయి. కానీ మీ నాయకత్వంలో ఈ ప్రాంతం గణనీయమైన ప్రగతి సాధించింది.' అని కొనియాడారు. పూనం ఖేత్రపాల్ సింగ్ కృతజ్ఞతలు తెలుపుతూ...మరోసారి ఈ పదవికి ఎంపిక కావడం గౌరవంగా భావిస్తున్నానన్నారు.

ఉత్తరాఖండ్‌లో తొలి తులిప్ గార్డెన్

పితోర్‌గఢ్: ఉత్తరాఖండ్‌లో మొట్టమొదటి సారిగా తులిప్ గార్డెన్‌ను పితోర్‌ఘడ్ జిల్లాలో రూ. 50 కోట్ల వ్యయంతో 50 హెక్టార్లలో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి లభించింది. ప్రతిపాదిత తులిప్ తోటను మడ్ గ్రామంలో చందక్ కొండ శిఖరంపై అటవీ భూమిలో కార్పొరేట్ సమాజిక బాధ్యతగా ఒఎన్‌జిసి అభివృద్ధి చేయనున్నట్లు పితోర్‌గఢ్ ఎంఎల్‌ఏ ప్రకాశ్ పంత్ తెలిపారు. దేశంలో శ్రీనగర్ తర్వాత రెండో తులిప్‌గార్డెన్, దాని కన్నా ఎక్కువ విస్తర్ణంలో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించేందుకు తులిప్ తోటను 13 జిల్లాల్లోని 13 ప్రదేశాలలో ఏర్పాటు చేయనున్నట్లు పంత్ తెలిపారు. హలాండ్‌కు చెందిన అందంగా ఆకర్శణీయంగా ఉండే తులిప్ పువ్వులు మార్చి నుంచి మే వరకు వికసిస్తాయి. రిటైర్డ్ హర్టికల్చర్ మాజీ డైరెక్టర్ ఐఎ ఖాన్ తెలిపారు.

ఉన్న కోటాకు ముప్పు లేదు

ప్రతిపక్షాలపై మోడీ ఎదురుదాడి • రిజర్వేషన్లకు గండి పడదు • వాచ్‌మెన్‌గా రక్షణకు భరోసా



మధురై : అగ్రవర్ణాల పేదలకు పది శాతం కోటాపై రాజకీయాలు చేయవద్దని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. కోటాపై విమర్శలకు దిగుతోన్న ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకు (ఇడబ్ల్యుఎస్) కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పది శాతం కోటా కల్పిస్తూ చట్టం తీసుకువచ్చింది. ఈ కోటాతో ఇప్పటివరకూ ఉన్న రిజర్వేషన్లపై ఎటువంటి ప్రభావం పడబోదని ప్రధాని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ ఆదివారం ఇక్కడ బిజెపి ర్యాలీలో పాల్గొన్నారు. తమిళనాడులో లోక్‌సభ ఎన్నికల ప్రచార శంఖం పూరించిన రీతిలోనే ఉద్వేగ ఉధృతస్థాయిలో ప్రసంగించారు. పది శాతం కోటాకు వక్రభాష్యాలు మానుకోవడం మంచిదని ప్రతిపక్షాలకు చురకలు పెట్టారు. కొన్ని వర్గాలలో ఆర్థిక వెనుకబాటు తనంతో తలెత్తుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని పదిశాతం కోటాను తీసుకువచ్చినట్లు చెప్పారు. అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించే ఈ చర్యకు దిగినట్లు వివరించారు. పాత కోటాకు ఎటువంటి ఇబ్బంది ఉండబోదని తెలిపారు. కొత్త కోటాతో దళితులు, ఆదివాసీలు, ఒబిసిల కోటాకు కోతలు పడుతాయనే వాదన అనుచితం అని కొట్టిపారేశారు. విద్యారంగం, ప్రభుత్వోద్యోగాలలో అందరికీ సమానావకాశాలు కల్పించేందుకు ఈ కోటా తీసుకువచ్చినట్లు వివరించారు. అందరికీ న్యాయం స్ఫూర్తితోనే పది శాతం కోటాకు చట్టం తీసుకువచ్చినట్లు తెలిపారు. రిజర్వేషన్ల ప్రక్రియతో ప్రయోజనం పొందుతున్న ఏ వర్గానికి ఇప్పటి కోటాతో ఎటువంటి నష్టం కలుగదని చెప్పారు. పది శాతం కోటాపై తమిళనాడులో కొందరు అనుమానాలు అపనమ్మకాలు కల్పించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. డిఎంకె, ఇతర పార్టీలు ఈ పదివాతం కోటాతో ఇప్పుడున్న రిజర్వేషన్ల శాతానికి గండి పడుతుందని విమర్శిస్తున్నాయి. ఆర్థిక ప్రాతిపదికన కోటా కల్పన అనుచితం అని, సామాజిక వెనుకబాటుతనమే రిజర్వేషన్లకు మూలం అని ఈ పార్టీలు స్పష్టం చేస్తున్నాయి. తమిళనాడుకు చెందిన కొన్ని స్వార్థశక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రధాని మోడీ పిలుపు నిచ్చారు. కోటాను పలు విధాలుగా అడ్డుకునే యత్నాలకు దిగడం రాజకీయ పార్టీల స్వార్థానికి ప్రతీక అవుతోందన్నారు. పేదలకు వ్యతిరేకంగా ఉండే రాజకీయ సంవిధానం లేదా ఆలోచనా విధానం మంచి పద్ధతి కాదని, దీని వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని ఆయన డిఎంకెపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. దేశ ప్రజలకు తాను వాచ్‌మెన్‌ను అని, ప్రజల కోసం అప్రమత్తంగా ఉంటోన్న ఈ కాపలాదారును తప్పించేందుకు ప్రతిపక్షాలు యత్నిస్తున్నాయని విమర్శించారు. తనను తొలిగించే ఏకైక లక్ష్యంతోనే వారు విభేదాలు వీడి మహాకూటమిగా జట్టు కడుతున్నారని అన్నారు. అవినీతి నేతలకు, అక్రమార్జనపరులకు ఇప్పుడు వాచ్‌మెన్ మోడీ అంటే భయం పట్టుకుందన్నారు. బంధుప్రీతి, అవినీతిని అంతమొందించేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకొంటోందని తెలిపారు. అవినీతి పరులను వదిలేది లేదని, ఆర్థిక నేరగాళ్లు చట్టానికి చిక్కకుండా విదేశాలకు ఉడాయించినా వదిలేదన్నారు. వారిని ఇక్కడికి పట్టితెప్పించి చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దేశంలో అవినీతికి పాల్పడి, బ్యాంకులకు ఇతరత్రా ఆర్థిక సంస్థలకు టోకరా ఇచ్చిన వారిని, దోచుకుతిన్న వారిని చట్టం ముందుకు తీసుకురావడం జరుగుతుందని హెచ్చరించారు. నేరాలకు పాల్పడినట్లుగా నిర్ధారణ అయితే వారు దేశంలో ఉన్నా, విదేశాలకు వెళ్లినా వదిలేదని స్పష్టం చేశారు. మాల్యా, నీరవ్, చోక్సీ ఇతరుల గురించి ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

చెన్నై నుంచి ఢిల్లీ దాకా సంచలనమే

తమ ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోందని ప్రధాని తెలిపారు. చెన్నై నుంచి ఢిల్లీ దాకా దీని ప్రభావం కనబడుతోందన్నారు. ఇప్పటివరకూ తప్పుడు కాంట్రాక్టు పనులతో బిల్లులు పొందిన వారు, పనులు జరగకుండా బిల్లులు తీసుకున్నవారు, సంక్షేమ పథకాల నిధులు తిన్నవారు ఇప్పుడు దిక్కుతోచని చిక్కులో పడ్డారని తెలిపారు. ఇటువంటి వారంతా ఇప్పుడు తనను దించేసేందుకు, వారి దోపిడికి అడ్డులేకుండా చేసుకునేందుకు ఒక్కటవుతున్నారని విమర్శించారు. వారంతా ఎంత పెద్ద కూటమిగా మారినా అదంతా కూడా భయంతో, ప్రతికూలతతో జరిగే తతంగం అని, అయితే నరేంద్ర మోడీ పేదల పక్షాననే స్థిరంగా నిలుస్తాడని చెప్పారు. ప్రతికూల శక్తులను తిప్పకొట్టాలని ఇక్కడి యువతకు తాను పిలుపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మధురైలో సభ ప్రసంగానికి ముందు ఆయన తమిళులకు వణక్కం చెప్పారు. మధురై ప్రాచీన తమిళ సంస్కృతి వేదిక అని కొనియాడారు. దివంగత నేత, మాజీ సిఎం జయలలితకు మోడీ నివాళులు అర్పించారు. అంతకు ముందు ప్రధాని మోడీ ఇక్కడికి సమీపంలోని తోప్పూర్‌లో ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశారు. తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాలకు ఈ వైద్య విజ్ఞాన కేంద్రం ఆరోగ్య ఆసరాను త్వరలోనే కల్పిస్తుందని చెప్పారు. దేశంలో పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కేంద్రం అన్ని చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. జాతీయ రహదారులు, విమాన మార్గాల విస్తరణలతో అన్ని ప్రాంతాల ప్రజల మధ్య సత్వర రాకపోకలకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. సార్వత్రిక ఆరోగ్య పరిరక్షణకు కేంద్రం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే ఎయిమ్స్ బ్రాండ్‌ను దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరింపచేయడం జరుగుతోందన్నారు. తోప్పూర్‌లో రూ 1264 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఎయిమ్స్‌కు శంకుస్థాపన ఇందులో భాగమే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పళనిస్వామి ఇతర నేతలు పాల్గొన్నారు.



రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సిసి కేడెట్లతో ఆదివారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గ్రూప్ ఫోటో దిగిన దృశ్యం

హర్యానాలోని జింద్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేడే

జింద్: హర్యానాలో నేడు జరగనున్న జింద్ అసెంబ్లీ ఉప ఎన్నికను శాంతియుతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అధికార బిజెపి, ప్రతిపక్ష ఐఎన్‌ఎల్‌డి, కాంగ్రెస్,ఐఎన్‌ఎల్‌డి నుంచి చీలిన జెపిపిల మధ్య బహుముఖ పోటీ నెలకొంది. ఐఎన్‌ఎల్‌డి శాసన సభ్యుడు చాంద్ మిద్ధా మృతి చెందడంతో ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అవసరమైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరుతుందని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

ప్రధానికి వచ్చిన మెమెంటోల వేలం



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి బహుమతిగా ఇచ్చిన మెమెంటోలను ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్ (ఎన్‌జిఎంఎ)లో ఆదివారం నుంచి వేలానికి పెట్టారు. ఈ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని 'నమామి గంగా' పథకానికి కేటాయించనున్నారు. వేలంలో ఉంచిన జ్ఞాపికలను ఆసక్తి గల వారు http://pmmementos.gov.inలో సెర్చ్ చేయవచ్చు. ఇత్తడి, సిరామిక్, వస్త్రం, గాజు, మెటాలిక్ తదితర తయారైన మెమోంటోలు వాటి ప్రాముఖ్యతను బట్టి వెలను రూ.100 నుంచి రూ.30 వేల వరకు నిర్ణయించారు. ప్రతి మెమోంటోపై ఎవరు, ఏ సందర్భంలో ప్రధానికి బహుమతిగా ఇచ్చారో చిన్న వివరణను ఉంచారు. బంగారంతో తాపిన రాధా కృష్ణుల విగ్రహం ఆధారిత వెల రూ.20 వేలుగా నిర్ణయించారు. 4.76 కిలోల ఈ విగ్రహాన్ని మోడీకి సూరత్‌లోని మాండవి నగర్ పాలిక బహూకరించింది. బిజెపి మాజీ ఎంపి సి నరసింహన్ బహుమతిగా ఇచ్చిన 2.22 కిలోల వెండి పళ్లాన్ని రూ.30 వేలుగా నిర్ణయించారు. వివిధ రంగుల గల షాలువాల కనీస వెల రూ.200లుగా నిర్ణయించారు. దేశ, విదేశాల్లో నుంచి ప్రధాని స్వీకరించిన 1900 బహుమతులను వేలంలో ఉంచినట్లు అంతకు ముందు సాంస్కృతిక శాఖ మంత్రి మహేశ్ శర్మ తెలిపారు.

తమిళనాడుకు నిండా అన్యాయం

మోడీకి ప్రతిపక్షాల నిరసనలు, నల్ల బెలూన్లు



మధురై : తమిళనాడు పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీకి ఆదివారం ఇక్కడ నల్లజెండాలతో నిరసనలు వెలువడ్డాయి. ప్రధాని రాకకు కొద్ది సేపటి ముందు పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు ప్రయోజనాలను విస్మరిస్తోందని, తమిళులకు ద్రోహం చేస్తోందని వైగో నాయకత్వంలో ఎండిఎంకె ఆధ్వర్యంలో ఆందోళన చెలరేగింది. ప్రధాని ఇక్కడికి రావడానికి ముందు ఎండిఎంకె నిరసనలకు దిగారు. పలు చోట్ల నల్లటి బెలూన్లు గాలిలోకి వదిలారు. దీనితో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో గుమికూడి ఉన్న వారిని చెదరగొట్టారు. కావేరీ నదీ జలాల పంపిణీ ఇతర కీలక విషయాలలో మోడీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ప్రధాని రావడానికి ముందు పట్టణంలో పలు చోట్ల ఈ ప్రతిపక్ష పార్టీ ఆధ్వర్యంలో నిరసన హోరు కన్పించింది. ఎయిమ్స్‌కు శంకుస్థాపన, బిజెపి బహిరంగ సభలో పాల్గొనేందుకు ప్రధాని మోడీ పర్యటన తలపెట్టారు. ఇక్కడ నిరసనల పర్వం అరెస్టుల తరువాత అరగంటకు ప్రధాని విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎయిమ్స్ వేదికకు కొద్ది దూరంలోనే పెరియార్ బస్సు స్టాండ్ వద్ద ఎండిఎంకె నిరసనలు జరిగాయి. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర బిజెవైఎం తరపున కార్యకర్తలు రంగంలోకి దిగారు. వారు వ్యంగ్యంగా వైగోకు స్వాగతం అంటూ పోస్టర్లు వెలువరించారు. ఇక తమిళులకు అత్యవసరం అయిన కావేరీ జలాల వివాద పరిష్కారానికి ఇతర కీలక అంశాలపై స్పందించకుండా కేంద్రం కావాలనే న్యూట్రినో, హైడ్రోకార్బన్ వ్యర్థాల ప్రాజెక్టులకు అనుమతిని ఇస్తోందని, దీనితో రైతాంగం ఉపాధి దెబ్బతింటోందని, సామాన్యులపై ప్రభావం పడుతోందని ఎండిఎంకె వర్గాలు మండిపడ్డాయి. కావేరీపై మెకెడటు వద్ద ఆనకట్టుకు అనుమతి ఇవ్వడం ద్వారా కేంద్రం కర్నాటక పట్ల ఆదరణ వ్యక్తం చేసిందని, తమిళనాడుపై కేంద్రం సవతి తల్లి ప్రేమ ప్రదర్శితం అయిందని విమర్శించారు. తమ నిరసనలు ఎయిమ్స్‌కు వ్యతిరేకంగా కావని, కేవలం ప్రధాని మోడీ తమిళనాడు వ్యతిరేక ధోరణిపై స్పందించేందుకే అని వివరణ ఇచ్చారు. ఇక ట్విట్టర్‌లలో మోడీ అనుకూల, వ్యతిరేక పోస్టింగ్‌లు వెల్లువెత్తాయి. గో బ్యాక్ మోడీ అంటూ, మధురై థ్యాంక్స్ మోడీ అంటూ , టిఎన్ వెల్‌కమ్స్ మోడీ అంటూ పోటాపోటీ వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి. ప్రధాని మోడీ పర్యటనకు ముందు ఎండిఎంకె నిరసనను రాష్ట్ర బిజెపి అధ్యక్షులు తమిళసాయి సౌందరరాజన్, కేంద్ర మంత్రి రాధాకృష్ణన్‌లు తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రానికి ఉపయుక్తమైన పనులకు ప్రధాని వస్తుండగా అడ్డుకోవడం అనుచితం అన్నారు.

కశ్మీర్ లోయలో తీవ్రంగా చలిగాలులు

చలికి వణుకుతున్న పంజాబ్, హిమాచల్

శ్రీనగర్: కశ్మీర్‌లోయలోని అన్ని వాతావరణ కేంద్రాల్లో ఉష్ణోగ్రత ఘనీభవన స్థాయికంటే తక్కువకు పడిపోవడంతో ఇక్కడ ఉధృతంగా చలిగాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ ఆదివారం తెలిపింది. శనివారం రాత్రి శ్రీనగర్‌లో కనీస ఉష్ణోగ్రత మైనస్ 1.4 డిగ్రీల సెలిసియస్ నమోదైంది. అంతకు ముందు రోజు రాత్రి నమోదైన 1.8 డిగ్రీల సెలిసియస్ కన్నా ఇది కాస్త ఎక్కువని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. కశ్మీర్ వ్యాలీకి ముఖద్వారమైన దక్షిణ కశ్మీర్‌లోని క్వాజీగుండ్‌లో మైనస్ 6.6 డిగ్రీల సెలిసియస్ నమోదైంది. అంతకు ముందురోజు రాత్రి రికార్డయిన మైనస్ 3.2 డిగ్రీల కన్నా నేటి ఉష్ణోగ్రత మరీ పడిపోయింది. ఇక సమీపంలో ఉన్న కోకెర్‌నాగ్‌లో గత రాత్రి మైనస్ 6.9 డిగ్రీల సెలిసియస్ నమోదైందని, ఇది దాదాపు అంతకు ముందు రోజుతో సమానంగానే ఉందని ఆయన చెప్పారు. ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా పట్టణంలో చలి తీవ్రత అధికమైంది. అంతకు ముందు రాత్రి మైనస్ 2.6 డిగ్రీల సెలిసియస్ నమోదు కాగా, గత రాత్రి మైనస్ 6.5 డిగ్రీలు నమోదైంది. ఇక గుల్మార్గ్ స్కై రిసార్ట్ అయితే చలికి గడ్డకట్టిందనే చెప్పాలి. ఇక్కడ శనివారం రాత్రి మైనస్ 12 డిగ్రీల సెలిసియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాం టూరిస్ట్ రిసార్ట్‌లో మైనస్ 13 డిగ్రీల సెలిసియస్ నమోదైంది. ఇక పంజాబ్, హిమాచల్‌లలో కూడా తీవ్రంగా చలిగాలులు వీస్తున్నాయి. అక్కడ కూడా ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీలో మైనస్ 5, సిమ్లా జిల్లాలోని కుఫ్రీలో మైనస్ 1.5 డిగ్రీల సెలిసియస్ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.



ఓటు వేయకుంటే బాధపడాలి



- ఓటరుగా నమోదు చేసుకోవాలని యువతకు పిలుపు
- ఓటు వేయడం పవిత్రమైన బాధ్యత
- మన్ కీ బాత్‌లో ప్రధాని

న్యూఢిల్లీ: ఓటువేయడం ఒక పవిత్రమైన బాధ్యత అని, ప్రజాస్వామ్యం ఇచ్చిన ఆ హక్కును వినియోగించుకోకుంటే ఆ తర్వాత బాధ పడాల్సి వస్తుందనీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం హితవు పలికారు. ఈ ఏడాది వేసవిలో లోక్‌సభకు ఎన్నికలు జరగబోతున్నాయి. కాబట్టి అర్హత ఉన్న యువత ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. తన సామర్థ్యంతో ఎన్నికల్ని కరెక్ట్‌గా నిర్వహిస్తోందని ప్రతినెలా చేసే మన్ కీ బాత్... రేడియో ప్రసంగంలో ఎన్నికల సంఘాన్ని ప్రధాని ప్రశంసించారు. 21వ శతాబ్దంలో పుట్టినవారు ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారి ఓటు వేయబోతున్నారని ఆయన పేర్కొన్నారు. 'దేశ బాధ్యతల్లో పాలుపంచుకునే అవకాశాన్ని వారు పొందబోతున్నారు. జాతి కలను, వారి కలల్ని సాకారం చేసుకునే సమయం ఆసన్నమైంది. దేశ నిర్మాణ యాత్రలో వారు పాలుపంచుకోవాలి' అని ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆకాంక్షించారు. ఓటు హక్కును పొంది ఓటు వేయడం జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టమని, ఒక ఘన విజయమని ప్రతి ఓటరూ గుర్తించాలి. ఓటు వేయడం ఒక పవిత్ర బాధ్యత అనే భావన ప్రతివారి లో సహజంగానే పెంపొందాలి. దేశంలో ఏదైనా తప్పు జరిగితే తను ఓటు వేయకపోబట్టే ఇలా జరిగిందేమో అని అనుకోవాల్సి వస్తుంది. కాబట్టి ప్రజలు తమ బాధ్యతను గుర్తించాలి' అని నరేంద్ర మోడీ జనం సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకొని చెప్పారు. ఓటరు నమోదు, ఓటు వేయడం గురించి ప్రముఖులు ముందుకు వచ్చి ప్రచారం చేసి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి. అర్హతగల యువత అధిక సంఖ్యలో ముందుకు వచ్చి ఓటరుగా నమోదు చేసుకుని, మన ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరచడంలో పాలుపంచుకుంటారని నేను భావిస్తున్నాను' అని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశం రిపబ్లిక్ గా అవతరించడానికి ఒక రోజు ముందు అంటే జనవరి 25న ఎన్నికల సంఘం పనిచేయడం ప్రారంభమైందని మోడీ గుర్తుచేశారు. ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి వ్యక్తీ ఓటు వేసేందుకు కల అన్ని అవకాశాలనూ దేశం వినియోగించుకుంటుందని ఆయన చెప్పారు. దేశంలో అత్యంత మారు మూల ప్రదేశాల్లో ఉన్న ప్రజలు కూడా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సిబ్బంది కల్పించారని నరేంద్ర మోడీ ప్రత్యేకించి పేర్కొన్నారు.

పటేదార్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ ఓ ఇంటివాడయ్యాడు. చిన్ననాటి స్నేహితురాలు కింజల్ పరీక్‌ను పెళ్లాడాడు. గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లా దిగ్సర్ గ్రామంలో ఆదివారం ఈ వివాహం నిరాడంబరంగా జరిగింది





Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666